www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 25-1-2026 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 319 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: సప్తమి రా.11.11 తదుపరి అష్టమి, నక్షత్రం: రేవతి మ.1.36 తదుపరి అశ్వని, వర్జ్యం: లేదు దుర్ముహూర్తం: సా.4.33-5.18, అమృతఘడియలు: ఉ.11.16-12.49, తె.5.39 మొదలు, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.52, సూర్యాస్తమయం: 6.02 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అమరావతిని అడ్డుకోలేరు



రాష్ట్రానికి ఇదే శాశ్వత రాజధాని.. ప్రపంచ శ్రేణి నగరంగా తీర్చిదిద్దుతా: సీఎం

- కరెంటు చార్జీలు పెంచం
- జగన్ ప్రభుత్వం 32 వేలకోట్లు పెంచింది
- రాష్ట్రాన్ని గంజాయికి కేంద్రంగా మార్చింది
- ప్రభుత్వ ఉద్యోగులకు వేల కోట్ల బకాయిలు
- ఆఖరికి దేవుడి నెయ్యినీ కల్తీ చేశారు
- నేను క్రెడిట్ చోరీ చేశానంటున్నారు
- అసలు జగన్‌కేం క్రెడిట్ ఉంది?
- ఇలాంటి వారితో అప్రమత్తంగా ఉండండి
- మేం వచ్చాక 18 నెలల్లోనే 20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి
- దేశానికి వచ్చినవాటిలో ఏపీకే 25 శాతం
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో సీఎం చంద్రబాబు



ప్రజావేదిక సభలో గ్రీన్ అంబాసిడర్లు, పారిశుధ్య కార్మికులను సన్మానించిన సీఎం

నగరి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 'అమరావతి విషయంలో నాటకాలు వేశారు. మూడు ముక్కలాట ఆడారు. అమరావతిని శ్మశానం అన్నారు. కేసులు వేశారు. అడ్డుకుంటానని జగన్ మళ్లీ ప్రకటించారు. ఎవరు అడ్డుకున్నా ప్రపంచ శ్రేణి నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతా. రాష్ట్ర రాజధానిగా అమరావతి శాశ్వతంగా ఉంటుంది. ఎన్ని కుయుక్తులు పన్నినా అమరావతిని అడ్డుకోలేరు' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. శనివారం చిత్తూరు జిల్లా నగరిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కరెంటు చార్జీలు పెంచడం లేదని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో రూ.32 వేల కోట్ల చార్జీలను

మిగతా 13వ పేజీలో...

అవినీతి మకిలికి 'ఆరోపణల' ముసుగు!



ఒకప్పుడు ప్రభుత్వంలో జరిగిన అవకతవకలు, అక్రమాలను మీడియా లేదా ప్రతిపక్షాలు వెలుగులోకి తెచ్చినప్పుడు వెంటనే చర్యలు ఉండేవి. అందుకు బాధ్యులైన మంత్రులు రాజీనామా చేసేవారు. ఆ తర్వాత కొంత కాలానికి విచారణ పేరిట కాలయాపన చేయడం జరిగేది. దివంగత రాజశేఖర రెడ్డి అధికారంలోకి వచ్చాక మొదటిసారిగా ఎదురు దాడి మొదలైంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజశేఖర రెడ్డి ప్రారంభించిన కమీషన్ల విధానం ఇప్పుడు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల సీఎంలకూ ఆదర్శంగా మారింది. కాకపోతే ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పర్సెంటేజీ అమల్లో ఉంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం చేపట్టే పనులకు మాత్రమే పోటీతత్వంతో కూడిన టెండర్లు దాఖలవుతున్నాయి.

తాను రాజశేఖర రెడ్డి అనుచరుడినని, ఆయనపై కోపం తనపై తీర్చుకుంటున్నారని నన్ను దృష్టిలో పెట్టుకొని భట్టి విక్రమార్క విమర్శలు చేశారు. ఎప్పుడో పదహారేళ్ల క్రితం చనిపోయిన రాజశేఖర రెడ్డిపై ఎవరికి మాత్రం ఎందుకు కోపం ఉంటుంది? చిల్లర వార్తలకు భయపడబోనని భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు. చిల్లర వ్యవహారాలు హద్దు దాటినప్పుడు రాతలతో వాతలు పెట్టాలని జర్నలిజంలో మా గురువులు మాకు నేర్పారు. అందుకనే నైనీ బ్లాక్ వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకొని వచ్చాను.

నేను వెలుగులోకి తెచ్చిన కథనం గల్లీ నుంచి ఢిల్లీ దాకా ప్రకంపనలు సృష్టించింది. కేంద్ర బొగ్గు శాఖ అధికారులు అత్యవసరంగా సమావేశమై పరిస్థితిని సమీక్షించడం ఒక జర్నలిస్టుగా నాకు గర్వకారణం. నైనీ కోల్‌బ్లాక్‌కు పిలిచిన టెండర్లు రద్దు చేయడం నా కృషికి లభించిన విజయంగానే భావిస్తాను.

కొత్త పలుకు

ఆర్కే విశ్లేషణ 4లో..

ప్రియుడు దక్కలేదని.. హెచ్‌ఐవీ ఇంజెక్షన్

డాక్టర్ భార్యకు ప్రాణాంతక రక్తాన్ని ఎక్కించిన నర్సు

- కర్నూలులో నిర్ఘాంతపోయే ఘటన.. ఇంజెక్షన్ చేయడానికి ఇతరుల సాయం
- సినిమా సీన్ తలపించేలా నాటకం.. స్కూటీని ఢీకొట్టి సహాయం చేస్తున్నట్లు డ్రామా
- ఇంజెక్షన్ చేసి అక్కడి నుంచి పరారీ.. నలుగురు నిందితుల గుర్తింపు

14

'ప్రియుడి' భార్య, కుమారుడు, తల్లికి నిప్పు

గుంటూరు జిల్లాలో ఘోరం

భారత స్పేస్ స్టేషన్ పనులు ప్రారంభం!

» సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటులో ముందడుగు

బెంగళూరు, జనవరి 24: అంతరిక్షంలో భారతదేశానికి సొంతంగా ఒక శాశ్వత అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించేందుకు ఇస్రో కీలక ముందడుగు వేసింది. భారతీయ అంతరిక్ష స్టేషన్ (బీఏఎస్) నిర్మాణానికి సంబంధించి ఇస్రో ప్రాథమిక పనులను(గ్రౌండ్‌వర్క్) ప్రారంభించింది. ఇందులో భాగంగా అంతరిక్ష కేంద్రం మొదటి మాడ్యూల్‌ను నిర్మించడంలో సహకరించేందుకు ఇస్రోకు చెందిన విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ (వీఎస్ఎస్‌సీ) భారతీయ ఏరోస్పేస్ తయారీ కంపెనీలను ఆహ్వానించినట్లు తెలిపింది. మొదటి మాడ్యూల్ బీఏఎస్-01 నిర్మాణానికి సంబంధించిన రెండు పూర్తి సెట్లను అభివృద్ధి చేసేందుకు ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ)ను జారీ చేసింది. 2035 నాటికి భారతీయులను నివాసయోగ్యమైన అంతరిక్ష ప్రయోగశాలకు పంపే దిశగా ఇది మొదటి అడుగుగా భావిస్తున్నారు. 2028లో ఈ మొదటి మాడ్యూల్‌ను భూకక్ష్యలోకి ప్రయోగించే అవకాశం ఉంది.

ఓటర్ల జాబితాలో తప్పులుంటే బీఎల్‌వోలపై చర్యలు

న్యూఢిల్లీ, జనవరి 24: ఓటర్ల జాబితా తయారీలో క్షేత్ర స్థాయిలో పని చేసే బూత్ లెవల్ అధికారి(బీఎల్‌వో) కీలకం. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడడం, జాబితా తయారీ పారదర్శకంగా, విశ్వసనీయతను కలిగి ఉండడంపై ఎలక్షన్ కమిషన్(ఈసీ) మరింతగా దృష్టి పెట్టింది. బీఎల్‌వోలు నిర్లక్ష్యంగా వ్యవహరించినా, విధుల్లో ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినా చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ మేరకు కఠినమైన మార్గదర్శకాలను జారీ చేసింది. బీఎల్‌వో నేరపూరిత దుష్ప్రవర్తనకు పాల్పడ్డాడని జిల్లా ఎన్నికల అధికారి భావిస్తే రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) ఆమోదంతో ఎఫ్ఐఆర్ నమోదు చేయవచ్చని తెలిపింది. ఇలాంటి కేసుల్లో క్రమశిక్షణ చర్యలను సీఈవో ముందస్తు అనుమతి లేకుండా ముగించడానికి వీలులేదని పేర్కొంది.

ఆమె ఐపీఎస్.. ఆయన ఐఏఎస్
నిరాడంబరంగా పెళ్లి



» చౌటుప్పల్ సబ్-రిజిస్ట్రార్ ఆఫీసులో దండలు మార్చుకొని ఒక్కటైన జంట

చౌటుప్పల్ రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఈ రోజుల్లో పెళ్లంటే పెద్ద ఎత్తున హంగామా! ప్రీ-వెడ్డింగ్ షూట్, మెహందీ, హల్దీ, సంగీత్, ఎదుర్కోళ్లు, వందల మంది అతిథుల మధ్య రిసెప్షన్ ఇలా రూ.లక్షల్లో, కోట్లలో ఖర్చు! పైగా ఓ రెండు నెలల ముందు నుంచే ఎన్నో పనులు.. టెన్షన్లు! మరి.. ఆ వధూవరులు సివిల్ సర్వీస్ అధికారులైనప్పుడు ఆ హంగూ ఆర్భాటాలు ఇంకే స్థాయిలో ఉండాలి! కానీ.. ఆ జంట అత్యంత నిరాడంబరంగా వివాహ బంధంతో ఒక్కటైంది. సింపుల్‌గా రిజిస్టర్ మ్యారేజ్ చేసుకొని.. పెళ్లి కోసం అప్పులు చేసి మరీ భారీగా ఖర్చు పెడుతున్న మధ్య తరగతి కుటుంబాలకు గొప్ప సందేశాన్నిచ్చింది. ఆ వధూవరులు.. సుర్యాపేట శేషాద్రిని రెడ్డి (29), నల్లొండ శ్రీకాంత్ రెడ్డి (28). శేషాద్రిని రెడ్డి స్వస్థలం యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెం. ఆమె 2021 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. కుత్బుల్లాపూర్ ట్రాఫిక్ డీసీపీగా పనిచేస్తున్నారు. శ్రీకాంత్ రెడ్డి స్వస్థలం ఏపీ కడప జిల్లా ఓబుల్ గాండ్లపల్లి. 2025 బ్యాచ్‌కు చెందిన ట్రైనీ ఐఏఎస్. శేషాద్రిని-శ్రీకాంత్ పెళ్లిని పెద్దలు నిర్ణయించారు. శనివారం చౌటుప్పల్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో కొద్ది మంది కుటుంబసభ్యుల సమక్షంలో వివాహం చేసుకున్నారు. ఆర్భాటాలకు పోకుండా నిరాడంబరంగా పెళ్లిళ్లు జరగాలనే సందేశాన్నివ్వాలని నిర్ణయం తీసుకున్నామని, ఇందుకు మార్గదర్శకులుగా ఉండాలనే ఇలా అతి సాదాసీదాగా వివాహం చేసుకున్నామని యువ దంపతులు తెలిపారు.

భారత్‌పై సుంకాలు తగ్గొచ్చు!

25 శాతం తగ్గించే అవకాశం.. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ వెల్లడి

» మీ రక్షణ బాధ్యత, ఖర్చులు మీవే

» మిత్రదేశాలకు అమెరికా స్పష్టీకరణ



వాషింగ్టన్, జనవరి 24: భారత్‌పై విధించిన 50 శాతం ప్రతీకార సుంకాలను త్వరలోనే సగానికి తగ్గించే అవకాశం ఉందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ తెలిపారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లకుగాను విధించిన 25 శాతం సుంకాలను త్వరలోనే ఎత్తివేసే అవకాశం ఉన్నట్లు చెప్పారు. పొలిటికో వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయం వెల్లడించారు. 'భారత్‌పై మేము విధించిన 25 శాతం (రష్యా నుంచి చమురు కొనుగోలుపై) సుంకాలు గొప్ప విజయం సాధించాయి. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు పూర్తిగా తగ్గిపోయాయి. సుంకాలు మాత్రం ఇంకా కొనసాగుతున్నాయి. వాటిని త్వరలోనే రద్దు చేసే అవకాశం ఉందని భావిస్తున్నాను' అని పేర్కొన్నారు. భారత్- అమెరికా మధ్య వాణిజ్య లోటు అధికంగా ఉందన్న సాకుతో 25 శాతం, రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు 25 శాతం కలిపి మొత్తం 50 శాతం ప్రతీకార సుంకాలు విధించిన విషయం తెలిసిందే. గత ఏడాది ఆగస్టు 27 నుంచి ఈ సుంకాలు అమల్లోకి వచ్చాయి. కాగా, భారత్‌తో వాణిజ్య ఒప్పందం కోసమే యూరోపియన్ యూనియన్ తమలాగా భారత్‌పై సుంకాలు విధించకుండా వెనక్కి తగ్గిందని బెసెంట్ తెలిపారు. భారత్ నుంచి శుద్ధిచేసిన ఎనర్జీ ఉత్పత్తులను యూరోపియన్లు కొనుగోలు చేయడం మూర్ఖత్వమని విమర్శించారు. కాగా, చైనాతో వాణిజ్య ఒప్పందం చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్న కెనడాపై 100 శాతం సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. చైనా వస్తువులను అమెరికాలోకి తరలించేందుకు తన దేశాన్ని చైనాకు గోదాములా మార్చేయాలని కెనడా ప్రధాని మార్క్ కార్నీ ప్రయత్నిస్తున్నారని శనివారం విమర్శించారు. ఈ ప్రయత్నాలను ఆపకపోతే అమెరికాలోకి వచ్చే కెనడా వస్తువులపై 100 శాతం సుంకాలు విధిస్తానని స్పష్టంచేశారు.

అమెరికా నూతన జాతీయ రక్షణ వ్యూహం

'అమెరికా ఫస్ట్' అన్న తన నినాదాన్ని ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ మరింత ముందుకు తీసుకు వెళ్తున్నారు. దీనిలో భాగంగానే తమ జాతీయ రక్షణ వ్యూహంలో కీలక మార్పులు చేశారు. ఇకపై అమెరికా మిత్రదేశాలు వారి భద్రతను వారే చూసుకోవాలని అమెరికా తేల్చి చెబుతోంది. ఈ మేరకు అమెరికా రక్షణ శాఖ కార్యాలయం 34 పేజీలతో కూడిన జాతీయ భద్రతా వ్యూహాన్ని రూపొందించింది. 2022 తర్వాత తొలిసారి రూపొందించిన అమెరికా రక్షణ వ్యూహం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇప్పటివరకు మిత్రదేశాల రక్షణ ఖర్చులను గతంలోని అమెరికా ప్రభుత్వాలు భరించాయని, ఇకపై ఆ బాధ్యత తీసుకోబోమని, ఇది అమెరికాకు భారంగా మారిందని ఈ విధానం పేర్కొంది. మిత్రదేశాలు వాటి రక్షణ ఖర్చులను వారే పెట్టుకోవాలని స్పష్టం చేసింది. యూరప్‌నుంచి ఆసియా వరకు ఉన్న అనేక మిత్రదేశాలు అమెరికా పైనే ఆధారపడి తమ రక్షణ వ్యవస్థలను బలోపేతం చేసుకోలేదని చెప్పింది. ఇకపై రష్యా, ఉత్తర కొరియా వంటి దేశాలనుంచి వచ్చే ముప్పును ఎదుర్కోవడంలో వారే కీలకంగా వ్యవహరించాలని తెలిపింది.

భారత్-ఈయూ ఎఫ్‌టీఏతో 90 శాతానికిపైగా ఇండియా ఎగుమతులపై సుంకాలుండవ్!

న్యూఢిల్లీ, జనవరి 24: భారత్, యూరోపియన్ యూనియన్(ఈయూ) మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదిరే దిశగా చర్చలు జరుగుతున్నాయి. ఈ నెల 27న ఈ చర్చలు ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో భారత్, ఈయూ మధ్య ఎఫ్‌టీఏ కుదిరితే మన దేశం నుంచి ఈయూకు వెళ్లే 90 శాతానికి పైగా ఉత్పత్తులపై ఎలాంటి దిగుమతి సుంకాలు ఉండబోవని అనుకుంటున్నారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తుల ద్వారా తెలుస్తోంది. భారత వైద్య ప్రయోజనాలను కాపాడటంతో పాటు, వ్యవసాయ ఉత్పత్తులను దీని నుంచి మినహాయించే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. వచ్చే వారంలో జరిగే భారత్-ఈయూ శిఖరాగ్ర సమావేశంలో రెండింటి మధ్య భాగస్వామ్యం కొత్త దశకు చేరుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద చర్చలను ముగించడంతోపాటు కొత్త రక్షణ, భద్రతా భాగస్వామ్యాన్ని భారత్, ఈయూ ప్రకటించే అవకాశం ఉందంటున్నారు.

దాడికి రెడీ!

» ఇరాన్ సమీపానికి చేరుకున్న అమెరికా యుద్ధ నౌకల బృందం



వాషింగ్టన్/న్యూఢిల్లీ, జనవరి 24: ఇరాన్‌పై దాడికి అంతా సిద్ధమవుతోంది. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ విమాన వాహక యుద్ధ నౌక నేతృత్వంలోని అమెరికా నౌకాదళం ఇరాన్ సమీపానికి చేరుకుంది. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ఇరాన్‌లోని కీలక ప్రాంతాలపై దాడి చేసేందుకు వీలైన ప్రాంతంలో సిద్ధంగా ఉన్నట్టు అమెరికా అధికారులు వెల్లడించారు. ఇక పర్షియన్ గల్ఫ్ ప్రాంతం, బహ్రెయిన్‌లోని సైనిక స్థావరాల్లోని బలగాలను అమెరికా అప్రమత్తం చేసింది. పదుల సంఖ్యలో మిలిటరీ రవాణా విమానాలు, యుద్ధ విమానాలను గల్ఫ్‌లోని ఆ స్థావరాలకు పంపించింది. మరోవైపు అమెరికా మిత్రదేశం యూకే ఖతార్‌లోని స్థావరానికి రక్షణగా పదుల సంఖ్యలో టైఫూన్ జెట్లను తరలించింది. భారీగా మిలిటరీ మోహరింపు నేపథ్యంలో అమెరికా ఎలాంటి దాడికి దిగినా అది పూర్తిస్థాయి యుద్ధమే అవుతుందని ఇరాన్ హెచ్చరించింది. అమెరికా బలగాల మోహరింపు నేపథ్యంలో పశ్చిమాసియా ప్రాంత దేశాలకు పలు యూరోపియన్ విమానయాన సంస్థలు తమ సర్వీసులను నిలిపివేస్తున్నాయి. పశ్చిమాసియా మీదుగా తూర్పు దేశాలకు నిర్వహించే సర్వీసులను కూడా ఇతర మార్గాల మీదుగా మళ్లిస్తున్నాయి. ఇజ్రాయెల్, సౌదీ, దుబాయ్, బహ్రెయిన్‌లకు విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్టు సంస్థలు ప్రకటించాయి.

లోకం తీరు



'సిందూర్' వేళ అణుముప్పు లేదు!

» ట్రంప్ వ్యాఖ్యలు రాజకీయం కోసమే

» ఓ ఇంటర్వ్యూలో ఐఏఈఏ చీఫ్ గ్రాస్సీ

దావోస్, జనవరి 24: 'ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌లో ఎలాంటి అణు ముప్పు జరగలేదని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ) చీఫ్ రాఫెల్ గ్రాస్సీ తెలిపారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సుకు హాజరైన గ్రాస్సీ ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను పంచుకున్నారు. "ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ అణ్వాయుధ నిల్వల భద్రత గురించి ఆందోళన వ్యక్తమైంది. కానీ, అలాంటి ముప్పేమీ మా దృష్టికి రాలేదు." అని చెప్పారు. పాకిస్థాన్, చైనా, ఇరాన్, రష్యా, ఉత్తర కొరియాలు భూగర్భంలోని లోతైన ప్రాంతాల్లో అణు పరీక్షలను తిరిగి ప్రారంభించాయంటూ.. కొన్ని మాసాల కిందట ట్రంప్ చేసిన వ్యాఖ్యలను గ్రాస్సీ తోసిపుచ్చారు. ట్రంప్ వ్యాఖ్యలు కేవలం రాజకీయ పరమైనవేనని వ్యాఖ్యానించారు. "ఆ విధంగా పరీక్షలు జరిగినట్టు ఎలాంటి రికార్డులు లేవు. సహజంగా ఇలాంటి ప్రకటనలు రాజకీయ కోణంలోనే ఉంటాయి" అని అన్నారు. ఎవరో చేసిన వ్యాఖ్యలను ఆధారంగా చేసుకుని తాము కార్యకలాపాలు చేపట్టబోమని తెలిపారు. ఇప్పటి వరకు అణు పరీక్షలు ఎవరూ చేయలేదన్నారు. "మనం చూసింది డెలివరీ సాధనాల పరీక్ష, నిర్వహణ మాత్రమే. ఇది అణ్వాయుధాలకు భిన్నంగా ఉంటుంది" అని ఆయన వివరించారు.

సత్యదేవుడి ప్రసాదం విక్రయ కేంద్రంలో ఎలుకల నివారణకు చర్యలు

▸▸ స్టెయిన్‌లెస్ స్టీల్ ర్యాక్‌ల ఏర్పాటు



ప్రసాద విక్రయ కేంద్రంలో అమర్చిన స్టెయిన్‌లెస్ స్టీల్ ర్యాక్‌లు

అన్నవరం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అన్నవరం జాతీయ రహదారిపై ఉన్న సత్యదేవుడి పాత నమానాలయం ప్రసాదం కౌంటర్లలో ఎలుకల స్వైర విహారంపై దేవస్థానం అధికారులు స్పందించారు. ఎలుకల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకున్నారు. విక్రయ కేంద్రంలో ప్రసాదం గంపలు ఉంచేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్‌తో రూపొందించిన ర్యాక్‌లు అమర్చారు. విక్రయ కేంద్రంలో రంధ్రాలన్నింటినీ మూసివేశారు. పైభాగంలో సీలింగ్ చేయించడంతోపాటు హైలామ్ షీట్స్ అమర్చారు. దిగువ భాగమంతా పూర్తిగా ఫ్లోరింగ్ చేసినట్టు దేవస్థానం ఇంజనీరింగ్ విభాగ అధికారులు, ప్రసాదం విభాగ అధికారులు తెలిపారు. ఎలుకలు ప్రత్యక్షమైన పాత నమానాలయ కౌంటర్‌తోపాటుగా జాతీయ రహదారిపై నూతన నమానాలయ కౌంటర్, తొలిపావంచా వద్దనున్న ప్రసాదం కౌంటర్లను ఈవో త్రినాథరావు ఆదేశాలతో ప్రసాదం విభాగ సూపరింటెండెంట్ రామకృష్ణ, పోల్నాటి లక్ష్మీనారాయణ పరిశీలించారు.

అమరావతిలో జ్యోతిరావు పూలే స్మృతి వనం

▸▸ ఏప్రిల్ 11న సీఎం శంకుస్థాపన: మంత్రి సవిత

గొల్లపూడి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో మహాత్మా జ్యోతిరావు పూలే స్మృతి వనం నిర్మించనున్నట్టు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. పలు బీసీ సంఘాల నేతలతో గొల్లపూడి బీసీ భవన్‌లో శనివారం మంత్రి సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ వచ్చే ఏప్రిల్ 11న జ్యోతిరావు పూలే 200 జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పూలే స్మృతి వనం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.



కాంతులీనుతున్న శ్రీవారి ఆలయం ఎదుట భక్తుల సందడి (ఇన్‌సెట్)కిటకిటలాడుతున్న మాడవీధులు

శ్రీవారికి నేడు సప్తవాహన సేవ

▸▸ రథసప్తమికి తిరుమల ముస్తాబు

▸▸ మాడ వీధులలో భక్తుల రద్దీ

▸▸ ముందు రోజు నుంచే కిటకిటలాడుతున్న గ్యాలరీలు

తిరుమల, జనవరి24(ఆంధ్రజ్యోతి): రథసప్తమి వేడుకలకు తిరుమల సర్వాంగసుందరంగా ముస్తాబైంది. ఆదివారం ఒకే రోజు ఏడు వాహనసేవలు జరగనున్నందున శనివారం నుంచే మాడవీధులు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఉదయం 5.30గంటలకు మొదలయ్యే వాహనసేవలు రాత్రి 9 దాకా సాగుతాయి. దాదాపు రెండున్నర లక్షలమంది భక్తులు తిరుమలకు చేరుకుంటారని అధికారుల అంచనా. అందుకు తగినట్టుగా వాహనసేవలు నిర్వహించే నాలుగు మాడవీధుల్లోని గ్యాలరీల్లో తొక్కిసలాటలు లేకుండా బారికేడ్లు అమర్చారు.

తెల్లవారుజాము నుంచి వాహనసేవలు

ఆదివారం ఉదయం 5 గంటలకు మలయప్పస్వామి ఆలయం నుంచి వాహనమండపానికి చేరుకుంటారు. అక్కడ సూర్యప్రభ వాహనంపై ఊరేగింపుగా వాయవ్య దిక్కుకు చేరుకుని సూర్యోదయం కోసం వేచివుంటారు. భానుడి కిరణాలు మలయప్పను తాకగానే హారతి సమర్పించి వాహనాన్ని ముందుకు కదిలిస్తారు. అప్పటి నుంచి రాత్రి వరకు వరుసగా చిన్నశేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వభూపాల, చంద్రప్రభ వాహనాలపై స్వామివారు ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తారు. సూర్యుడికి ప్రత్యేక రోజుగా భావించే ఆదివారం రోజే ఈ ఏడాది సూర్యజయంతి రావడం విశేషం. దీంతో సూర్యప్రభపై స్వామిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో శనివారం సాయంత్రానికే గ్యాలరీల్లో చేరిపోయారు.



ఆదిత్యుని దర్శనానికి క్యూలైన్లలో వేచిఉన్న భక్తులు

అరసవల్లిలో ఆదిత్యుని వైభవం

▸▸ అంగరంగ వైభవంగా రథసప్తమి వేడుకలు ప్రారంభం

శ్రీకాకుళం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష దైవం శ్రీ సూర్యనారాయణ స్వామి కొలువైన అరసవల్లి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. మాఘ శుద్ధ సప్తమి (రథసప్తమి) పర్వదినం ఆదివారం నాడే రావడంతో.. ఆదిత్యుని దర్శించుకునేందుకు ఉత్తరాంధ్ర నుంచే కాకుండా ఉభయ తెలుగు రాష్ట్రాలు, పొరుగు రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. శనివారం రాత్రి నుంచే క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక క్యూలైన్లు, సర్వదర్శనం ఏర్పాట్లు చేశారు. శనివారం అర్ధరాత్రి 12.30 గంటలకు వేదమంత్రోచ్చారణల నడుమ రథసప్తమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో ప్రధాన ఘట్టమైన స్వామివారి క్షీరాభిషేకం కనుల పండువగా సాగింది. అర్ధరాత్రి ఒంటిగంట నుంచి అర్చకులు మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం నిర్వహించగా...ఈ అపురూప ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు వేయికళ్లతో ఎదురుచూశారు. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించిన స్వామివారిని దర్శించుకుని పునీతులయ్యారు. ఆదివారం స్వామివారి నిజరూప దర్శనం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనుంది. సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు స్వామి వారి అలంకరణ సేవ జరగనుంది.

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రులు..

రాష్ట్ర ప్రభుత్వం తరపున వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు దంపతులు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, కలెక్టర్, ఎస్పీ తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ రవినాథ్ తిల్హరి

తిరుమల, జనవరి24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ రవినాథ్ తిల్హరి దర్శించుకున్నారు. న్యాయమూర్తులను రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

అట్టహాసంగా విశాఖ ఉత్సవ్ ప్రారంభం

▸▸ ఆర్కే బీచ్ రోడ్డులో కార్నివాల్

▸▸ రుషికొండలో హెలీ టూరిజం



విశాఖ ఉత్సవ్ ప్రారంభ కార్యక్రమంలో వేదికపై సెల్ఫీ తీసుకుంటున్న మంత్రి కందుల దుర్గేశ్. చిత్రంలో మంత్రులు వంగలపూడి అనిత, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, శాసనసభ్యులు గణబాబు, పంచకర్ల రమేశ్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు

విశాఖపట్నం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్సవ్ శనివారం సాయంత్రం సాగర తీరాన అట్టహాసంగా ప్రారంభమైంది. తొలుత ఆర్కే బీచ్ రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి కాళీమాత ఆలయం వరకూ వివిధ జానపద కళారూపాలతో కార్నివాల్ నిర్వహించారు. వాటితో పాటే మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు... అందరూ కలసి నడుచుకుంటూ బీచ్‌లో ఏర్పాటు చేసిన ప్రధాన వేదిక వద్దకు చేరుకున్నారు. వేదికపై సుమారు 42 అడుగులు వెడల్పున ఏర్పాటు చేసిన ఎల్‌సీడీ స్క్రీన్ విశేషంగా ఆకట్టుకుంది. రామకృష్ణా బీచ్‌లో ఉత్సవ వాతావరణం అలుముకుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి వేదికపై నుంచి 'విశాఖ ఉత్సవాలు ప్రారంభం' అని ప్రకటించిన తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించారు. గాయని సునీత తన పాటలతో అందరినీ అలరించారు. ఈ సందర్భంగా పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ, 'విశాఖపట్నం పర్యాటక రాజధానిగా వర్ధిల్లుతుంది. బిగ్గెస్ట్ బీచ్ ఫెస్టివల్‌గా నిర్వహిస్తున్న ఈ ఉత్సవానికి ప్రజలు కుటుంబాలతో సహా వచ్చి విజయవంతం చేయాలి' అని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాసరావు, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ, పర్యాటకాభివృద్ధి సంస్థ స్పెషల్ సెక్రటరీ అజయ్‌జైన్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు. శనివారం మధ్యాహ్నం రుషికొండ బీచ్‌లో మంత్రి కందుల దుర్గేశ్ హెలీ టూరిజాన్ని ప్రారంభించారు. రుషికొండను అడ్వంచర్ స్పోర్ట్స్ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు.



విశాఖ ఉత్సవ్ ప్రారంభం సందర్భంగా ఆకట్టుకున్న బాణసంచా వెలుగులు

వీఆర్వోలకు మెమోలు సరైందికాదు

▸▸ వేధింపులపై 1న విజయవాడలో అత్యవసర సమావేశం

▸▸ వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు

విజయవాడ (గాంధీనగర్), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గత ఇరవై రోజుల నుంచి గ్రామ సచివాలయాల్లో బయోమెట్రిక్ అటెండెన్స్ వేయడం లేదని వీఆర్వోలకు జీఎస్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ మెమోలు ఇవ్వడాన్ని ఏపీ వీఆర్వోల సంఘం తీవ్రంగా ఖండించింది. దీనిపై సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్.రవీంద్రరాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వీఆర్వోలకు వాట్సాప్ ద్వారా మెమోలు పంపించి మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని కోరుతున్నారన్నారు. బయోమెట్రిక్ అటెండెన్స్ అంశంపై గత నెల రాష్ట్ర సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో ఏపీ ఎఫ్ఆర్ఎస్‌ను కూడా పరిగణలోకి తీసుకుంటామని జీఎస్‌డబ్ల్యూఎస్ కార్యదర్శి కాంటనేని భాస్కర్ చెప్పారని, ఆ విధంగానే ముందుకు వెళ్లాలని సీఎం చంద్రబాబు సూచించారని పేర్కొన్నారు. వీఆర్వోలు ఏపీ ఎఫ్ఆర్ఎస్‌లో బయోమెట్రిక్ వేస్తున్నారని కనీసం పరిశీలించకుండా ఇలా మెమోలు ఇవ్వడం సరైందికాదన్నారు. సర్వేలు చేయాలని జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారులు ఒత్తిడి చేయడంపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. వచ్చే నెల 12న విజయవాడలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యాచరణ పై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ట్రావెల్స్ బస్సు దూకుడు

▸▸ ఆటోను, ఆర్టీసీ బస్సును ఢీకొట్టి ధ్వంసం

▸▸ ప్రయాణికుడి మృతి.. 14 మందికి గాయాలు

▸▸ మార్కాపురం జిల్లాలో ఘటన



ప్రమాదంలో నుజ్జయిన ట్రావెల్స్ బస్సు



జనార్దన్‌రెడ్డి

కొనకనమిట్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అతివేగంగా వెళ్తూ ఆటోను, ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన ఘటనలో ఓ ప్రయాణికుడు మృతి చెందగా, మరో 13 మందికి గాయాలయ్యాయి. మార్కాపురం జిల్లా కొనకనమిట్ల మండలం చినారికట్ల గ్రామ సమీప 565 జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కడప జిల్లా మైదుకూరు నుంచి విజయవాడకు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు చినారికట్ల సమీపంలోకి రాగానే రోడ్డు మార్జిన్‌లో ఆగి ఉన్న కట్టెల లోడు ఆటోను ఢీకొట్టింది. అనంతరం విజయవాడ నుంచి కనిగిరికి వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొని మార్జిన్‌లోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తున్న కడప జిల్లా మైదుకూరు మండలం చెన్నయ్యగారిపల్లికి చెందిన అన్నపురెడ్డి జనార్దన్‌రెడ్డి (50) మృతి చెందారు. అదే ట్రావెల్స్ బస్సులో 47 మంది ఉండగా 13మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సులో 15 మంది ప్రయాణికులు ఉండగా, వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పోలీసులు అంబులెన్స్‌లో కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ట్రావెల్స్ బస్సు డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమని ఎస్ఐ తెలిపారు. మృతిచెందిన జనార్దన్‌రెడ్డి రైతుల వద్ద వద్ద కూరగాయలు కొనుగోలు చేసి, విజయవాడ మార్కెట్‌లో విక్రయిస్తుంటారని బంధువులు తెలిపారు.

నేటి నుంచి బైబిల్ మిషన్ మహోత్సవాలు

▸▸ గుంటూరు సమీపంలో ప్రాంగణం సిద్ధం

▸▸ సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న క్రైస్తవ భక్తులు



బైబిల్ మిషన్ మహోత్సవాలకు సిద్ధమైన వేదిక

పెదకాకాని, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బైబిల్ మిషన్ 88వ మహోత్సవాలకు గుంటూరు సమీపంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట 100 ఎకరాల సువిశాల ప్రాంగణం సిద్ధమైంది. ఆదివారం నుంచి మూడు రోజులు జరిగే మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్ శనివారం తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు ఉచిత బస, భోజన, నీటి వసతి ఏర్పాటు చేశామన్నారు. భక్తుల భద్రతను దృష్టిలో పెట్టుకుని పోలీసులు, ప్రైవేటు సిబ్బందిని నియమించినట్టు చెప్పారు. ఆర్టీసీ, రైల్వే శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక రవాణా సదుపాయంతో మహోత్సవాల ప్రాంగణానికి శనివారం రాత్రికి భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చారు.



సాల్మన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంద కృష్ణమాదిగ

రాజకీయ ఘర్షణలతోనే హత్యలు

▸▸ సాల్మన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి: మంద కృష్ణమాదిగ

మాచవరం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రాజకీయ విభేదాలు, ఘర్షణలే హత్యలకు దారి తీస్తున్నాయని, పేదలనే బలి తీసుకుంటున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో ఇటీవల హత్యకు గురైన సాల్మన్ కుటుంబాన్ని ఆయన శనివారం పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సాల్మన్‌ది రెండు కులాల మధ్య జరిగిన హత్య కాదని.., రాజకీయ విభేదాలు, ఘర్షణలు తీవ్ర రూపం దాల్చడమే ఘటనకు కారణమన్నారు. రాయలసీమలో ఒకప్పుడు ఫ్యాక్షన్ ఎక్కువగా ఉండేదని, అక్కడ తగ్గుముఖం పట్టి పల్నాడు ప్రాంతంలో ముఖ్యంగా మాచర్ల, గురజాలలో దాడులు ఎక్కువయ్యాయన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకే వేదికపైకి వచ్చి హత్యల నివారణకు పిలుపు ఇవ్వాలని సూచించారు. పోలీసు వ్యవస్థ రాజ్యాంగ పరంగా ధ్రువీకరించబడిందని, వారు అధికారంలో ఉన్న ఏ పార్టీకి కొమ్ము కాయకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించినప్పుడే గ్రామాల్లో ఇలాంటి గొడవలకు, హత్యలకు అవకాశం ఉండదని మంద కృష్ణమాదిగ పేర్కొన్నారు. పోలీసులు గ్రామాల్లో సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించి వారిలో మార్పు తీసుకురావాలన్నారు. సాల్మన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

జమిలి ఎన్నికలతో సమర్థవంతమైన పాలన

▸▸ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్



కర్నూలు అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఒకేసారి జరిగే జమిలి ఎన్నికలతో సమర్థవంతమైన పాలన సాధ్యమవుతుందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ అభిప్రాయపడ్డారు. రాయలసీమ యూనివర్సిటీ సెనేట్ హాలులో బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 'ఒకే దేశం...ఒకే ఎన్నిక' అనే అంశంపై శనివారం జరిగిన సదస్సుకు న్యాయమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలను నిర్వహిస్తే అధిక వ్యయాన్ని అరికట్టవచ్చని, జమిలి ఎన్నికల నిర్వహణ గురించి అధ్యయనం చేయడానికి నియమించిన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ తన నివేదికలో ఈ దిశగా ఎన్నో అంశాలను చర్చించిందని తెలిపారు. సామాన్యులకు ఈ విధానం గురించి తెలియజేయాల్సిన బాధ్యత మేధావులపై ఉందన్నారు. సదస్సులో ఉపకులపతి వి.వెంకట బసవరావు, రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ బి.విజయకుమార్, డీన్ సీవీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూణెలో అవార్డులు అందుకున్న ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఓఅండ్ఎం హెడ్ సునీల్‌కుమార్ గుప్తా బృందం

ఎస్ఈఐఎల్ ఎనర్జీకి ప్రతిష్ఠాత్మక బీబీఎస్ అవార్డులు

ముత్తుకూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉత్పత్తిదారులలో ఒక్కటైన నెల్లూరు జిల్లా ముత్తుకూరులోని ఎస్ఈఐఎల్ ఎనర్జీస్ ఇండియా లిమిటెడ్‌కు ఫోరం ఆఫ్ బిహేవియరల్ సేఫ్టీ నుంచి ప్రతిష్ఠాత్మక బిహేవియర్ బేస్డ్ సేఫ్టీ (బీబీఎస్) అవార్డులు దక్కాయి. శనివారం పూణెలో జరిగిన 10వ వార్షిక జాతీయ బీబీఎస్ సమావేశంలో ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ హెడ్ సునీల్‌కుమార్ గుప్తా బృందానికి ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో ప్లాటినం బెంచ్ మార్క్ అవార్డు, లాంగ్ టర్మ్ ఇంప్లిమెంటేషన్ సైట్ అవార్డు, లీడర్‌షిప్ అవార్డు, అబ్జర్వర్స్ సర్టిఫికెట్ అవార్డులు ఉన్నాయి. ఈ సందర్భంగా శనివారం థర్మల్ కేంద్రంలో ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సీఈవో జనమేజయ మహాపాత్ర మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఈ ప్రతిష్ఠాత్మక బీబీఎస్ అవార్డులను అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

పాత ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి

న్యూఢిల్లీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పాత ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐఏడబ్ల్యూయూ) ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. ఇక్కడ జరుగుతున్న ఏఐఏడబ్ల్యూయూ జాతీయ సమావేశాల్లో శనివారం ఆయన మాట్లాడుతూ.. గతేడాది తెచ్చిన కొత్త ఉపాధి చట్టం పేదలపై ప్రాణాంతక దాడిగా అభివర్ణించారు. కొత్త చట్టంలో హక్కులు, భద్రత లేదని, గ్రామీణ పేదలకు ఈ చట్టంతో తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. కొత్త చట్టాన్ని వెనక్కి తీసుకునేందుకు రాబోయే నాలుగు నెలలు దేశవ్యాప్త పోరాటాలకు సిద్ధమవుతున్నామని, వచ్చే నెల 12న దేశవ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆ భేటీ మాటేంటి?



కొత్తపలుకు

• ఆర్కే RK

> ప్రభుత్వాలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవడానికి ఎంతో సమయం పట్టదు. అది సింగరేణి విషయమైనా, టెలిఫోన్ ట్యాపింగ్ విషయమైనా ఇదే సూత్రం వర్తిస్తుంది. ప్రభుత్వాలు బలంగా కోరుకున్న సందర్భాలలో విచారణలు వేగంగా పూర్తవుతాయి. శిక్షలు కూడా అంతే వేగంగా పడతాయి. రాజకీయ క్రీడలో భాగమైనప్పుడు మాత్రమే విచారణలు సాగుతూనే ఉంటాయి. ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తుతూనే ఉంటాయి. ఎదురుదాడి వ్యూహాలు పదునెక్కుతాయి.

గజం మిథ్య – పలాయనం మిథ్య అంటారు. అధికారంలో ఉన్న వారిపై ప్రతిపక్షాలు – ప్రతిపక్షంలో ఉన్న వారిపై అధికార పక్షం చేసే ఆరోపణలు ఇప్పుడు ఇలాగే ఉంటున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆరోపణలు చేయడం, అధికారంలోకి రాగానే ఎదురుదాడి చేయడం రాజకీయ పక్షాలకు అలవాటుగా మారింది. తెలంగాణ రాజకీయాలలో ఇప్పుడు ఇది స్పష్టంగా కనిపిస్తోంది. అధికారంలో ఉన్నవారు ప్రతిపక్షంలోకి రాగానే ప్రభుత్వం తీసుకునే చర్యలను కక్ష సాధింపు చర్యలుగా పేర్కొంటూ రక్షణ పొందడం అలవాటుగా చేసుకున్నారు. పనిలో పనిగా దృష్టి మళ్లింపు రాజకీయాలను జోడిస్తారు. విచారణలు సాగుతూ ఉంటాయి. విషయం మాత్రం తేలదు. ఆరోపణలు ఆరోపణలుగానే మిగిలిపోతాయి. ఆధారాలు లభించిన సందర్భాలలో కూడా చర్యలు ఉండవు. తెలంగాణలో నైనీ కోల్ బ్లాక్ టెండర్ల వ్యవహారంతోపాటు కేసీఆర్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అంతకు ముందు ఫార్ములా–ఈ కారు రేసు వ్యవహారం, కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం కొంత కాలం హడావుడి సృష్టించాయి. ఫార్ములా–ఈ కారు రేసు వ్యవహారంపై అవినీతి నిరోధక శాఖ దర్యాప్తు ఏమైందో తెలియదు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసి చేతులు దులుపుకొంది. సీబీఐ దర్యాప్తుపై కేంద్రం మౌనంగా ఉంటోంది. అంటే, వ్యవస్థలు తమకు తాముగా పనిచేయవని స్పష్టమవుతోంది. ఈ రెండు అంశాలలో అధికార దుర్వినియోగం జరిగిందన్నది వాస్తవం. అలాగే కేసీఆర్ జమానాలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందన్నది కూడా వాస్తవం. అయినా దేనిపైనా చర్యలు ఉండవు. విషయ తీవ్రత ఎంతగా ఉన్నప్పటికీ ఇదంతా రాజకీయ కక్ష సాధింపులో భాగమంటూ అందుకు బాధ్యులైన రాజకీయ పార్టీలు ఆరోపణలను తేలికగా తీసి పారేస్తున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వాలు కూడా ఆయా అంశాలను రాజకీయ క్రీడలో భాగంగానే పరిగణిస్తున్నాయి.

చర్యలు వదిలేసి ఎదురుదాడి...

ఒకప్పుడు ప్రభుత్వంలో జరిగిన అవకతవకలు, అక్రమాలను మీడియా లేదా ప్రతిపక్షాలు వెలుగులోకి తెచ్చినప్పుడు వెంటనే చర్యలు ఉండేవి. అందుకు బాధ్యులైన మంత్రులు రాజీనామా చేసేవారు. ఆ తర్వాత కొంత కాలానికి విచారణ పేరిట కాలయాపన చేయడం జరిగేది. దివంగత రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చాక మొదటిసారిగా ఎదురుదాడి మొదలైంది. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వంలో అవినీతిని ఎత్తి చూపిన మీడియాపై ఎదురుదాడి చేయడంతోపాటు కులం అంటగట్టడం మొదలెట్టారు. దురుద్దేశాలు ఆపాదించేవారు. ఈ క్రమంలో మీడియా కన్నును మీడియాకు చెందిన వారితోనే పొడిపించేవారు. దీంతో అసలు విషయం పక్కదారి పట్టేది. రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఈ సంస్కృతి ఇప్పుడు తెలుగునాట నలుదిశలా వ్యాపించింది. తప్పు చేసిన వాళ్లు ఏ మాత్రం బెరుకు లేకుండా ఎదురుదాడికి దిగుతున్నారు. తమను కాపాడుకునేందుకు కులాలను రంగంలోకి తెస్తున్నారు. నైనీ కోల్ బ్లాక్ వ్యవహారాన్ని గత వారం నేను వెలుగులోకి తెచ్చిన తర్వాత ఇటువంటి క్రీడకు మళ్లీ తెర లేపారు. విషయ తీవ్రతను తక్కువ చేసి చూపేందుకు ఇదేదో రెండు మీడియా సంస్థల మధ్య యుద్ధంలా చిత్రీకరించే ప్రయత్నాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేయగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాత్రం ఎదురుదాడికి దిగారు. నాకు దురుద్దేశాలు ఆపాదించే ప్రయత్నం చేశారు. వేరెవరి ప్రయోజనాల కోసమో ఆ కథనం రాశానని ప్రచారం చేస్తున్నారు. మహిళా అధికారుల వ్యక్తిత్వ హననం చేస్తూ ఎన్టీవీలో కథనం ప్రసారం అయ్యేవరకు ఈ టెండర్ల విషయం కూడా నాకు తెలియదు. ఆ తర్వాత వివరాలు తెలిశాయి. 'పెట్టుబడులు, కట్టుకథలు, విషపు రాతలు' అని భట్టి విక్రమార్క నన్ను నిందించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు మళ్లీ చెబుతున్నాను– నైనీ కోల్ బ్లాక్‌ను పొందేందుకు భట్టి విక్రమార్క, ఎన్టీవీ యజమాని నరేంద్ర చౌదరి ప్రయత్నించడం నిజం కాదా? మీరు సింగరేణి ఉన్నతాధికారులను పిలిపించి వర్రించడం నిజం కాదా? ఈ నేపథ్యంలో నేను రాసిన కథనం వల్ల చెలరేగిన మంటలు చల్లారకపోవడంతో టెలిఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని అధికార పార్టీ మళ్లీ తెరమీదకు తెచ్చింది. ఫలితంగా అసలు విషయం పక్కదారి పట్టింది. రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు తెరమీదకు వచ్చాయి. ఈ క్రమంలో పరిశోధనాత్మక జర్నలిజం శీల పరీక్షను ఎదుర్కోవలసి వస్తోంది.


దిద్దుబాటు ఏదీ?

1985కి పూర్వం ప్రభుత్వంలో జరిగే అవకతవకలు, అవినీతి కుంభకోణాలు వెలుగులోకి తేవడంలో ఇంగ్లిష్ పత్రికలు క్రియాశీలకంగా వ్యవహరించేవి. అప్పట్లో పరిశోధనాత్మక కథనాల ప్రచురణలో దక్కన్ క్రానికల్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ద హిందూ పత్రికలు పోటీ పడేవి. ఈ పత్రికల్లో వచ్చే కథనాలతో ప్రభుత్వ పెద్దలు ఉలిక్కిపడి దిద్దుబాటు చర్యలు తీసుకునేవారు. అక్రమాలకు పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకునేవారు. దీంతో సదరు కథనాలను రాసిన జర్నలిస్టులకు మంచి పేరుతోపాటు వృత్తిపరంగా గొప్ప కిక్కు వచ్చేది. ఆ తర్వాతి కాలంలో ఆంగ్ల పత్రికలను వెనక్కు నెట్టి తెలుగు పత్రికలు ఈ పాత్రను పోషించాయి. సంచలన కథనాలు రాసిన జర్నలిస్టులకు యాజమాన్యాలు రివార్డులు ఇచ్చేవి. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవరకు దాదాపుగా ఇదే పరిస్థితి ఉండేది. ఆయన హయాంలో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. ప్రభుత్వ పనులకు టెండర్లు వేయడం అనే ప్రక్రియకు నిర్వచనం మార్చివేశారు. తాము ఎంపిక చేసిన కంపెనీలకే పనులు దక్కేలా సిండికేట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఈ పని చేసినందుకు ప్రభుత్వ పెద్దలు ఆరు శాతం కమీషన్ తీసుకొనేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఈ విధానం ఇప్పుడు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆదర్శంగా మారింది. కాకపోతే ఒక్కో రాష్ట్రంలో ఒక్కో పర్సెంటేజీ అమల్లో ఉంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం చేపట్టే పనులకు మాత్రమే పోటీతత్వంతో కూడిన టెండర్లు దాఖలవుతున్నాయి. రాజశేఖరరెడ్డి అమలు చేసిన విధానాన్ని రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా ఆయా ముఖ్యమంత్రులు ఆదర్శంగా తీసుకొని అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంలో అవినీతి వ్యవస్థీకృతమైంది. టెండర్ల గూడుపుఠాణీ ప్రభుత్వ పెద్దలకు హక్కుగా మారింది. ఎప్పుడైనా సదరు గూడుపుఠాణీకి సంబంధించిన వార్తలు మీడియాలో వస్తే రాజశేఖరరెడ్డి బాటలో ఎదురుదాడి చేస్తున్నారు. నైనీ కోల్ బ్లాక్ విషయంలో ఇదే జరిగింది.

> ఉమ్మడి రాష్ట్రంలో సింగరేణి సంస్థ ఎండీగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయి అధికారిని నియమించేవారు. ఆ సంస్థ వ్యవహారాలలో ప్రభుత్వం పెద్దగా జోక్యం చేసుకొనేది కాదు. విడిపోయిన తర్వాత పాలకులు తమ చెప్పు చేతల్లో నడుచుకొనే వారిని సింగరేణి ఎండీలుగా నియమించుకున్నారు. ఫలితంగా ఇప్పుడు అనేక అవకతవకలకు ఆస్కారం ఏర్పడింది. సంస్థ ఆర్థిక పరిస్థితి దిగజారింది. మునుముందు కార్మికులకు జీతాలు కూడా చెల్లించలేని స్థితికి సంస్థ నెట్టబడుతోంది. నైనీ బ్లాక్ టెండర్లలో పాల్గొనాలనుకొనే వారందరికీ సైట్ విజిట్ సర్టిఫికెట్ జారీ చేసి ఉంటే ఏ నిబంధన పెట్టినా ఏ గొడవా ఉండేది కాదు. అలా జారీ చేయకుండా అధికారులను కట్టడి చేయడం వల్లనే తంటా అంతా! ఈ నిబంధనతో తనకు సంబంధం లేదని భట్టి విక్రమార్క చెబుతున్నారుగానీ సంబంధమే లేకుంటే అధికారులపై ఆంక్షలు ఎవరు విధించినట్టు?

భట్టి మాటలు... నిజాలు!

కాంట్రాక్టర్లను బాధ్యులుగా చేయడానికి ప్రవేశపెట్టిన సైట్ విజిట్ అనే విధానాన్ని టెండర్లలో పాల్గొనే అర్హతగా మార్చివేశారు. ఈ నిబంధనను అడ్డుపెట్టుకునే నైనీ కోల్ బ్లాక్‌ను హస్తగతం చేసుకొనే స్కెచ్ రూపొందించారు. ఈ విషయాన్ని నేను వెలుగులోకి తేవడంతో, ఇందులో ప్రధాన పాత్రధారి అయిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క యథావిధిగా ఎదురుదాడికి దిగారు. తాను రాజశేఖరరెడ్డి అనుచరుడినని, ఆయనపై కోపం తనపై తీర్చుకుంటున్నారని నన్ను దృష్టిలో పెట్టుకొని విమర్శలు చేశారు. ఎప్పుడో పదహారు సంవత్సరాల క్రితం చనిపోయిన రాజశేఖరరెడ్డిపై ఎవరికి మాత్రం ఎందుకు కోపం ఉంటుంది? చిల్లర వార్తలకు భయపడబోనని భట్టి విక్రమార్క చెప్పుకొచ్చారు. చిల్లర వ్యవహారాలు హద్దు దాటినప్పుడు రాతలతో వాతలు పెట్టాలని జర్నలిజంలో మా గురువులు మాకు నేర్పారు. అందుకనే నైనీ బ్లాక్ వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకొని వచ్చాను. సదరు కథనం రాయడంలో నాకు దురుద్దేశాలు ఉన్నాయని, ఎవరి ప్రయోజనాల కోసమో ఆ వార్త రాశానని కూడా భట్టి నిందించారు. ఎవరు నమ్మినా నమ్మకపోయినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కానీ, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కానీ ఈ వార్తతో సంబంధం లేదు. ఇద్దరు మహిళా ఐఏఎస్ అధికారుల వ్యక్తిత్వ హననానికి ఎన్టీవీ పాల్పడి ఉండకపోతే నైనీ కోల్ బ్లాక్ అంశం నా దృష్టికి వచ్చి ఉండేది కాదేమో! 'మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై కోపంతో మహిళా అధికారుల వ్యక్తిత్వ హననానికి పాల్పడటం ఏమిటి?' అని ఆరా తీసిన నాకు అసలు విషయం తెలిసింది. జరిగింది ఇదీ. ఈ విషయమై భట్టి విక్రమార్క ఎటువంటి సవాళ్లయినా విసురుకోవచ్చు. వాటికి జవాబులు నా దగ్గర సిద్ధంగా ఉన్నాయి. నేను రాజకీయ నాయకుడిని కాను. కనుక తిరిగి ఆయనపై ప్రత్యారోపణలు చేయదలచుకోలేదు. ఈ వ్యవహారంలోకి కులాలను తీసుకురావడం కూడా నాకు ఆశ్చర్యం కలిగించలేదు. ఎందుకంటే, తాను రాజశేఖరరెడ్డి శిష్యుడినని భట్టి విక్రమార్క స్వయంగా చెప్పుకొన్నారు కనుక అదే బాటలో నడవకుండా ఎలా ఉంటారు? పంచకట్టు విషయంలోనే కాకుండా అలవాట్ల విషయంలో కూడా ఆయన రాజశేఖరరెడ్డినే ఆదర్శంగా తీసుకున్నట్టు ఉంది. భట్టి విక్రమార్క నన్ను విమర్శించిన రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ, రెండు మీడియా సంస్థల మధ్య గొడవలే దీనికంతటికీ కారణం అంటూ వ్యవహారాన్ని తేలికగా తీసిపడేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఎన్టీవీ యాజమాన్యాన్ని, నన్ను ఒకే గాటన కట్టే ప్రయత్నం ముఖ్యమంత్రి చేయడం మాత్రం నాకు నచ్చలేదు. ఏది ఏమైనా నేను వెలుగులోకి తెచ్చిన కథనం గల్లీ నుంచి ఢిల్లీ దాకా ప్రకంపనలు సృష్టించింది. కేంద్ర ప్రభుత్వ బొగ్గు మంత్రిత్వ శాఖ అధికారులు అత్యవసరంగా సమావేశమై పరిస్థితిని సమీక్షించడం ఒక జర్నలిస్టుగా నాకు గర్వకారణం. ప్రభుత్వం తీసుకొనే దిద్దుబాటు చర్యలే జర్నలిస్టులకు లభించే విజయం. నైనీ కోల్‌బ్లాక్‌కు పిలిచిన టెండర్లు రద్దు చేయడం నా కృషికి లభించిన విజయంగానే భావిస్తాను.



బీఆర్ఎస్ వింత వైఖరి...

అయితే, ఊరందరిదీ ఒక దారైతే ఉలిపి కట్టెది మరోదారి అన్నట్టుగా ఈ అంశం వెలుగులోకి వచ్చిన తర్వాత భారత రాష్ట్ర సమితి వ్యవహరించిన తీరు ఆశ్చర్యం కలిగించింది. ఆ పార్టీ నన్ను ఒక రాజకీయ ప్రత్యర్థిగా పరిగణించడం వల్లనే కాబోలు, నాపై కొన్ని విమర్శలు చేసింది. కేసీఆర్ సొంత పత్రికలో యథావిధిగా విషం కక్కారు. ఆ పార్టీలోని రాజకీయ మరుగుజ్జులతో విమర్శలు చేయించారు. ఆ పార్టీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాన శత్రువు కనుక ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను భుజానికి ఎత్తుకున్నారు. ఒక రాజకీయ పార్టీగా ఈ విషయంలో వారి ఎత్తుగడలను తప్పుపట్టాల్సిన పని లేదు. ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రికి మధ్య విభేదాలు సృష్టించగలిగితే లాభపడేది భారత రాష్ట్ర సమితి కనుక ఆ పార్టీ నాయకులు ఆ పని చేశారు. కేసీఆర్ కుటుంబానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మధ్య పచ్చగడ్డి వేసినా భగ్గుమంటున్న విషయం తెలిసిందే. అయితే ఆ గొడవలతో నాకేమి సంబంధం? మధ్యలో నాపై పడి ఏడవడం ఎందుకు? సింగరేణి సంస్థలో మరెన్నో అక్రమాలు జరిగాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. వాటన్నింటికీ ముఖ్యమంత్రి లేదా ఆ శాఖను చూస్తున్న భట్టి విక్రమార్క సమాధానం చెప్పుకోవాలి. రాజకీయాలు ఎంత కలుషితం కాకూడదో అంతగా కలుషితమైనందునే అన్నిటికీ వక్రభాష్యాలు చెబుతున్నారు. జరుగుతున్నది దానికి మసిపూసి మారేడు కాయ చేస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించినట్టుగా... రాష్ట్రం విడిపోయిన తర్వాత సింగరేణి సంస్థను పాడి ఆవుగా మార్చేసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సింగరేణి సంస్థ ఎండీగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయి అధికారిని నియమించేవారు. ఆ సంస్థ వ్యవహారాలలో ప్రభుత్వం పెద్దగా జోక్యం చేసుకొనేది కాదు. విడిపోయిన తర్వాత పాలకులు తమ చెప్పు చేతల్లో నడుచుకొనే వారిని సింగరేణి ఎండీలుగా నియమించుకున్నారు. ఫలితంగా ఇప్పుడు అనేక అవకతవకలకు ఆస్కారం ఏర్పడింది. సంస్థ ఆర్థిక పరిస్థితి దిగజారింది. మునుముందు కార్మికులకు జీతాలు కూడా చెల్లించలేని స్థితికి సంస్థ నెట్టబడుతోంది. నైనీ బ్లాక్ టెండర్లలో పాల్గొనాలనుకొనే వారందరికీ సైట్ విజిట్ సర్టిఫికెట్ జారీ చేసి ఉంటే, ఏ నిబంధన పెట్టినా ఏ గొడవా ఉండేది కాదు. అలా జారీ చేయకుండా అధికారులను కట్టడి చేయడం వల్లనే తంటా అంతా! ఈ నిబంధనతో తనకు సంబంధం లేదని భట్టి విక్రమార్క చెబుతున్నారుగానీ సంబంధమే లేకుంటే అధికారులపై ఆంక్షలు ఎవరు విధించినట్టు? మొత్తం మీద నేను తెరమీదకు తెచ్చిన కథనంతో తేనె తుట్టెను కదిపినట్టు అయింది. సింగరేణి వ్యవహారాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు జోక్యం చేసుకున్నాయని స్పష్టమైంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కూడా రంగంలోకి దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిష్పాక్షిక విచారణ జరిగితే సింగరేణి విషయంలో ఎవరి పాపం ఎంతో తేటతెల్లమవుతుంది. బురద కడుక్కోవలసిన బీఆర్ఎస్ ఇప్పుడు బురద చల్లే పరిస్థితికి వచ్చింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి వ్యూహం సిద్ధం చేసుకొని అమలు చేస్తోంది. టెలిఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో విచారణను వేగవంతం చేయడం ఇందులో భాగమే. సింగరేణి వ్యవహారం రచ్చకెక్కడంతో ముందుగా హరీశ్‌రావు, ఆ తర్వాత కేటీఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు జారీ చేసి విచారణకు పిలిపించుకున్నారు.

> నేను రాసిన కథనం వల్ల చెలరేగిన మంటలు చల్లారకపోవడంతో టెలిఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని అధికార పార్టీ మళ్లీ తెర మీదకు తెచ్చింది. ఫలితంగా అసలు విషయం పక్కదారి పట్టింది. రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు తెరమీదకు వచ్చాయి. ఈ క్రమంలో పరిశోధనాత్మక జర్నలిజం శీలపరీక్షను ఎదుర్కోవలసి వస్తోంది.

సా....గుతున్న విచారణ

కేంద్ర ప్రభుత్వ టెలిగ్రాఫిక్ చట్టం ప్రకారం ఫోన్ ట్యాపింగ్ తీవ్ర నేరమే అవుతుంది. అయితే ఇటీవలి కాలంలో చాలా మంది ఇతరుల ఫోన్ సంభాషణలను దొంగచాటుగా వినడం ద్వారా వ్యక్తిగత గోప్యతను హరించివేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు తాము కూడా బాధితులమే అని చెప్పుకొంటున్నారంటే ఏ స్థాయిలో టెలిఫోన్ ట్యాపింగ్ దుర్వినియోగమయిందో అర్థం చేసుకోవచ్చు. ప్రతిపక్షాలతోపాటు జర్నలిస్టులు, ఇతర ప్రముఖుల సంభాషణలు విని వారి కదలికలను తెలుసుకోవడం ద్వారా కేసీఆర్ సాధించింది ఏమిటో తెలియదు. అధికారాన్ని కూడా నిలుపుకోలేకపోయారు కదా! ఎలక్టోరల్ బాండ్స్ పొందడం కోసం టెలిఫోన్ ట్యాపింగ్‌ను సాధనంగా వాడుకోవడం సరికొత్త పరిణామం. 'ఈ వ్యవహారంపై రెండేళ్లుగా విచారణ జరుగుతోంది. ఇంకెంత కాలం విచారణ జరుపుతారు?' అంటూ సుప్రీంకోర్టు కూడా ఇటీవల ఒక సందర్భంలో విసుగు ప్రదర్శించింది. నిజం చెప్పాలంటే టెలిఫోన్ ట్యాపింగ్‌పై అవసరమైన ఆధారాలు ఇప్పటికే ప్రభుత్వానికి లభించాయి. కావాలనుకుంటే ఇప్పటికిప్పుడు చర్యలు తీసుకోవచ్చు. అయినా విచారణను సాగదీస్తున్నారు. బహుశా కేసీఆర్, సంతోష్‌రావును కూడా త్వరలో విచారణకు పిలవవచ్చు. విచారణ ఎంత ఎక్కువ కాలం సాగితే విషయ తీవ్రత అంతగా పలుచనవుతుంది. తాజాగా విచారణకు హాజరైన హరీశ్‌రావు, కేటీఆర్‌లను విచారణ పేరిట వేధిస్తున్నారని ఎదురుదాడి మొదలెట్టారు. తమాషా ఏమిటంటే, నాటి టెలిఫోన్ ట్యాపింగ్‌కు హరీశ్ కూడా బాధితుడు కావడం! కేటీఆర్ కూడా మినహాయింపు అని చెప్పలేం. ట్యాపింగ్ విధుల్లో ఉన్న సిబ్బంది సరదా కోసమైనా కేటీఆర్ సంభాషణలను విని ఉండవచ్చు కదా? విచ్చలవిడితనానికి ఆస్కారం కల్పించినప్పుడు ఏదైనా జరగవచ్చు. కేసీఆర్ మాటలను కూడా విని ఉండొచ్చు. కుతూహలం మనిషి నైజం. ఏది ఏమైనా ప్రభుత్వం ఈ విచారణలను వీలైనంత త్వరగా ముగించడం వాంఛనీయం. లేనిపక్షంలో సీరియస్‌నెస్ పోతుంది. గతంలో జరిగిన తప్పులపై చర్యలు తీసుకొనే ఆలోచన లేకపోతే విచారణ తంతుకు స్వస్తి చెప్పాలి. అలాకాకపోతే ఇదంతా అధికార విపక్షాల మధ్య నడిచే డ్రామాగా ప్రజలు పరిగణించే అవకాశం ఉంది. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నాయకులు ఇప్పటికే విమర్శలు చేయడం మొదలెట్టారు. అతీ గతీ లేకుండా విచారణలు సాగుతూ ముఖ్య నాయకులను విచారణల పేరిట పిలుస్తూ పోవడంవల్ల ప్రజలు సహజంగానే వారి విమర్శలను విశ్వసిస్తారు. టెలిఫోన్ ట్యాపింగ్ విచారణ సాగినంత కాలం బీఆర్ఎస్ నాయకులు సింగరేణి వంటి విషయాల్లో ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూనే ఉంటారు. అయితే వారం గడిచేసరికి సింగరేణి వ్యవహారం మసకబారడం మొదలైంది. ప్రస్తుతానికి టెలిఫోన్ ట్యాపింగ్ విషయమే హాట్ టాపిక్ అయింది. త్వరలో మరో వివాదం తెరపైకి రావొచ్చు. అప్పుడు ఇది కూడా తెర మరుగవుతుంది. చివరికి గజం మిథ్య – పలాయనం మిథ్య అన్న భావనలోకి ప్రజలు వెళతారు. రాజకీయ నాయకులు కోరుకొనేదీ ఇదే కదా! ప్రభుత్వాలకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవడానికి ఎంతో సమయం పట్టదు. అది సింగరేణి విషయమైనా, టెలిఫోన్ ట్యాపింగ్ విషయమైనా ఇదే సూత్రం వర్తిస్తుంది. ప్రభుత్వాలు బలంగా కోరుకున్న సందర్భాలలో విచారణలు వేగంగా పూర్తవుతాయి. శిక్షలు కూడా అంతే వేగంగా పడతాయి. రాజకీయ క్రీడలో భాగమైనప్పుడు మాత్రమే విచారణలు సాగుతూనే ఉంటాయి. ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తుతూనే ఉంటాయి. ఎదురుదాడి వ్యూహాలు పదునెక్కుతాయి.

> కేంద్ర ప్రభుత్వ టెలిగ్రాఫిక్ చట్టం ప్రకారం ఫోన్ ట్యాపింగ్ తీవ్ర నేరమే అవుతుంది. అయితే ఇటీవలి కాలంలో చాలా మంది ఇతరుల ఫోన్ సంభాషణలను దొంగచాటుగా వినడం ద్వారా వ్యక్తిగత గోప్యతను హరించివేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు తాము కూడా బాధితులమే అని చెప్పుకొంటున్నారంటే ఏ స్థాయిలో టెలిఫోన్ ట్యాపింగ్ దుర్వినియోగమయిందో అర్థం చేసుకోవచ్చు. ప్రతిపక్షాలతోపాటు జర్నలిస్టులు, ఇతర ప్రముఖుల సంభాషణలు విని వారి కదలికలను తెలుసుకోవడం ద్వారా కేసీఆర్ సాధించింది ఏమిటో తెలియదు. అధికారాన్ని కూడా నిలుపుకోలేకపోయారు కదా!

ఏపీ రాజకీయాల బాటలోనే టీజీ

ఏడాదిన్నర క్రితం వరకు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు, అక్కడి పరిస్థితులు చర్చనీయాంశంగా, అసహ్యకరంగా ఉండేవి. ఇప్పుడు తెలంగాణ రాజకీయాలు ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఆకర్షిస్తున్నాయి. బీఆర్ఎస్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రమే టార్గెట్‌గా ఉన్నారు. ఈ క్రమంలో మంత్రులుగానీ మరొకరుగానీ తప్పు చేసినా ఆ పార్టీ ఉపేక్షిస్తోంది. అవసరమైతే వారికి భుజం కాస్తోంది. రేవంత్‌రెడ్డిని ఎంతగా బలహీనపరిస్తే తమ పాచిక అంతగా పారుతుందని బీఆర్ఎస్ నాయకులు లెక్కలు వేసుకొంటున్నారు. అందుకే, సింగరేణి విషయంలో కూడా రేవంత్‌రెడ్డిని మాత్రమే లక్ష్యం చేసుకున్నారు. రేవంత్ రెడ్డి బలహీనపడితే కాంగ్రెస్ పార్టీ దానంతట అదే బలహీన పడుతుందన్నది బీఆర్ఎస్ అభిప్రాయం. బహుశా ఈ వ్యూహాన్ని పసిగట్టిన రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులను టెన్షన్‌లో పెట్టేందుకు టెలిఫోన్ ట్యాపింగ్ విచారణను వేగవంతం చేయిస్తూ ఉండొచ్చు. 'నా పుట్టలో వేలు పెడితే నేను ఊరుకుంటానా!' అన్నట్టుగా తనపై బురద చల్లడానికి ప్రయత్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై ప్రతీకారం తీర్చుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెనుకాడకపోవచ్చు. ఈ రెండు ప్రధాన పార్టీల మధ్య ప్రారంభమైన ఈ రాజకీయ క్రీడలో ఎవరిది పైచేయి అవుతుందో వేచి చూద్దాం! ఈ విషయం అలా ఉంచితే, నైనీ కోల్ బ్లాక్ వ్యవహారంలో బీఆర్ఎస్ నాయకులు క్రెడిట్ చోరీకి పాల్పడటం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ వ్యవహారాన్ని గత వారం నేను వెలుగులోకి తీసుకురాగా తానే ఈ వ్యవహారాన్ని బయటపెట్టానని బీఆర్ఎస్ నాయకుడు హరీశ్‌రావు చెప్పుకొంటున్నారు. తాము కోల్ బ్లాక్ వ్యవహారాన్ని వెలుగులోకి తేవడంతోనే గతంలో ఎన్నడూ లేని విధంగా కేంద్ర బొగ్గు శాఖ అధికారులు అత్యవసరంగా సమావేశమై చర్యలకు ఉపక్రమించారని హరీశ్‌రావు చెప్పుకోవడం క్రెడిట్ చోరీ కాదా? సింగరేణికి నష్టం జరగనంత వరకు ఎవరు క్రెడిట్ తీసుకున్నా ఫర్వాలేదని సరిపెట్టుకుందాం!

> రేవంత్‌రెడ్డి బలహీనపడితే కాంగ్రెస్ పార్టీ దానంతట అదే బలహీనపడుతుందన్నది బీఆర్ఎస్ అభిప్రాయం. బహుశా ఈ వ్యూహాన్ని పసిగట్టిన రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులను టెన్షన్‌లో పెట్టేందుకు టెలిఫోన్ ట్యాపింగ్ విచారణను వేగవంతం చేయిస్తూ ఉండొచ్చు.

నకిలీ చరిత్రలతో సామాజిక విద్వేషాలు

చరిత్ర గత సమాజపు జీవన విధానానికి అద్దం వంటిది. అది మన గతాన్ని మాత్రమే కాదు, మన సంస్కృతి, విలువలు, సామాజిక అభివృద్ధి దిశలను కూడా ప్రతిబింబిస్తుంది. కానీ ఇటీవలి కాలంలో కొన్ని వర్గాలు తమ సామాజిక స్థితిని ఉన్నతంగా చూపించుకోవాలనే ఉద్దేశంతో చరిత్రను వక్రీకరించే ప్రమాదకర ధోరణి ప్రారంభమైంది. నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో సమానత్వ ఫలాలను అందుకుని కొన్ని సామాజికవర్గాలు కూడు, గూడు, విద్య లాంటి మౌలిక అవసరాలు తీర్చుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాయి. సామాజిక గౌరవం, ఆత్మగౌరవం కోసం చరిత్రను ఎంచుకుని, చరిత్రలో వెలిగిన రాజవంశాలు, చారిత్రక పురుషులను తమ వర్గానికి ప్రతినిధులుగా చెప్పుకోవడం ద్వారా సమాజంలో తాము గొప్ప చరిత్రకు వారసులమని నమ్మించే మమ్మురప్రయత్నాలు చేపట్టాయి. ఆ క్రమంలో కొన్ని అలజడులు, సంఘర్షణలు సమాజంలో అశాంతికి కారణమవుతున్నాయి.

కొన్ని కులాలు లేదా వర్గాలు తమ మూలాలను ప్రాచీన పాలక వంశాలతో అనుసంధానం చేస్తూ, తామే రాజ్యాధికారులం, వీరుల వారసులమని గట్టిగా ప్రచారం చేస్తున్నాయి. ఆధారాలు లేనప్పటికీ పుస్తకాలు రాయడం, నకిలీ శాసనాలు రూపొందించడం, శిలాశాసనాల రూపంలో తప్పుడు ఆధారాలను ప్రచారం చేయడం వంటి చర్యలు పెరుగుతున్నాయి. ఇవి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయి. చరిత్ర అంటే కల్పన కాదు, పరిశోధన. చరిత్ర ఊహల మీద కాకుండా, ఆధారాల మీద నిలబడుతుంది. శిలాశాసనాలు, తామ్రపత్రాలు, పురావస్తు ఆధారాలు, సమకాలీన సాహిత్యం మొదలైనవి చరిత్ర చెప్పడానికి ప్రామాణిక సాక్ష్యాలు. వీటిని విశ్లేషించడంలో భాష, శైలి, కాలం, భౌగోళికత వంటి అంశాలు కీలకం. కానీ నకిలీ చరిత్రలను తయారు చేసేవారు ఈ ప్రమాణాలను పట్టించుకోరు. చరిత్ర పూర్వ యుగంలోని పౌరాణిక పురుషులను తమ కులానికి అన్వయించుకొని ఏదో ఒక రాజవంశాన్ని ఆ పురాణ పురుషుడి వారసులుగా ప్రచారం చేసి, తద్వారా తమ కులం ఒక గొప్ప రాజ వంశాన్ని ఈ ఘన చరిత్రకు కానుకగా ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటారు. ఈ వ్యాధి సమాజంలో నేడు విస్తృతంగా ప్రబలుతోంది.



ప్రపంచ ప్రసిద్ధిగాంచిన విజయనగర సామ్రాజ్య స్థాపకులైన హరిహర బుక్కరాయల విషయంలో కూడా వివిధ కులాల వారు వారిని స్వంతం చేసుకుని వారి కీర్తిని తమ కులాలకు కిరీటాలుగా ధరించాలని తెగ ప్రయాసపడుతున్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా కల్పిత ఆధారాలతో చారిత్రక చౌర్యానికి పాల్పడుతున్నారు. తెలుగు జాతి ఘనకీర్తిని ఉన్నత శిఖరాన నిలిపిన సాహితీ సమరాంగణ సార్వభౌముడు, త్రిసముద్రాధిపతి, కర్ణాట సామ్రాజ్య రమారమణుడిగా కీర్తించబడ్డ మహాచక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయల విషయంలోనూ తెలుగువాడని తెలుగు చరిత్రకారులు, కన్నడవాడని కన్నడ చరిత్రకారులు వివిధ సిద్ధాంతాలను రూపొందించుకుని నేటికి వాదులాడుకుంటున్నారు. అదేవిధంగా రాయల వారి కులం విషయంలో కూడా తమ వాడంటే, తమవాడనీ సామాజిక మాధ్యమాల్లో యుద్ధాలు చేసుకుంటున్నారు. ఈ జనవరి 17న రాయల జయంతి రోజు పోటాపోటీగా ఆయన తమ కులం వాడేనని సంబరాలు జరుపుకుని, ఆయన గౌరవానికి భంగం కలిగించారు. ఊహాజనిత ఆధారాలతో పెద్ద గ్రంథాలను రాసుకుంటున్నారు. దక్షిణ భారతదేశాన్ని పాలించిన మౌర్యులు, శాతవాహనులు, పల్లవులు, చాళుక్యులు, చోళులు, గాంగులు, రాష్ట్రకూటులు, నోలంబులు, బాణులతో కలిపి విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన నాలుగు వంశాల వారు తమ కులపు వారని కొన్ని కులాల వారు సామాజిక మాధ్యమాల్లో తీవ్రంగా ప్రచారం చేసుకుంటున్నారు, భావోద్వేగాలను రెచ్చగొడుతున్నారు. కర్ణాటక, తమిళనాడులో కూడా చోళ, పాండ్య, హొయసల, మదురై నాయకుల చరిత్ర వివాదాలతో పలు ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. గతించిన చరిత్ర ఎంత గొప్పదైనా అది తిరిగిరాని వైభవమే. ఆ గొప్పదనంతో ఒరిగేదేమీ లేకపోయినా సమాజంలో విద్వేషాలు సృష్టి అవుతాయి.

నాడు ఇప్పటి సమాజంలో ఉన్న కుల వ్యవస్థ లేదు, నాటి సమాజంలో కులాలు వృత్తులు మాత్రమే. రాచరిక వ్యవస్థలో రాజులు ఎప్పుడూ తమ కులాలను బహిరంగపరచలేదు. రాజుగా పట్టాభిషిక్తుడైన వ్యక్తి, ఉపనయనాది క్రతువుల ద్వారా క్షత్రియుడై, బ్రాహ్మణులు ఏర్పాటు చేసిన గోత్రంతో, క్షత్రియ వంశంతో ఒదిగిపోవలసి ఉండేది. ఒక పురాణ పురుషుడి అన్వయంతో తన క్షత్రియ వంశం ప్రశస్తి శాసనాల ద్వారా ప్రచారమయ్యేది. రాజుకు ఉన్న పట్టమహిషుల సంతతి పట్టాభిషేకానికి అర్హతగలిగిన ఉత్తరాధికారులుగా హక్కు కలిగివుండేవారు. రాజు తన రాజ్యంలో అన్ని కులాలతో వైవాహిక సంబంధాన్ని నెరుపుకుని, ఆ వర్గం మద్దతు పొందేవాడు. పట్ట మహిషులను మినహాయించి మిగిలిన ఉప పత్నుల సంతానానికి కూడా పరిపాలనా యంత్రాంగంలో భాగస్వామ్యం కల్పించేవారు. కానీ వారికి రాజు కులం గాని, వారసత్వ హక్కులు గానీ సిద్ధించేవి కావు. ఉప పత్నుల సంతానానికి తల్లి కులమే ఉండేది. వివిధ కులాల ఉప పత్నుల సంతానం కూడా రాజుకు సంతానంగా చెప్పుకోవడం ద్వారా నేటి సమాజంలోని విభిన్న కులాల మధ్య చారిత్రక పురుషులను స్వంతం చేసుకుని, తమ కుల ప్రతిష్ఠను పెంచుకోవాలనే తాపత్రయం అన్ని కులాల్లోనూ అధికమయ్యింది.

రాచరిక వ్యవస్థలో రాజు తన సంతానాన్ని వివిధ ప్రాంతాల ప్రతినిధులుగా నియమించడమే కాకుండా, ఆ ప్రాంతంలో ప్రబలంగా ఉన్న కులాలతో వియ్యమందడం ద్వారా ఆ ప్రాంతపు ఆధిపత్యాన్ని నిరాటంకంగా కొనసాగించడానికి అవకాశం ఏర్పడేది. అన్ని కులాల వారితో బంధుత్వాలు ఏర్పరుచుకుని రాజు ప్రజలందరివాడిగా మసలుకునేవాడు. ఆ వైఖరే నేటి కుల చారిత్రక సంఘర్షణకు ప్రధాన కారణమవుతోంది. రాజు దైవాంశ సంభూతుడనే నాటి విశ్వాసాన్ని గౌరవించి, చారిత్రక పురుషులను కుల చట్రాల్లో బంధించకుండా, వారిని తమ ప్రాంతపు సంపదగా భావించడం ద్వారా అన్ని కులాల గౌరవం, హుందాతనం పెరుగుతుంది. చరిత్రను శోధించేవాడు సత్యాన్ని ప్రేమిస్తాడు, సత్యాన్ని కాపాడినపుడే సమాజం నిలబడుతుంది.

• సిద్ధగిరి శ్రీనివాస్
అభ్యుదయ రచయితల సంఘం





రాజధాని అమరావతి వేదికగా గణతంత్ర దినోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం అట్టహాసంగా రిహార్సల్స్ జరిగాయి. ఈ సందర్భంగా సచివాలయం, అసెంబ్లీ, మండలి, హైకోర్టు భవనాలతో పాటు పరిసరాలను మువ్వన్నెల రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

సర్వం సిద్ధం

- నేటి నుంచి బైబిల్ మిషన్ మహోత్సవాలు
- ఆర్టీసీ, రైల్వే ప్రత్యేక రవాణా సదుపాయాలు
- సుదూర ప్రాంతాల నుంచి సభకు విశ్వాసులు



- మిఠాయిల్లో కృత్రిమ రంగులు
- ప్యాక్‌లపై అస్పష్టంగా సమాచారం
- తినొద్దంటూ హెచ్చరిస్తున్న వైద్యులు
- దాడులు చేపట్టిన ఆహార భద్రతా అధికారులు

స్వీట్ వార్నింగ్!

s.u.n.d.a.y s.p.e.c.i.a.l

మిఠాయి దుకాణాలకు వెళితే ప్రకృతిలోని వర్ణాలన్నీ.. అక్కడే దర్శనమిస్తాయి. ఆకర్షణీయ ఆకృతులతో స్వీట్స్ నోరూరిస్తాయి. దీంతో కాస్త రుచిచూసి, ప్యాకింగ్ చేసి ఇంటికి తీసుకెళ్తుంటాం. కాకపోతే ఈ వర్ణాల వెనుక దాగి ఉన్న రసాయనాల అనర్థాన్ని గమనించం. ఆరోగ్యా నికి అవి తెచ్చే ముప్పును పట్టించుకోం. రసాయనాలతో కలిసిన స్వీట్స్ తింటే క్యాన్సర్, ఇతర వ్యాధుల బారిన పడే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

గుంటూరు(తూర్పు), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆహారభద్రతా ప్రమాణాలు సవరించిన చట్ట ప్రకారం అమ్మకానికి ఉంచిన మిఠాయిల తయారీ వివరాలను ముద్రించాలి. ఈ నిబంధనలు సాధారణ విక్రయ స్వీట్స్‌తో పాటు సంప్రదాయ పిండి వంటలైన అరిసెలు, పాలతాలికలు వంటి వాటికి కూడా వర్తిస్తాయి. కాకపోతే జిల్లాలో ఏ ఒక్క వ్యాపారీ పూర్తి వివరాలను ముద్రించకుండానే స్వీట్స్ విక్రయిస్తున్నా రు. ఇక చిరు వ్యాపారుల గురించి చెప్పనక్కర్లేదు.

● కల్తీ ఇలా

సువాసన కోసం కేజీ నెయ్యిలో 75 గ్రాముల కంటే తక్కువగా నాణ్యమైన నెయ్యిను ఉపయోగించి, కల్తీల తో మిగిలిన నెయ్యిను తయారు చేస్తున్నారు. అసలు స్థితిని కోల్పోకుండా ఆవు ఎముకల నుంచి తీసిన తేట, బరువు కోసం బంగాళ దుంపలను (మిగతా 8వ పేజీలో)

● పిచ్చి కుసుమ గింజలతో ఆవ నూనెను తయారు చేస్తున్నారు. వంటల్లో దీని వాడకంతో ఈ మధ్య కాలంలో చాలామంది డ్రాప్సీకా అనే కాలేయ సంబంధిత వ్యాధి బారిన పడుతున్నారు.

రశీదు తీసుకోండి.. ఫిర్యాదు చేయండి

నూతనంగా సవరించిన చట్టప్రకారం దుకాణాల్లో కొన్న మిఠాయిలు, పిండివంటలు పాడైతే ఫిర్యాదు చేయొచ్చు. గతంలో ఇటు వంటి నేరాలకు పాల్పడిన వారికి జరిమానాలతో సరిపెట్టేవారు. 2019 సవరించిన చట్ట ప్రకారం రుచిగా లేని, గడువులోపే పాడైపోయే వాటిని అమ్మితే రూ.5 లక్షల జరిమానా, 7 సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ సవరణలు చేసింది. మరోసారి కల్తీ చేస్తే నగర బహిష్కరణ వంటి కఠిన చర్యలు తీసుకుంటారు. కాకపోతే పదార్థాలు కొనుగోలు చేసే సమయంలో రశీదును తీసుకుంటునే ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది.

ఆరోగ్యానికి ముప్పు

కొంత మంది దుకాణదారులు స్వీట్స్ తయారీలో రంగు మరింత ఆకర్షణీయంగా కనబడడానికి మెటానిల్ అనే కెమికల్ వినియోగిస్తారు. ఇవి కలిసిన పదార్థాలు తినడం వల్ల జీర్ణవ్యవస్థ పూర్తిగా దెబ్బతిని.. క్యాన్సర్ బారిన పడే ప్రమాదముంటుంది. సాధారణంగా గడపల కు ఎరుపు రంగు బొట్టు పెట్టేందుకు ఈ మెటానిల్‌ను వాడతారు. ఇది ఆకర్షణీయంగా ఉండటంతో మిఠాయిల తయారీ లోనూ.. వాడుతున్నారు. అంతేగాక సింథటిక్ రంగులను వినియోగిస్తున్నారు. వీటితో పిల్లల్లో అలర్జీ, అవయవాలు చెడిపోయే ప్రమాదం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



లాలాపేటలోని స్వీట్ షాపులపై దాడులు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు (పాతచిత్రం)

ఎట్టకేలకు.. తొలగిన అడ్డంకి

శరవేగంగా శంకర్‌విలాస్ బ్రిడ్జి రైల్వే భాగం కూల్చివేత

- వివిధ స్థాయిల్లో 17 మంది అధికారుల సంతకాలతో ఆమోదం
- రైల్వే మంత్రి, బోర్డు ఛైర్మన్‌తో పెమ్మసాని సంప్రదింపులతో లభించిన అనుమతి

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో శంకర్‌విలాస్ ఆర్వోబీకి శంకుస్థాపన జరిగి శరవేగంగా పనులు జరుగుతున్నా.. పాత బ్రిడ్జి తొలగింపు పెండింగ్‌లో పడింది. రోజులు గడుస్తున్నా రైల్వే అనుమతుల్లో జాప్యంతో పలు విమర్శలు ఎదురయ్యాయి. ఈ క్రమంలో గుంటూరు ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ప్రత్యేకంగా దృష్టి సారించడంతో రైల్వే నుంచి రైల్వే విభాగంలోని పాత బ్రిడ్జి తొలగింపునకు అనుమతి వచ్చింది. అయితే పాత బ్రిడ్జి కూల్చివేతకు సంబంధించి అనుమతులు అంత ఆషామాషీగా మంజూరు కాలేదు. గుంటూరు డివిజన్ మొదలు దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్, ఆ తర్వాత రైల్వే బోర్డులో వివిధ స్థాయిల అధికారులు సంతకం చేస్తేనే చివరికి కూల్చివేతకు అడ్డంకులు తొలగిపోయాయి. ఇందుకోసం డాక్టర్ పెమ్మసాని ఆయా అధికారులతో మాట్లాడారు. అలానే తన సిబ్బందిని సంబంధిత అధికారుల కార్యాలయాలకు పంపించి ఫైళ్లపై సంతకాలు అయ్యేలా చూశారు. రైల్వేభాగంలో బ్రిడ్జి కూల్చివేత విషయంలో ఏమాత్రం పొరపాట్లు జరిగినా రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని రైల్వే శాఖ తొలుత కూల్చివేతకు అనుమతులు మంజూరు చేయలేదు. పకడ్బందీగా ప్రణాళిక రూపొందించి, అందుకు అవసరమైన యంత్ర సామగ్రిని పని ప్రదేశంలో ఏర్పాటు చేయాలని సూచించింది. ఇందుకు సంబంధించిన ఫైలు మొత్తం 17 మంది ఉన్నతాధికారుల వద్దకు వెళ్లాలి. ఎక్కడ కొర్రీ పడినా రీమార్కులు రాసి పంపాలి. ఇందుకోసం పెమ్మసాని రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్, బోర్డు ఛైర్మన్‌తోనూ ప్రత్యేకంగా మాట్లాడారు. దాంతో హెడ్‌క్వార్టర్స్ నుంచి ఒక ఇంజనీరింగ్ ఉన్నతాధికారుల బృందం కూడా వచ్చి పరిశీలిం చింది. రైల్వే అధికారులు ఏవైతే కోరారో వాటిని సమకూర్చిన తర్వాత వారు ఆమోదం తెలిపి ఫైలుపై సంతకం చేశారు. ఇందుకోసం కొన్ని నెలల సమయం పట్టగా ఆ సమయంలో ఎక్కడా ఆర్వోబీ పనులు నిలిచిపోకుండా చూశారు.


ఇప్పుడు రైల్వే భాగం కూల్చివేత ప్రారంభం కాగా మరికొద్ది రోజుల్లోనే ఈ పనులు పూర్తి అయిపోతాయి. అప్పుడు బ్రిడ్జి నిర్మాణ పనులు మరింత వేగవంతం అవుతాయి. 2027 జూలై నాటికి నాలుగు వరసల ఆర్వోబీని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని వాగ్దానం చేసిన పెమ్మసాని అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి లక్ష్యాలను అధిగమిస్తూ పనులను ముందుకు తీసుకెళుతున్నారు.



శంకర్‌విలాస్ పాత బ్రిడ్జి రైల్వే భాగంలో కూల్చివేత పనులను పరిశీలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

నా భారత దేశం.. నా ఓటు

- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం
- డీఆర్వో ఖాజావలికి రాష్ట్ర స్థాయి అవార్డు



గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జిల్లాలో పెద్దఎత్తున నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఏడాది నా భారతదేశం.. నా ఓటు అనే నినాదాన్ని ఇచ్చింది. దీనికి ట్యాగ్‌లైన్‌గా భారత ప్రజాస్వామ్యం గుండెపై పౌరుడు అని చేర్చింది. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గుంటూరుతో పాటు అన్ని మున్సిపాలిటీలు, మండలాల్లో 16వ ఓటరు దినోత్సవ ర్యాలీలు, సమావేశాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా దశాబ్దాల తరబడి ఓటు హక్కు వినియోగించు కుంటోన్న వృద్ధులను సన్మానించ నున్నారు. అలానే ఈ ఏడాది కొత్తగా ఓటు హక్కు పొందిన యువతకు ఎలక్టోరల్ ఫొటో ఐడెంటిటీ కార్డులు పంపిణీ చేసి వారి అనుభూతిని తెలుసుకోనున్నారు. ఉత్తమ ఎలక్టోరల్ విధానాలను అమలు చేసినందుకు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి రాష్ట్ర స్థాయి అవార్డుని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో సీఈవో వివేక్‌యాదవ్ నుంచి అందుకోనున్నారు.

అమృత్ భారత్ వచ్చింది.. వెళ్లింది

- కొత్త ఎక్స్‌ప్రెస్‌ను స్వాగతించలేని దుస్థితి
- పట్టించుకోని రైల్వే వర్గాలు, ప్రజాప్రతినిధులు

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రైల్వే శాఖ మంజూరు చేసిన తిరువనంతపురం నార్త్ - చర్లపల్లి వయా గుంటూరు అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ శనివారం ఉదయం గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఆగింది.. వెళ్లింది. అయితే ఈ నూతన రైలుకి అటు రైల్వే వర్గాలు, ఇటు ప్రజాప్రతినిధులు కనీసం స్వాగతించలేకపోయాయి. ఈ రైలుని శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ తిరువనంతపురంలో ప్రారంభించగా శనివారం ఉదయం 10.30 గంటల సమయంలో గుంటూరు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నది. గుంటూరు మీదగా ప్రప్రథమంగా ప్రయాణించనున్న అమృత్ భారత్ రైలుకు ఘనంగా స్వాగతించాల్సిన వారు ఎవరికి వారు తమకేమి పట్టనట్లుగా వ్యవహరించారు. దాంతో శనివారం గుంటూరు రైల్వేస్టేషన్‌కు అమృత్ భారత్ చేరుకున్న సమయంలో ప్లాట్‌ఫాం మీద ఏ ఒక్కరూ లేరు. రోజువారి రైలుగా వచ్చి వెళ్లిపోయింది. ఇందుకు కారణం శనివారం రైల్వే అధికారులకు సెలవుదినం కావడమేనన్న విమర్శలు వస్తున్నాయి. అటు బీజేపీ, కూటమి నాయకులు కూడా అమృత్ భారత్ రైలుని స్వాగతించేందుకు స్టేషన్‌కు రాలేదు. గతంలో సికింద్రాబాద్ - తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు మంజూరు చేసినప్పుడు ధూం, ధాంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. అమృత్ భారత్ రైలు సందర్భంగా అలాంటి వాతావరణమే కనిపించలేదు.



గుంటూరు రైల్వేస్టేషన్‌లో అమృత్ భారత్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఇంటర్ బోర్డు ఆర్ఐవో సునీత

గుంటూరు(విద్య), జనవరి 24 (ఆంధ్ర జ్యోతి): ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేయాలని ఇంటర్ బోర్డు ఆర్ఐవో సునీత ఆదేశాలు జారీ చేశారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై ప్రిన్సిపాల్స్, సీఎస్‌లతో శనివారం ఏసీ కళాశాలలో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 1 నుంచి 10వ తేదీ వరకు ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 126 కేంద్రాల్లో జరిగే పరీక్షలకు 27960 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఒకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 27న ప్రారంభం కానున్నట్లు చెప్పారు. పరీక్షలు 17 కేంద్రాల్లో జరుగుతాయని, పరీక్షలకు 2292 మంది హాజరవుతున్నారన్నారు. ఆర్‌జేడీ పద్మ మాట్లాడుతూ వెబ్‌సైట్ లేదా మన మిత్ర వాట్సాప్ నుంచి హాల్‌టికెట్లు డౌన్ లోడు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలోకాలేజీ ప్రిన్సిపాల్ మోజెస్ ప్రిన్సిపాల్ బాలమోహన్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఐవో సునీత

స్వచ్ఛ గుంటూరే లక్ష్యం

- ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలి
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరాన్ని స్వచ్ఛ గుంటూరుగా తీర్చి దిద్దడానికి ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో ముఖ్యమని మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో కార్యక్రమంలో భాగంగా పీవీకే నాయుడు మార్కెట్ పరిసర ప్రాంతంలో శనివారం కమిషనర్ కె.మయూర్ అశోక్, ఇతర అధికారులతో కలిసి మేయర్ మాస్ క్లీనింగ్ చేశారు. అనంతరం వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఎదుట మరుగుదొడ్లను పరిశీలించి అధికారులు సిబ్బందితో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండేలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. రానున్న కాలంలో గుంటూరు నగరాన్ని క్లీన్ గుంటూరు.. గ్రీన్ గుంటూరుగా తీర్చి దిద్దడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఇందుకు ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో ముఖ్యమన్నారు. స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్రలో ఈ నెల థీం జీరో గ్యాప్ శాని టేషన్ అనే అంశంపై నిర్వహిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. అన్ని డివిజన్లలో గ్యాంగ్ వర్క్, డ్రెయిన్ క్లీనింగ్ వంటి కార్యక్రమాలు చేయడయే కాక, తడి పొడి చెత్తల విభజనపై, పబ్లిక్ టాయిలెట్స్ శుభ్రతపై ప్రజలకు అవగాహన కూడా కల్గిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, ఎస్ఈ జి.వెంకటేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ శాంతి కళ, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సి.హెచ్ శ్రీనివాసరావు, టి. వెంకటకృష్ణయ్య, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, పోతురాజు సమత, తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్లో చీపురుతో శుభ్రం చేస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ కే మయూర్‌అశోక్

..వారికి రివర్షన్

- వీఆర్వోలుగా 40 మంది సీనియర్ అసిస్టెంట్లు
- డిపార్టుమెంట్ టెస్టులు, శిక్షణ పూర్తి చేయనందునే..
- మూడు జిల్లాల రెవెన్యూ విభాగాల్లో చర్చనీయాంశం

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వీఆర్వో(విలేజ్ రెవెన్యూ ఆఫీసర్) గ్రేడ్-1 నుంచి సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి పొందిన గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో 40 మంది రివర్షన్ అయ్యారు. వీరికి రెండేళ్లలో డిపార్టుమెంట్ టెస్టులో ఉత్తీర్ణతో పాటు నిర్ణీత శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసుకుంటామన్న షరతుపై 2022లో ఉద్యోగోన్నతులు పొందారు. ఈ ఉద్యోగోన్నతుల్లో జూనియర్ అసిస్టెంట్లు/టైపిస్టులకు 60 శాతం, వీఆర్వోలకు 40 శాతం రిజర్వేషన్ పాటించారు. మొదటి ఖాళీని జూనియర్ అసిస్టెంట్ /టైపిస్టుకి, రెండోది వీఆర్వో గ్రేడ్-1కి కేటాయించేలా నిబంధన చేర్చారు. వీఆర్వో గ్రేడ్-1 నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందిన వారు రెండేళ్ల పాటు తహసీల్దార్ /ఆర్‌డీవో/కలెక్టరేట్‌లో విధులు నిర్వహించాలి. తద్వారా డ్రాఫ్టింగ్, నోటింగ్‌లో ఎక్విటెన్స్‌ని పొందాలి. ఈ సమయంలో వారికి ఆర్ఐగా ఫీల్డ్‌వర్కుతో పాటు జూనియర్ అసిస్టెంట్లతో సమానంగా డిపార్టుమెంటల్ టెస్టులు పాస్ కావాలి. 42 రోజుల సర్వే ట్రైనింగ్, క్రాప్ శాంప్లింగ్, అకౌంట్స్ టెస్టు వంటివి క్లియర్ చేయాలి. ఈ విధంగా మొత్తం 66 మంది ఉద్యోగోన్నతులు పొందారు. అయితే వీరిలో 40 మంది ఉత్తీర్ణులు కాకపోవడంతో శనివారం కలెక్టర్ తమీమ్ అన్సారియా రివర్షన్ ఆర్డర్స్ పాస్ చేశారు.

నీట్‌లో సత్తా చాటిన నరసరావుపేట డాక్టర్లు


కడియాల తపస్విని


చేకూరి ధరణిష్


నాగేంద్ర శివ తేజ


దొడ్డా రిషి భార్గవ్

నరసరావుపేట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట డాక్టర్లు మెడికల్ సూపర్ స్పెషాలిటీ అఖిల భారత నీట్ పరీక్షల్లో సత్తా చాటారు. డాక్టర్ నాగేంద్ర వెంకట శివ తేజ 111, డాక్టర్ దొడ్డా రిషి భార్గవ్ 127, డాక్టర్ చేకూరి ధరణిష్ 470, డాక్టర్ కడియాల తపస్విని 1159వ ర్యాంకులు సాధించారు. నిర్మాణం రంగంలో పనిచేస్తున్న నాగేంద్ర రామకృష్ణ కుమారుడు డాక్టర్ శివతేజ ఎంఎస్ జనరల్ సర్జరీలో పీజీ చేశారు. విద్యాశాఖ ఉద్యోగి దొడ్డా వెంకటేశ్వరరావు కుమారుడు డాక్టర్ రిషి భార్గవ్ ఎండీ జనరల్ మెడిసిన్‌లో పీజీ చేశారు. డీఎం (గ్యాస్ట్రో)లో సూపర్ స్పెషాలిటీ చేయాలని అనిపిస్తున్నట్లు తెలిపారు. ఆడిటర్ చేకూరి సాంబశివరావు కుమారుడు డాక్టర్ ధరణిష్ ఎంఎస్ జనరల్ సర్జరీలో పీజీ చేశారు. యల్లమందకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కడియాల రమేష్ కుమార్తె డాక్టర్ కడియాల తపస్విని ఎండీ జనరల్ మెడిసిన్‌లో పీజీ చేశారు. డీఎం న్యూరాలజీ విభాగంలో సూపర్ స్పెషాలిటీ చేయాలని భావిస్తున్నట్టు తపస్విని తెలిపారు.

రాష్ట్రంలో ఐదువేల శ్రీవాణి ఆలయాలు

● ఈ ఏడాది టీటీడీ లక్ష్యమన్న మంత్రి ఆనం ● డీవీసీ న్యూరో సెంటర్ ప్రారంభం


డీవీసీ న్యూరో సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ ఏడాది రాష్ట్రంలో ఐదువేల శ్రీవాణి ఆలయాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. గుంటూరు జిల్లా వడ్లమూడి సంగం డెయిరీ పరిధిలోని డీవీసీ హాస్పటల్లో శనివారం న్యూరో సెంటర్, ఎమ్మారై సేవలను రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పయ్యావుల కేశవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరయ్య చౌదరి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో మంత్రి రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ దళిత వాడల్లో ఈ ఆలయాలను నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ ఆలయాల నిర్మాణానికి మూడు కేటగిరీల్లో స్థలాన్ని బట్టి రూ.10లక్షల నుంచి రూ.25 లక్షల వరకు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఇప్పటికే దరఖాస్తు కోసం నమూనాలను సిద్ధం చేసి అందజేశామన్నారు. ఆలయాల నిర్మాణానికి సిఫార్సులు చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో 20 వేల ఆలయాలను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. పొన్నూరులో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ విజ్ఞప్తి మేరకు ఇప్పటికే మూడు ఆలయాల పునర్నిర్మాణానికి రూ.3.86 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. గుంటూరు జిల్లాలో 137 ఆలయాలకు ధూపదీప నైవేద్యాల కింద రూ.10 వేలు చొప్పున అందిస్తున్నామన్నారు. గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు వెళుతున్నారన్నారు.

శత్రు దుర్భేద్యం..సంగం డెయిరీ

సంగం డెయిరీ శత్రు దుర్భేద్య కోట అని.. దానిని ఏ రాజకీయ శక్తి తాకే అవకాశం లేదని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. వీరయ్య చౌదరి కుటుంబంతో తమకు దశాబ్దాలుగా ఉన్న అనుబంధాన్ని మననం చేసుకున్నారు. రైతుల పట్ల ఆయన ఆలోచనలు రైతుల పక్షపాతిగా మార్చివేశాయని గుర్తుచేసుకున్నారు. ఎన్టీఆర్ క్యాబినెట్లో మంత్రులుగా పని చేసి.. పొన్నూరు పరిసర ప్రాంతాల అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. ఆయన కుమారుడు నరేంద్రకుమార్ పలుమార్లు ఎమ్మెల్యే గెలుపొంది ప్రజా సేవలో ప్రజల మన్ననలు పొందుతున్నారని అభినందించారు. డీవీసీ హాస్పిటల్ స్థాపించి పేదలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ట్రస్ట్ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సంగం డెయిరీ, డీవీసీ హాస్పిటల్ గత ప్రభుత్వ హయాంలో ఎదుర్కొన్న ఇబ్బందులు గురించి మాట్లాడుతూ ఈ సంస్థలు శత్రు దుర్భేద్యమైనటువంటివని ఏ రాజకీయ శక్తి ఈ సంగం డెయిరీని తాకే పని కూడా చేయలేదన్నారు. సంగం డెయిరీ కోటను తాకే వాళ్లే పతనమవుతారని హెచ్చరించారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో సంగం డెయిరీ వ్యవస్థను నాశనం చేయాలని నాటి పాలకులు తలచారని ఆరోపించారు. కానీ ఉలి దెబ్బలు తింటే రాళ్లు శిల్పాలైనట్లు నరేంద్ర కుమార్ తన చాతుర్యంతో సంగం డెయిరీని మరింత ముందుకు తీసుకువెళ్లారని కొనియాడారు. వీరయ్య చౌదరి లాంటి మహనీయుల చేతిలో రూపొందుకున్న సంగం డెయిరీ దినదినాభివృద్ధి చెందుతుందని కొనియాడారు. ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ 1977లో స్థాపించిన సంగం డెయిరీతో తమకు విడదీయలేని అనుబంధం ఉందని స్పష్టం చేశారు. తమ కుటుంబం సంగం అభివృద్ధిలో నింతరం భాగస్వాములై ఉంటామని సంగం సంస్థకు కాపలాదారులుగా పనిచేశామన్నారు. పేదలకు, రైతులకు ఆరోగ్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు డీవీసీ హాస్పటల్ స్థాపించి ప్రపంచ స్థాయి వైద్యాన్ని అందజేస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ ఎండీ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి, సంగం డెయిరీ ఎండీ పి.గోపాలకృష్ణ, నన్నపనేని రాజకుమారి, హాస్పటల్ సీఓఓ డాక్టర్ కరణం నవీన్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ చల్లగండ్ల శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు, పాల ఉత్పత్తిదారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న బైక్..ఒకరు మృతి

● ఇద్దరి పరిస్థితి విషమం


ప్రమాద ఘటనలో క్షతగాత్రులు
వెంకట రత్నం (పాత చిత్రం)

తాడికొండ, పెదకూరపాడు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అతివేగంగా వస్తున్న బైక్ ఆటోను ఢీకొట్టడంతో ఓ వృద్ధు రాలు మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన శనివారం తాడికొండ మండల నిడుముక్కల గ్రామం లో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల మేరకు.. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలంలోని లగడపాడు గ్రామానికి చెందిన నార్ల వెంకటరత్నం(58), హుస్సేన్ నగర్‌కు చెందిన మన్నవ సుధాకర్, వెంకాయమ్మ, మరో మహిళ తాడికొండలోని మోతడక గ్రామంలో ఓ కార్యక్రమానికి బయలు దేరారు. మార్గ మధ్యలో నిడుముక్కలలో తమ బంధువులకు ఆరోగ్యం బాగాలేకపోవటంతో పరామర్శకు అందరూ అక్కడికి వచ్చి.. బయలుదేరారు. మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం విద్యార్థి వలపర్ల తేజస్విని, తోట మల్లేశ్వరి తమ స్నేహితుడు అమర్ బైక్‌పై గుంటూరు వెళ్తున్నారు. అతివేగంగా బైక్ నడుతున్న అమర్ ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టడంతో నార్ల వెంకట రత్నం అక్కడికక్కడే మృతి చెందింది. బైక్ మీదు ఉన్న అమర్, తేజస్విని, మల్లేశ్వరీల తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న మరో ముగ్గురు కూడా గాయపడ్డారు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వటంతో క్షతగాత్రులను గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. తలకు తీవ్రగాయాలైన అమర్, మల్లేశ్వరి పరిస్థితి విషమంగా ఉంది. తేజస్వినికి మెరుగైన వైద్యం కోరకు ఆమె తండ్రి ప్రైవేటు హస్పటల్‌కు తరలించాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలంలో వివరాలు సేకరించారు. బంధువులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తామని ఎస్.ఐ జోజి తెలిపారు. మృతురాలు వెంకట రత్నం భర్త మూడేళ్ల క్రితం గుండె పోటుతో మృతి చెందారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	170, 179, 190
చికెన్ విత్ స్కిన్(కిలో)	330.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	340.00

రెవెన్యూ సమస్యలు సత్వరం పరిష్కరించండి


కర్లపూడిలో ఎమ్మెల్యే ప్రవీణ్‌కు భూ హక్కు పత్రాలు అందజేస్తున్న రైతు

భూములిచ్చేందుకు రైతులు సుముఖత

అమరావతి, జనవరి 24(ఆంధ్ర జ్యోతి): రైతుల రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం కర్లపూడి, ఎండ్రాయి, పెదమద్దూరు గ్రామాల్లో సీఆర్డీయే కార్యాలయాలను సందర్శించి స్థానిక రైతులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే పిలుపు మేరకు కర్లపూడి గ్రామ రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకరించి 200 ఎకరాల ధ్రువీకరణ పత్రాలను ఆయనకు అందజేశారు. ప్రతి గ్రామంలో స్థానిక నాయకులు, ప్రత్యేక సిబ్బందితో కమిటీ వేసి భూ సమీకరణ త్వరితగతిన పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

రేపు కాచిగూడకు ప్రత్యేక రైలు

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 26న గుంటూరు మీదగా కాచిగూడకు ప్రత్యేక రైలుని నడపన్నున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 07506 మచిలీపట్నం - కాచీగూడ ప్రత్యేక రైలు సోమవారం రాత్రి 9.15 గంటలకు బయలుదేరుతుందని, చర్లపల్లి, మల్కాజ్‌గిరిలోనూ నిలుపుదల ఉన్నట్లు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం 548.90 అడుగులు

విజయపురిసౌత్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శనివారం నాటికి 548.90 అడుగులు ఉంది. ఇది 207.36 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,000, ఎడమ కాలువ ద్వారా 7029, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 4,794, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,200, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో 24323 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో 24323 క్యూసెక్కులుగా ఉంది.

సాంకేతిక లోపంతో ఆగిన రైలు

వేమూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తెనాలి నుంచి రేపల్లెకు వెళ్లే ప్యాసింజర్ రైలు సాంకేతిక కారణాలతో శనివారం సాయంత్రం వేమూరు స్టేషన్ ఔటర్ అంబేడ్కర్ నగర్ సమీపంలో నిలిచిపోయింది. సిగ్నల్ వ్యవస్థ సరిగా పనిచేయక.. రైలు ఆగిపోవడంతో స్టేషన్ సిబ్బంది స్పందించి లోపాన్ని సరి చేశారు.

గుంటూరు సిటీ వార్తలు

♦ గుంటూరు తూర్పు ♦ పశ్చిమ



వాకథాన్‌లో పోలీసులు, రమేష్ హాస్పిటల్ సిబ్బంది

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

● ఈగల్ డీఎస్పీ సింగయ్య ఉద్బోధ

గుంటూరు మెడికల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): యువతను మత్తుకు బానిసలుగా మార్చే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఈగల్ డీఎస్పీ కే.సింగయ్య ఉద్బోధించారు. శనివారం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో స్థానిక స్తంభాలగరువు సెంట రలోని ఓరియన్ హోటల్ సెంటర్‌లో 'డ్రగ్స్ వద్దని చెప్పండి' పేరిట ఏర్పా టు చేసిన వాకథాన్‌లో ఆయన ప్రసంగించారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత మాట్లాడుతూ మా దక ద్రవ్యాల సేవనం చెడు వ్యసనమని, వీటి బారిన పడితే ఆరోగ్యం దెబ్బ తినడంతో పాటు సామాజికంగా వివక్ష తప్పదని హెచ్చరించారు. అనం తరం వాకథాన్ స్తంభాలగరువు సెంతటర్ నుంచి ప్రారంభమైన మార్కెట్ సెంటర్‌లోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో ఈగల్ సీఐ కే.విక్టర్, ఎస్ఐ ఎం.సునీల్ బాబు, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ అధ్యక్షురాలు అనురాధ, కార్యదర్శి నందిపాటి వాణికుమారి రమేష్ హాస్పిటల్స్ బిజినెస్ హెడ్ డాక్టర్ యలవర్తి కార్తీక్ చౌదరి పాల్గొన్నారు.

నేడు విసన్నపేటలో ఉపకార వేతనాల పంపిణీ

● తులసీ సీడ్స్ ఎండీ యోగీష్‌చంద్ర



తులసీ యోగీష్‌చంద్ర

గుంటూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్, గుంటూరు' 'కోపా-విసన్నపేట' సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం విసన్నపేటలో ప్రతిభ పురస్కారాలలో భాగంగా చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 247 మంది పేద విద్యార్థులకు రూ. 9 లక్షల 50 వేలు ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు తులసీ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసీ యోగీష్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో రూ. 4 లక్షల 33వేలు తులసి సీడ్స్ వారు 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ద్వారా 114 మంది పేద విద్యార్థులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఎన్‌టీఆర్ జిల్లా విసన్నపేటలోని వికాస్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం మధ్యాహ్నం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరై విద్యార్థులకు ఉపకార వేతనాలను పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు.



ప్రసంగిస్తున్న ఉప కులపతి డాక్టర్ చంద్రశేఖర్

నూతన పరిశోధనలతో మెరుగైన సేవలు సాధ్యం

● హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్ వెల్లడి

గుంటూరు మెడికల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : వైద్యులు నిరంతర పరిశోధనలు, నూతన ఆవిష్కరణల ద్వారా మెరుగైన వైద్య సేవలను ప్రజలకు అందించవచ్చని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ పుల్లల చంద్రశేఖర్ ఉద్బోధించారు. కేర్ దంత వైద్య కళాశాలను శనివారం సందర్శించి వైద్యులను, దంత వైద్య విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమానికి కేర్ డెంటల్ కాలేజీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ సయ్యద్ రసూల్ అధ్యక్షతవహించారు. దంత వైద్య విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని నిష్ణాతులైన వైద్యులుగా సమాజానికి సేవలు అందించాలని వీసీ డాక్టర్ చంద్రశేఖర్ కోరారు. డాక్టర్ సయ్యద్ రసూల్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించడంలో వీసీ చంద్రశేఖర్ చూపిన చొరవ ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో కేర్ దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, ఓరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మెహబూబ్, ఓరల్ పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ సురేష్, ఓరల్ మెడిసిన్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ స్మిత పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న భాష్యం రామకృష్ణ

ముగిసిన భాష్యం లెక్సికన్ లెజెండ్స్ స్పెల్ బీ పోటీలు

గుంటూరు(విద్య),జనవరి 24(ఆంధ్రజ్యోతి): జీవితమంటేనే నేర్చుకునే ప్రక్రియ అని దానిని అర్థం చేసుకున్నవారే జీవితంలో విజయవంతులవుతారని ప్రముఖ స్పెల్ బీ మాస్టర్ డాక్టర్ సయ్యద్ ఆమీర్ మెహబూబ్ అన్నారు. స్థానిక గోరంట్ల టెన్త్ క్యాంపస్ థియేటర్ లో భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో జరుగుతున్న భాష్యం లెక్సికన్ లీగ్ ఏ స్పెల్బౌండ్ వర్డ్ ఒడిస్సీ 2025-26 సెంట్రల్ లెవల్ లెక్సికన్ లెజెండ్స్ స్పెల్ బీ పోటీలు శనివారం ముగిశాయి. ముఖ్య అతిథి డాక్టర్ ఆమీర్ మెహబూబ్ మాట్లాడారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే ప్రతి సవాలు నుంచి పాఠం నేర్చుకోవాలని అదే మీ ప్రయాణంలో దారి చూపిస్తుందన్నారు. రెండో రోజు జరిగిన స్పెల్ బీ పోటీల్లో 7వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. రౌండ్లవారీగా జరిగిన ఈ పోటీల్లో గెలుపొందిన విజేతల బహుమతులు అందజేశారు.

మలబార్ వారి బ్రైడల్ జ్యువెలరీ షో ప్రారంభం

గుంటూరు(తూర్పు), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో బ్రైడల్ జ్యువెలరీ షోను శనివారం టీడీపీ జిల్లా పార్లమెంట్ కార్యదర్శి గంటా మౌళిక, వ్యాపారవేత్త పెద్ది రమణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రదర్శన ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరుగుతుందన్నారు. బ్రైడల్ జ్యువెలరీ షోలో ప్రత్యేక వజ్రాభరణాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. బంగారం, రత్నాభరణాలు, అన్‌కట్ ఆభరణాల తరుగు చార్జీలపై 30 శాతం, వజ్రాభరణాల విలువపై 30శాతం వరకు తగ్గింపును అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టోర్ హెడ్ నదీర్, జితిన్, మార్కెటింగ్ మేనేజర్ గోపి కిరణ్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.



అభరణాలను ప్రదర్శిస్తున్న గంటా మౌళిక, పెద్ది రమణారావు తదితరులు

28 నుంచి గరికపాటి ఆధ్యాత్మిక ప్రసంగాలు

గుంటూరు(తూర్పు), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిపురం, శ్రీ రమ సత్యనారాయణ స్వామి దేవస్థాన 49వ బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఆలయ ప్రాంగణంలో ప్రముఖ ప్రవచన కర్త బ్రహ్మశ్రీ గరికపాటి నరసింహారావుచే యోగా వాసిష్టంపై ఆధ్యాత్మిక ప్రసంగం జరుగుతుందని ఆలయ పాలక కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 6.30 గంటలకు ఈ ప్రసంగాలు ప్రారంభమవుతాయన్నారు. 30వ తేదీ నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 31న బలిహరణ, కుంకుమార్చన, ఎదురుకోల, అనంతరం స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు.

బాల్య వివాహాలు జరిగితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు

● డీఆర్‌వో ఖాజావలి హెచ్చరిక



కలెక్టరేట్‌లో జరిగిన బాల్యవివాహాల నిర్మూలన సదస్సులో ప్రసంగిస్తున్న డీఆర్‌వో ఖాజావలి

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు చేపడతామని డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి హెచ్చరించారు. జాతీయ బాలికా దినోత్సవం, బాల్య వివాహ ముక్తిభారత్ రెండవ విడత ప్రచార కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్‌లో వివిధ మతాలకు సంబంధించిన మతాధికారులకు బాల్య వివాహ నిరోధంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఆర్‌వో మాట్లాడుతూ జిల్లాను బాల్యవివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, దీనికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలన్నారు. జిల్లా మహిళ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి పీపీజీ ప్రసూన మాట్లాడుతూ 181, 1098 టోల్ ఫ్రీ నెంబర్స్ ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ జీఏ ప్రమీల, దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి కే.వీరాంజనేయులు, జిల్లా మైనార్టీ అధికారి జే.పార్థసారధి, డిప్యూటీ కమిషనర్ వెంకటకృష్ణయ్య, మత పెద్దలు రొంపిచర్ల శేషకుమార్, హఫీస్ మహమ్మద్ రిజ్వాన్, బీ.రవి ప్రకాష్, క్రాఫ్టు పీడీ, ఫ్రాన్సిస్ తంబి ఐటీసీ ప్రతినిధి కేవీ నారాయణ పాల్గొన్నారు.

చిన్న వయస్సులోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చిన్న వయస్సు నుంచే ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా ప్రతి ఒక్క విద్యార్థిని కష్టపడి చదువుకోవాలని ఎక్సైజ్ పోలీస్ డిపార్ట్మెంట్ సూపరింటెండెంట్ కె అరుణ కుమారి సూచించారు. నవజీవన్ బాల భవన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్‌లో శనివారం జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీ నిరీక్షణ బాబు, నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎం కవిత, బీ రమేష్, సుధా, మహిళా సంరక్షణ కార్యదర్శి భాగ్యలత, అంగన్వాడీ సూపర్‌వైజర్ రహిమున్, ఉపాధ్యాయులు సంధ్యారాణి, సుజాత పాల్గొన్నారు.

సమగ్ర కుల గణన శాస్త్రీయంగా నిర్వహించాలి

● జస్టిస్ ఈశ్వరయ్య

గుంటూరు కార్పొరేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సమగ్ర కుల గణన శాస్త్రీయంగా వెంటనే నిర్వహించి వెనుకబడిన తరగతుల వారికి చట్టసభలలో రిజర్వేషన్ కల్పించడంతో పాటు అన్ని స్థాయిల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ పి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. గుంటూరులో భారతరత్న, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్ 102వ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లు అమలవడం ద్వారా దేశ ప్రగతి సాధ్యమైందన్నారు. మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ బతుకు దృశ్యాన్ని మార్చిన పేదల పెన్నిధి, బహుజనుల బంధువు కర్పూరి ఠాగూర్ అని కొనియాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ సమానత్వ సిద్ధాంత వ్యూహకర్త కర్పూర ఠాగూర్ అని వివరించారు. ఆల్ ఇండియా దళిత సేన చైర్మన్ జేబీ రాజు, నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ చైర్మన్ వీజీఆర్ నారగోని, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, జననాయక్ కర్పూరి ఠాగూర్ ఫౌండేషన్ నేతలు ఎం.సూర్యనారాయణ, ఉగ్గం సాంబశివరావు, పీవీ రమణయ్య, దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్ కుమార్, సమాజ్‌వాది పార్టీ గుంటూరు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు శాఖమూరి సాంబశివరావు, వీసీకే పార్టీ రాష్ట్ర మహిళాధ్యక్షురాలు కైలా జయసుధ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ప్రముఖ రచయిత జూలూరు గౌరీ శంకర్ సంపాదకత్వంలో వెలువడిన జననాయక్ పుస్తకాన్ని, రామ్ మనోహర్ లోహియా పుస్తకాలను జస్టిస్ పి.ఈశ్వరయ్య ఆవిష్కరించారు.



ప్రసంగిస్తున్న జస్టిస్ ఈశ్వరయ్య, వేదిక పైన మాజీ మంత్రి డొక్కా జంగా, లక్ష్మణ రెడ్డి తదితరులు

● గుంటూరు(తూర్పు), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గా ల అభ్యున్నతికి నిరంతరం పోరాడిన గొప్ప నాయకుడు జననాయక్ కర్పూ రి ఠాకూర్ అని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం కొనియాడారు కర్పూరి ఠాకూర్ జయంతి సందర్భంగా శనివారం స్థానిక గోరంట్లలోని ఆయన విగ్రహానికి రుద్రకోటి సదాశివం పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. జననాయక్ కర్పూరి ఠాకూర్ ఫౌండేషన్ చైర్మన్ పీవీ రమణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కందుకూరి వెంకట్, నాయీబ్రాహ్మణ సంఘ నాయకులు తుళ్లూరు కాంతి కిరణ్, అద్దంకి రవి, కొమ్మూరి దేవప్రసాద్, మల్లాది నాగరాజు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కిమ్స్ శిఖరలో విజయవంతంగా కాలేయ మార్పిడి ఆపరేషన్లు

● బ్రెయిన్ డెడ్ వ్యక్తుల నుంచి కెడావర్ ట్రాన్స్‌ప్లాంటేషన్

గుంటూరు మెడికల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో కెడావర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా ఇద్దరు రోగులకు కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. ఆసుపత్రి వైద్య వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం...కృష్ణా జిల్లాలోని రమణక్క పేటకు చెందిన సీహెచ్ సుబ్బలక్ష్మి (61) పక్షవాతంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, జనవరి 10న ఆమె బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు ప్రకటించారు. అదేవిధంగా వట్టిచెరుకూరు మండలం కోవెలమూడికి చెందిన కడియం నాగమల్లేశ్వరి (60) పక్షవాతం బారిన పడి చికిత్స పొందుతుండగా, జనవరి 11న ఆమెను బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. జీవన్‌దాన్ ట్రస్ట్ ప్రతినిధులు బాధిత కుటుంబ సభ్యులను కలసి కౌన్సెలింగ్ చేయగా, అవయవదానానికి ఇరు కుటుంబాలు అంగీకరించాయి. అనంతరం గ్రీన్ ఛానల్ ద్వారా పోలీసు అధికారులు తగిన ఏర్పాట్లు చేయడంతో రెండు కాలేయాలను గుంటూరులోని కిమ్స్ హాస్పిటల్స్‌కు తరలించారు. బరోడాకు చెందిన సంధ్యచంద్రకాంత్ పటేల్ (59)కు, కావలికి చెందిన వై.మస్తానయ్య (55)కు వీటిని అమర్చారు. కాలేయ మార్పిడి శస్త్రచికిత్సల్లో కిమ్స్ హాస్పిటల్స్‌కు చెందిన లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సర్జన్ డాక్టర్ వేణుగోపాల్, సర్జికల్ గ్యాస్ట్రోఎంటిరాలజిస్ట్ డాక్టర్ ఆర్.విష్ణుప్రసాద్, మెడికల్ గ్యాస్ట్రోఎంటిరాలజిస్ట్ డాక్టర్ వీ.ప్రతాప్‌మౌళీ, రేడియాలజిస్టులు డాక్టర్ యామిని, డాక్టర్ వెంకట్ చౌదరి, ఎనస్థటిస్ట్ డాక్టర్ కళ్యాణ్‌రామ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్స్ సూపరింటెండెంట్ డాక్టర్ కే.వినోద్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రభ, కిమ్స్ హాస్పిటల్స్ గుంటూరు యూనిట్ హెడ్ డాక్టర్ హరికుమార్ , ట్రాన్స్‌ప్లాంట్ కో ఆర్డినేటర్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



లివర్ మార్పిడి చేయించుకున్న పటేల్‌తో కిమ్స్ వైద్యబృందం

అంధులకు అండగా నిలబడాలి : మేయర్

గుంటూరు(తూర్పు), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అంధులకు ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. స్థానిక 25 డివిజన్‌లోని కళాభారతి అంధుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. టీడీపీ నాయకుడు బత్తుల జాన్‌సైదా, డివిజన్ అధ్యక్షుడు గాలశి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పాఠశాలలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు, టీడీపీ నాయకుడు కసుకుర్తి హనుమంతరావు, కార్పొరేటర్ ఈరంటీ వరప్రసాద్, రుస్తుంబాబు, వీరయ్య, ఎస్సీ నాయకులు జీవన్, డానియేల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ పేదలకు, దళితులకు వ్యతిరేకం : నిర్మల్

గుంటూరు(తూర్పు), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు, దళితులకు వ్యతిరేకంగా ఉందని ఆల్ ఇండియా దళిత్ రైట్స్ మూమెంట్ (ఏఐడీఆర్‌ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి వీఎస్ నిర్మల్ విమర్శించారు. గుంటూరు, కొత్తపేట మల్లయ్య లింగం భవన్లో రెండు రోజులుగా జరుగుతున్న ఏఐడీఆర్‌ఎం, డీహెచ్‌ఆర్పీ జాతీయ సమావేశాలు శనివారంతో ముగిశాయి. ఏఐడీఆర్‌ఎం జాతీయ అధ్యక్షుడు రామ్మూర్తి అధ్యక్షత వహించగా, బీకేఎంయూ జాతీయ ప్రధాన కార్యదర్శి గుల్జార్‌సింగ్ గోరియా, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు, ప్రభాకర్, రాయప్ప, మధుకర్, మాల్యాద్రి పాల్గొన్నారు.

గణతంత్రోత్సవ జిల్లా వేడుక సమయం మార్పు

● ఉదయం 11.30 గంటలకు కార్యక్రమాలు ప్రారంభం

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో సోమవారం జరిగే గణతంత్ర దినోత్సవ జిల్లా స్థాయి వేడుక సమయాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా మార్పు చేశారు. గతంలో ఉదయం 9 గంటలకు జెండా వందనం చేసి ఆ తర్వాత సాంస్కృతిక, శకటాల ప్రదర్శనలు జరిగేవి. అయితే ఈ సంవత్సరం రాష్ట్ర స్థాయి వేడుక అమరావతి రాజధానిలో జరగనుండటంతో ఆ కార్యక్రమానికి గవర్నర్, సీఎం, హైకోర్టు న్యాయమూర్తు హాజరు కానుండటంతో ప్రొటోకాల్ ప్రకారం కలెక్టర్ వెళ్లాల్సి ఉన్నది. ఈ నేపథ్యంలో జిల్లా స్థాయి వేడుకను ఉదయం 11.30 గంటల నుంచి నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కారణంగా శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటుని రద్దు చేశారు. కేవలం జెండా వందనం, కలెక్టర్ సందేశం, విద్యార్థులతో రెండు, మూడు సాంస్కృతిక ప్రదర్శనలు, అవార్డుల పంపిణీ కార్యక్రమాలు మాత్రమే నిర్వహించనున్నట్లు డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి తెలిపారు.

బీజేపీలో చేరిన కాంగ్రెస్ పార్టీ నేత లక్ష్మీనారాయణ శాస్త్రి

● పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

గుంటూరు కార్పొరేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రావూరి లక్ష్మీనారాయణ శాస్త్రి బీజేపీలో చేరారు. విజయవాడ మున్సిపల్ స్టేడియం వేదికగా శనివారం నిర్వహించిన ఏకాత్మ మానవదర్శన పునఃస్మరణ సభలో ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర బీజేపీ జనరల్ సెక్రటరీ నూకల మధుకర్, రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి వలూరు జయప్రకాష్ నారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చేరుకూరి తిరుపతిరావు పాల్గొన్నారు.

స్పేస్ సమ్మిట్‌లో సీతారామయ్య హై స్కూల్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరుకార్పొరేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో ఈనెల 22 నుండి 24 వరకు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్పేస్ సమ్మిట్ పోటీలలో లక్ష్మీపురంలోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో 6, 7వ తరగతుల నుంచి ఈ. సుప్రీత శ్రీ, షేక్ రెహాన్, ఎన్.జీవిక, ఎం. దేదీప్య పాల్గొని ద్వితీయ స్థానం సాధించారు. అంతేగాక రూ.10 వేల నగదు పురస్కారాన్ని నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు చేతుల మీదగా అందుకున్నారు. పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్, పాలక వర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ఉపాధ్యాయులందరు విద్యార్థులకు శుభాభినందనలు తెలిపారు.

మహిళా ఉద్యోగులకు ప్రత్యేక శిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జీజీహెచ్ ప్రాంగణంలో మహిళా ఉద్యోగులకు క్రెచ్ (శిశు సంరక్షణ కేంద్రం) ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వికి వినతి పత్రం అందజేశారు. అనంతరం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ జీజీహెచ్‌లో దాదాపు 1100 మంది మహిళా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని, వారికి క్రెచ్ సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్, ఏ.శ్యాంసుందర్ శ్రీనివాస్, డా.వి విజేత, వెల్లంపల్లి పద్మజ, షేక్ తాజున్నీసా, రత్నకుమారి తదితరులు ఉన్నారు.

స్వర్ణ భారతినగర్ రౌడీషీటర్లకు పోలీస్ ట్రీట్మెంట్

● 18 మంది నిందితులను రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్ళిన పోలీసులు

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణ భారతి నగర్‌లో రెచ్చిపోతున్న రౌడీషీటర్లకు పోలీసులు ట్రీట్మెంట్ ఇచ్చారు. ఈనెల 16, 17 తేదీల్లో రెండు వర్గాలు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకొని హత్యాయత్నాలకు పాల్పడ్డారు. నేతాజీ నగర్ ఆరో లైన్‌కు చెందిన రౌడీషీటర్ షేక్ కిరణ్ బాబు అలియాస్ చెరువులో కిరణ్ అదేవిధంగా మరో వర్గానికి చెందిన మరికతల సాయి వర్గాలు తెలపడ్డాయి. ఈ ఘటనలపై నల్లపాడు పోలీస్‌స్టేషన్లో ఇరువర్గాలపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఈ కేసులను సౌత్ డీఎస్పీ భానోదయ సీరియస్‌గా తీసుకుని లాఠీ కౌన్సిలింగ్ ఇచ్చారు. శనివారం వారందరిని ఘటనా స్థలం దగ్గర నుంచి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకువెళ్లి కోర్టులో హాజరుపరిచారు. మొత్తం 18 మంది నిందితులతో రోడ్ షో నిర్వహించారు. ఆయా నిందితులకు డీఎస్పీ భానోదయ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు.

వ్యభిచార కేంద్రం గుట్టురట్టు

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పండరీపురం 5వ లైన్ లో గుట్టుగా సాగుతున్న వ్యభిచార కేంద్రాన్ని టాస్క్ ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. నగరానికి చెందిన పాటిబండ్ల ద్వారక అలియాస్ చిన్ని, పిడతల ధనలక్ష్మిలు పండరీపురం 5వ లైన్ లో ఓ ఇల్లు అద్దె తీసుకొని కొంతకాలంగా గుట్టుగా వ్యభిచార కార్యకలాపాలు సాగిస్తున్నారు. సమాచారం అందుకున్న టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం ఆ ఇంటిపై దాడి చేసి నిర్వాహకులతో పాటు లాలాపేట ప్రాంతానికి చెందిన అర్జి జానకి శ్రీనివాసరావు, పొన్నూరుకు చెందిన కుర్రా అజయ్‌తో పాటు మంగళగిరి, విజయవాడ ప్రాంతాలకు చెందిన యువతులను అదుపులోకి తీసుకున్నారు.

ఫ్యామిలీ కోర్టు పీపీగా చిన కోటేశ్వరరావు

నగరంలో అదనపు జిల్లా న్యాయస్థానాల్లో పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కుటుంబ న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వెలిదండి చిన కోటేశ్వరరావును నియమించింది. ఈ పదవిలో ఆయన మూడు సంవత్సరాలు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఫ్యామిలీ కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన వెలిదండి చిన కోటేశ్వరరావుని పోక్సో కోర్ట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తీగల దుర్గాప్రసాద్, పలువురు న్యాయవాదులు సత్కరించారు.

ఓపెన్ పికిల్ బాల్ పోటీలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పికిల్ బాల్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో స్థానిక గోరంట్లలోని నెక్స్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం గుంటూరు ఓపెన్ పికిల్ బాల్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను పాఠశాల డైరెక్టర్ కె శ్రీకాంత్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎం శివకుమార్ ప్రారంభించారు. అనంతరం డాక్టర్ శివకుమార్ మాట్లాడుతూ ఈ పోటీల్లో గుంటూరు, విజయవాడ, భీమవరం, ఒంగోలుకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీ పేరయ్య చౌదరి, డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, ఏపీ, జిల్లా పికిల్ బాల్ సంఘం కార్యదర్శులు ఎన్ శ్రీధర్, జీవీఎస్ ప్రసాద్, సభ్యులు సుష్మ, కే అరుణ్ కుమార్, మన్సూర్ వలి పాల్గొన్నారు.

అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదు

● పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి



మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు మౌలిక సదుపాయాలు, రహదారులు, కాలువలు, చెరువుల అభివృద్ధి విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం ఉండకూడదని, నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే గల్లా మాధవి అధికారులను ఆదేశించారు. గుంటూరులోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆమె మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. గెలాక్సీ బార్ పక్కన ఉన్న రోడ్డును వెడల్పు చేయడంలో ఎదురవుతున్న అన్ని సమస్యలను పరిష్కరించి, జనవరి 30లోపు పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. జమీం దార్ చెరువుకు ప్రహరీ, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యానగర్ 2వ లైన్‌లో పునర్నిర్మాణం ప్రక్రియ పూర్తి చేసి వెంటనే బాండ్స్ జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముత్యాల రెడ్డి నగర్ మెయిన్ రోడ్డుకు సంబంధించి సీసీ రోడ్డు, కాలువల పనులు, అలాగే విద్యానగర్ మొదటి లైన్ విస్తరణ, 49వ డివిజన్ కొండయ్య కాలనిలోని రోడ్డు పనులు, 36వ డివిజన్‌లోని రజక చెరువు ప్రహరీ, వాకింగ్ ట్రాక్, 20వ డివిజన్ నంబూరు సుభాని కాలనీ, పీకలవాగు కట్ట వద్ద 20 మీటర్ల రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.

బాలికల ఆత్మస్థైర్యానికి ఎన్‌సీసీ దోహదం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ విద్యార్థినులకు ఆత్మస్థైర్యం, మనోధైర్యం పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదం చేస్తుందని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. పొన్నూరు రోడ్డులోని అంజుమన్ హైస్కూల్లో శనివారం ఎన్‌సీసీ కార్యక్రమాన్ని కమాండింగ్ డైరెక్టర్ ఎస్వీఎస్ కల్నల్ సుదర్శన్‌తో కలిసి ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో 25 సంవత్సరాలుగా మైనారిటీ విద్యార్థినులకు ఉన్నత విద్యావకాశాలు కల్పిస్తూ వారికి మంచి భవిష్యత్తు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీతో మానసిక, శారీరక దృఢత్వం కలుగుతుం దని, నాయకత్వ లక్షణాలు వస్తాయని తెలిపారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అంజుమన్ ఇస్లామియా ఆధ్వర్యంలో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సైదా, జహిద్, షౌకత్, బషీ, మాగబుల్, రఫీ, మౌలానా రహమాన్, ప్రిన్సిపాల్ నసీమా తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ నుంచి రెవెన్యూ మంత్రి స్థాయికి ఎదిగిన వీరయ్య చౌదరి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు



వీరయ్య చౌదరి, పరిటాల రవి చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న మాణిక్యరావు, మేయర్ కోవెలమూడి


గుంటూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గ్రామ సర్పంచ్ స్థాయి నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ మంత్రిగా పనిచేసే స్థాయికి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి ఎదిగారని, అదే ఆయన సామర్థ్యానికి నిదర్శన మని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు అన్నారు. టీడీపీ గుంటూరు జిల్లా కార్యాలయంలో శనివారం సంగండెయిరీ వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర హాజరై వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చిట్టాబత్తిన శ్రీనివాసరావు (చిట్టిబాబు), కసుకుర్తి హనుమంతరావు, గోళ్ళ ప్రభాకర్, వేములకొండ శ్రీనివాస్, ఈరంటి వరప్రసాద్, పద్మావతి, మాణిక్యం, గంటా మౌళిక, కొనకళ్ళ సత్యనారాయణ, మేడా రామకృష్ణ, తలతోటి సురేంద్ర, కొల్లి అనీల్, బెల్లంకొండ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అంధుల పాఠశాలలో...

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, సంగండెయిరీ వ్యవస్థాపకులు, టీడీపీ నేత దివంగత ధూళిపాళ్ళ వీరయ్య చౌదరి 32వ వర్ధంతిని పురస్కరించుకుని ఘనంగా నివాళులర్పించారు. ఈ మేరకు శనివారం బ్రాడీపేటలోని సాయిదీనజన సేవా సమితిలో మాజీ మంత్రి డాక్టర్ మాకినేని పెదరత్తయ్య చేతుల మీదుగా అంధులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుఖవాసి శ్రీనివాసరావు పులివర్తి వెంకటేశ్వరరావు (అజార్), చల్లా అచ్చిరెడ్డి, ప్రదీప్, సోమినేని శ్రీనివాసరావు, పాటిబండ్ల బలరామ్, సుశీలరావు, భావన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

● న్యాయాధికారి లత



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి లత

గుంటూరు లీగల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహనతో పాటు అప్రమత్తంగా ఉండాలని గుంటూరు 5వ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి జస్టిస్ లత అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సాయి కళ్యాణ్ చక్రవర్తి సూచనల మేరకు శనివారం ఆమె మాస్టర్‌మైండ్స్ జూనియర్ కాలేజీలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించి అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని సైబర్ నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాలేజీ డైరెక్టర్ మట్టపల్లి మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌కు వీలున్నంతవరకు దూరంగా ఉండాలని చెప్పారు. అరండల్‌పేట ఎస్. ఐ. ఏడుకొండలు, కళాశాల విద్యార్థులు, కోర్టు సిబ్బంది, పోలీసులు ఈ న్యాయ విజ్ఞాన సదస్సు లో పాల్గొన్నారు.

బాధ్యతారహితంగా జోగి రమేశ్ వ్యాఖ్యలు : వేములకొండ

గుంటూరు,జనవరి 24(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో అరెస్టై జైలు నుంచి విడుదలైన అనంతరం వైసీపీ నేత జోగి రమేష్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యంగా, న్యాయవ్యవస్థను అవమానించేలా ఉన్నాయని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఒక ప్రజాప్రతినిధిగా ఉండి, రెడ్ బుక్ అంటూ మంత్రి లోకేశ్‌పై వ్యక్తిగత దూషణలకు దిగడం, ముఖ్యమంత్రి చంద్రబాబును బెదిరించే తరహా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.

ఘనంగా ప్రభుత్వ మహిళా కళాశాల రజతోత్సవాలు

గుంటూరు(విద్య), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాంబశివపేట ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి) లేడీ హోప్ అలోమ్ని అసోసియేషన్ 25 సంవత్సరాల రజతోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాలలో 1950 నుండి 2000 సంవత్సరం వరకు విద్య అభ్యసించిన పూర్వ విద్యార్థినిలు ఆత్మీయ, పలకరింపులు, ఆలింగనాలతో కళాశాల గత స్మృతులను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల విద్య ప్రాంతీయ పర్యవేక్షకురాలు(ఆర్జెడి) డాక్టర్ పి కళావతి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వి సుందరచారి, మాజీ మంత్రి, పూర్వ విద్యార్థిని డాక్టర్ శనక్కాయల అరుణ ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి రమా జ్యోత్స్న కుమారి, పూర్వ విద్యార్థినులు బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి అన్నపూర్ణమ్మ రూ.5 లక్షలు, ఆర్‌బీఐ విశ్రాంత మేనేజర్ పార్వతి శాస్త్రి రూ.లక్ష విరాళం అందజేశారు.

జాతీయ పోటీలలో మరిన్ని పతకాలు సాధించాలి

గుంటూరు(తూర్పు), జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో ఈ నెల 30 నుంచి జరిగే జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో జిల్లా క్రీడాకారులు రాణించి మరిన్ని పతకాలు సాధించాలని మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్ అన్నారు. గత నెలలో బాపట్లలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో విజేతలు ఈ జాతీయ పోటీలలో పాల్గొంటారని అన్నారు.

వ్యవసాయకుల కష్టాలు

● గ్రామ వ్యవసాయ సహాయకులపై పనిభారం

- క్రాప్ బుకింగ్‌లో..బీడు భూములు సైతం నమోదు
- ఒక్కో జిల్లాకు లక్షలాది పార్శిల్స్(కమతాలు)
- తక్కువ గడువు విధించడంతో.. తీవ్ర ఒత్తిడి
- ఎరువుల అమ్మకం, యాప్‌ల నిర్వహణ అదనం

సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేసుకోవడం వల్ల రైతులకు ప్రభుత్వ పథకాలన్నీ.. అందుతాయి. అసలు పంటే వేయని రైతు వివరాలు కూడా క్రాప్ బుకింగ్ చేయాలి అంటే ఏమనుకోవాలి.. ఇప్పుడు క్రాప్ బుకింగ్ అంటే అర్థం మారింది. సాగు చేసిన పంట వివరాలతో పాటు.. సాగు చేయని పంట భూముల సమాచారం పొందుపరుస్తున్నారు. పొలాలు బీడు పెట్టిన యజమానిని సైతం.. వెతికి తెచ్చి మరీ ఈకేవైసీ చేయాలి. ఇప్పుడు ఇదే గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు (వీఏఏ) తలకు మించిన భారంగా పరిణమించింది. దీంతో ఈ గ్రామీణ వ్యవసాయ సహాయకులు పని ఒత్తిడి ఎదుర్కొంటున్నారు.



(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

ప్రతి జిల్లాలో లక్షలాది భూ భాగాలను.. క్రాప్ బుకింగ్ చేయాలని ప్రభుత్వ ఆదేశం. గుంటూరు జిల్లాలో 4,14,509, పల్నాడు జిల్లాలో 6,87,802, బాపట్ల జిల్లాలో 7,97,512 పార్సిల్స్(కమతాలు) ఉన్నాయి. ప్రభుత్వం ఈ మొత్తం పని ఫిబ్రవరి 20వ తేదీలోపు పూర్తి చేయాలని గడువు పెట్టింది. పొలం సాగులో ఉంటే ఇబ్బంది ఉండదు కానీ, బీడు భూమిగా ఉంటేనే అసలు సమస్య అని వ్యవసాయ సహాయకులు చెబుతున్నారు. బీడు భూముల యజమానులు చాలా మంది ఊర్లలో అందుబాటులో ఉండరు. ముఖ్యంగా అతి తక్కువ సమయంలో పలు భూ బాగాలను సర్వే చేసి.. యాప్‌లో నమోదు చేయడం, పొరపాట్లను సరిచేయడం కష్టంగా మారిందని చెబుతున్నారు.

యాప్ సమస్యలు, డిజిటల్ భారం

క్రాప్ బుకింగ్ యాప్‌లోని లోపాలు వీఏఏల పనిని మరింత క్లిష్టం చేస్తున్నాయి. కొన్ని భూభాగాలు సమాచారం సరిగ్గా లేకపోవడం (నో-డేటా), సాగు చేసిన పొలంలో కి వెళ్తే తప్ప ఆన్‌లైన్‌లో రైతుల వివరాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ఒక వైపు క్రాప్ బుకింగ్ చేస్తూనే.. మరో వైపు ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్మెంట్ సిస్టం 2.ం యాప్‌ను ప్రతి రైతు ఫోన్‌లో ఇనిస్టాల్ చేయాలని అధికారులు చెబుతున్నారు. సదరు యాప్ ఇన్‌స్టాల్ చేసి.. రైతుల ఆధార్ ఆధారంగా రిజిస్ట్రేషన్, పాస్‌వర్డ్ సృష్టించడం వంటి బాధ్యత కూడా అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు నిర్వర్తిస్తున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ (ఏపీఎఫ్ఆర్)కూడా వీఏఏలు చేస్తున్నారు. రైతు సమాచారం నమోదు చేసి, వారి వేలి ముద్రలు తీసుకోవాలి. అలా జరిగితేనే రైతులకు జాతీయస్థాయి లో ప్రభుత్వం కేటాయించే 12 అంకెల గుర్తింపు సంఖ్య జారీ అవుతుంది.

ఎరువుల అమ్మకం.. పంపిణీ, లెక్కలు

ఇవి కాక గ్రామస్థాయిలో రైతు సేవా కేంద్రాలకు వచ్చే ఎరువుల అమ్మకాలు, పంపిణీ, అందుకు సంబంధించిన నగదు నిల్వ, లెక్కలు కూడా వీఏఏలు చూడాల్సి ఉంది. వీటిలో ఏమాత్రం తేడా వచ్చినా చర్యలు కఠినంగా ఉండే ఆస్కారం ఉండడంతో..వారు మరింత ఒత్తిడికి లోనవుతున్నారు.

వదల బొమ్మాలి..

వ్యవసాయ శాఖకు సంబంధించిన పనులతోనే వీఏఏలు అల్లాడిపోతుంటే మండల అభివృద్ధి అధికారులు మరి కొన్ని పనులు వారికి అప్పగిస్తున్నారు. గ్రామ సచివాలయంలో మిగిలిన సిబ్బంది మాదిరిగానే అన్ని సర్వేలు చేయాలని చెబుతున్నారు. సర్వేల నుంచి వ్యవసాయ సిబ్బందిని మినహాయించాలి అన్న మాటలను మండల స్థాయి అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. సీఈఓ స్థాయి అధికారులు చెప్పినా వినకుండా.. ప్రభుత్వ సర్వేలు ఎవరు చేయాలని ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది.

ఐదుగురు మృత్యువాత..

గత క్రాప్ బుకింగ్ ప్రక్రియలో రాష్ట్ర వ్యాప్తంగా ఐదుగురు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు మృతి చెందారని సమాచారం. పని ఒత్తిడి వల్లే ఆ మరణాలు సంభవించినట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని సాగు చేసిన భూమికి మాత్రమే క్రాప్ బుకింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బీడు భూములు క్రాప్ బుకింగ్ చేయడం వల్ల ఉపయోగం ఏమిటన్న ప్రశ్నకు అధికార యంత్రాంగం సమాధానం చెప్పాల్సి ఉంది.

స్వీట్ వార్నింగ్..!

(5వ పేజీ తరువాయి)

నీళ్లలో ఉడికిస్తే వచ్చే తేటను నెయ్యిలో వాడుతున్నారు. సాధరణంగా బంగాళ దుంపలను నీటిలో ఉడికించిన తరువాత ఆ నీరు అధిక బరువును కలిగి ఉంటుంది. అందుకే కల్తీకి దీనిని ఎంచుకున్నారు. స్వచ్ఛమైన నెయ్యికి చలికాలంలో గడ్డకట్టే స్వభావం ఉంటుంది. ఈ మధ్య మార్కెట్‌లో లభించే నెయ్యిలో ఇటువంటి గుణం కనిపించడం లేదు.

● స్వీట్స్ తయారీలో వాడే బెల్లంలో 90శాతం కల్తీనే ఉంటుందనేది బహిరంగ సత్యమే. వీటితో పాటు గోధుమ పిండిలో మైదా, శనగ పిండిలో బఠాణీ పిండి కలుపుతుంటారు.

విస్తృతంగా దాడులు

మోతాదుకు మించి రంగులు వాడుతున్నారనే ఫిర్యాదులు అందడంతో ఈ మధ్య కాలంలో నగరంలో స్వీట్ల దుకాణాలపై ఆహార భద్రతా అధికారులు విస్తృతంగా దాడులు చేపట్టారు. జిల్లా సహాయ ఆహార నియంత్రణాధికారి పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో లాలాపేట, పట్నంబజారు, ఇతర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. రంగులను విరివిగా వాడటం, ప్యాకింగ్‌పై సరైన వివరా లు లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. స్వీట్ల తయారీలో వినియోగిస్తున్న రంగులను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం మూడు దుకాణాలపై కేసులు నమో దు చేసి, శాంపిల్స్‌ను సేకరించారు.



పరేడ్ రిహార్సల్స్ చేస్తున్న సాయుధ దళాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఇతర జిల్లా అధికారులు

ఆకట్టుకున్న రిహార్సల్స్..





తుళ్లూరు, జనవరి 24: అమరావతి రాజధాని పరిధిలో 77వ గణతంత్ర దినోత్సవ ఫుల్ డ్రస్సు రిహార్సల్ శనివారం ఘనంగా జరిగింది. రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యాదర్శి జె.శ్యామలరావు పరిశీలించారు. జంగారెడ్డిగూడెం ఏఎస్పీ ఆర్.సుస్మిత పరేడ్ కమాండర్‌గా వ్యవహరించారు. భారత ఆర్మీ, ఏపీ 2, 16వ పోలీస్ బెటాలియన్, సీఆర్‌పీఎఫ్ సాయుధ దళాలు, ఎన్‌సీసీ క్యాడెట్స్, గురుకుల విద్యార్థులు, రెడ్ క్రాస్ యువదళం కంటింజెన్స్ డ్రెస్ రిహార్సల్స్ చేశారు. స్పెషల్ పోలీసు బ్యాండ్లు అలరించాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ శాఖలు తమ అభివృద్ధిని తెలియజేసే ఆకర్షణీయ శకటాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐజీ రాజకుమారి, గుంటూరు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్, జేసీ అశుతోష్ శ్రీవాత్సవ, సమాచార పౌర సంబంధాలశాఖ సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛాంధ్రగా తీర్చిదిద్దుతాం

● మంత్రి అనగాని సత్యప్రసాద్



సభలో మాట్లాడుతున్న రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. రేపల్లెలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి పాల్గొని ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛ రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. యువత భవిష్యత్ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్, లోకేశ్ కష్టపడుతున్నారన్నారు. జగన్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పతోపాటు చెత్త కుప్పగా మార్చారని ఆరోపించారు. జగన్‌రెడ్డి 84 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించడానికి ఏడాది సమయం పట్టిందన్నారు. వైజాగ్‌ను హైటెక్ హబ్‌గా, తిరుపతిని ఎలక్ట్రానిక్ హబ్‌గా మారుస్తూ బాపట్ల, చీరాలను టూరిజం కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎంపీ తేన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సముద్ర తీరప్రాంతాన్ని టూరిజం హబ్‌గా మార్చేందుకు కృషిచేస్తున్నామన్నారు. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

అంతరిక్షం.. అవకాశాలూ అపారమే

● ఏఐఎంఎస్‌సీఎస్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటరామన్
● విజ్ఞాన్స్ వర్సిటీలో ఘనంగా ముగిసిన ఏపీస్పేస్ టెక్ సమ్మిట్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్ వెంకటరామన్

గుంటూరు(విద్య), జనవరి 24(ఆంధ్రజ్యోతి): అంతరిక్షం ఎంత విస్తారమో, అందులో ఉన్న అవకాశాలూ అంతే అపారమని హైదరాబాద్‌లోని ఏఐఎంఎస్‌సీఎస్ (అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్) డైరెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటరామన్ పేర్కొన్నారు వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ స్పేస్ టెక్ సమ్మిట్-2026 శనివారం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఎస్. వెంకటరామన్ మాట్లాడుతూ.. స్పేస్ టెక్ సమ్మిట్‌లో పాల్గొన్న విద్యార్థులు అంతరిక్ష సాంకేతికతపై ఎంతో నేర్చుకున్నారు. ఈ రంగంలోకి యువత ప్రవేశించి కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు. ఉపగ్రహాల కోసం పోస్ట్-క్వాంటం ప్రోగ్రామింగ్ ఆల్గోరిథమ్‌లను అభివృద్ధి చేసి, ఉపగ్రహాల నుంచి భూమికి వచ్చే డేటా అత్యంత భద్రతతో ప్రసారం అయ్యే విధంగా వ్యవస్థలను రూపొందించవచ్చని వివరించారు. క్వాంటం కంప్యూటర్లు వచ్చినా కూడా, మన కమ్యూనికేషన్‌ను చెదరగొట్టలేని స్థాయిలో భద్రతను చూపించగలుగుతాం అని ధీమా వ్యక్తం చేశారు. క్వాంటమ్ అమరావతి వ్యాలీ అనే ప్రతిష్ఠాత్మక భావనతో ఆంధ్రప్రదేశ్‌ను క్వాంటమ్ టెక్నాలజీలో అగ్రగామిగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర లక్ష్యమని ఏపీ క్వాంటమ్ మిషన్ డైరెక్టర్, హెడ్ సీవీ శ్రీధర్ పేర్కొన్నారు. ప్రపంచాన్ని నిర్ణయించబోయే రంగాల్లో క్వాంటమ్ టెక్నాలజీ కీలకమని, ఈ రంగంలో యువత ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి చాట్ జీపీటీని రూపొందించే స్థాయికి ఎదగాలని ఐబీఎం క్వాంటమ్ ఇనిషియేటివ్స్ లీడ్ డాక్టర్ ఎల్.వెంకట సుబ్రహ్మణ్యం సూచించారు. ఈ కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ చైర్మన్ ఎం.రవికుమార్ విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకటేశ్వర్లు, వర్సిటీ చాన్సలర్ డాక్టర్ పావులూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సర్వం సిద్ధం

● నేటి నుంచి బైబిల్ మిషన్ మహోత్సవాలు

● ఆర్టీసీ, రైల్వే ప్రత్యేక రవాణా సదుపాయాలు ● సుదూర ప్రాంతాల నుంచి సభకు విశ్వాసులు



ప్రార్థన వేదిక ఎదుట ఏర్పాటుచేసిన కుర్చీలు

పెదకాకాని, గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఫాదర్ ఎం.దేవదాస్ బయలు పరిచిన బైబిల్ మిషన్ 88వ మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట సువిశాల పందిళ్లలో ఆది, సోమ, మంగళవారాల్లో మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్ శనివారం తెలిపారు. సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో.. ఎలాంటి భేదాభిప్రాయం లేకుండా భక్తులందరూ ఐక్యంగా ప్రార్థనలో ఏకీభవిస్తారని ఆకాంక్షించారు. విశ్వాసులకు ఉచిత బస, నివాస, తాగునీరు తదితర ఏర్పాట్లు భారీస్థాయిలో కల్పించినట్లు వెల్లడించారు.



కూరగాయలు తరుగుతున్న భక్తులు

అలాగే భక్తుల భద్రతను దృష్టిలో పెట్టుకుని పోలీసు, ప్రైవేటు భద్రత సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. పలు కమిటీలూ ఆయా పనులను పర్యవేక్షిస్తాయ న్నారు. ప్రధాన కూడలి, సభ వేదిక వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి.. పరిశీలనకు ప్రత్యేకం గా వలంటీర్లను ఏర్పాటు చేశామన్నారు. వైస్ ప్రెసిడెంట్ పి. జాన్‌దేవదాసు, సెక్రటరీ కె.ప్రశాంత్‌కుమార్, జాయింట్ సెక్రటరీలు రెవరెండ్ డి.సుధాకర్, జె. ఆగమనరావు, ఎం.రవి, గవర్నింగ్ బాడీ సభ్యులు సారథ్యంలో వివిధ కమిటీల కృషితో ఈ ఏడాది ఆధ్యాత్మిక క్రైస్తవ ఉత్సవాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు.

తరలి వచ్చిన భక్తులు..

ఆర్టీసీ, రైల్వే శాఖ ఏర్పాటుచేసిన ప్రత్యేక రవాణ సదుపాయంతో మహోత్సవాల ప్రాంగణానికి శనివారం రాత్రికి భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక ప్రార్థన సమావేశం జరిగింది. క్రైస్తవ సాంస్కృతిక కార్యక్రమాలు, కీర్తనలు, వాక్యోపదేశం కొనసాగాయి.

మహాసభలకు రెండు ప్రత్యేక రైళ్లు

బైబిల్ మిషన్ మహాసభలకు రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఎ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. 07625 కాకినాడ టౌన్ - గుంటూరు స్పెషల్ ఈ నెల 26న వేకువజామున 5.30 గంటలకు బయలుదేరి ఉదయం 11.45 గంటలకు గుంటూరు చేరుకొంటుందన్నారు. 07626 గుంటూరు - కాకినాడ టౌన్ ప్రత్యేక రైలు 27న మధ్యాహ్నం 1.50 గంటలకు బయలుదేరి రాత్రి 8.30 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుందని తెలిపారు. ఇవి జనరల్ సెకండ్ క్లాస్ బోగీలతో ప్రయాణిస్తాయని వెల్లడించారు.



కవ్వించే కుందనాలు

ఒకప్పుడు విశేషంగా ఆదరణ పొందిన కుందన్ జ్యువెలరీ సెట్లు మళ్లీ ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. యువత మెచ్చేలా వజ్రాలు, పచ్చలు, కెంపులు, పోల్కీలు పొదిగి సరికొత్తగా వీటిని ఆవిష్కరిస్తున్నారు డిజైనర్లు. రకరకాల డిజైన్లలో చిన్న, పెద్ద కుందనాలతో కూర్చిన చోకర్లు, విక్టోరియా హారాలు, స్టేట్‌మెంట్ ఉంగరాలు, జుంకాలను మహిళలు అధికంగా కొనుగోలు చేస్తున్నారు. నామ మాత్రపు బంగారంతో గ్రాండ్‌గా రూపొందించిన కుందన్ సెట్లు బడ్జెట్‌లోనే దొరుకుతుండడంతో అమ్మాయిలంతా వాటివైపే మొగ్గుచూపుతున్నారు.





కుందన్ డిజైనింగ్‌ను జాడౌ వర్క్ అంటారు. ఇది రాజస్థాన్‌లో ఆవిర్భవించిన ప్రాచీన సాంప్రదాయ కళారూపం. మొఘలుల కాలంలో దీనికి విశేష ప్రాచుర్యం లభించింది. ఇందులో ఘడాయి, ఖుధాయి, మీనాకారీ, జడాయి, ఫినిషింగ్ దశలు ఉంటాయి. బంగారాన్ని బాగా వేడిచేసి మెత్తబరిచి డిజైన్ కోసం బేస్ ఫ్రేమ్‌ను సిద్ధం చేయడం ఒక విధానమైతే బంగారు రేకు మీద నమూనాలను చెక్కడం మరో పద్ధతి. ఇలా విభిన్నమైన డిజైన్లలో రూపొందించిన భారీ కుందన్ సెట్లకు దేశ విదేశాల్లో అత్యధికంగా డిమాండ్ ఉంటోంది.

24 కేరట్ల స్వచ్ఛమైన బంగారంతో తయారు చేసిన పలుచని రేకుని 'కుందన్'గా పరిగణిస్తారు. దీని సహాయంతో రత్నాలు, అన్ కట్ డైమండ్స్, రకరకాల గాజు రాళ్లు, ఖరీదైన రంగురాళ్లను చక్కని డిజైన్లలో పొందికగా కూరుస్తారు. వీటి మధ్య వ్యాక్స్ లేదా యాంటిమొనీని నింపుతారు. ఇలా బంగారు రేకులు పట్టి ఉంచడం వల్ల రత్నాల మెరుపుదనం చెక్కుచెదరకుండా ఉంటుంది. అడుగు భాగంలో ఎరుపు, ఆకుపచ్చ, నీలం రంగుల్లో ఉండే మీనాకారీ ఎనామిల్‌ను అప్లయ్ చేస్తారు. దీనివల్ల కుందన్ ఆభరణాలు ఎక్కువకాలం మన్నికగా చెక్కు చెదరకుండా తరతరాలుగా నిలిచి ఉంటాయి.

వివాహాది శుభకార్యాలు, పండుగలు, పుట్టినరోజు లాంటి ప్రత్యేక సందర్భాల్లో కుందన్ జ్యువెలరీని ధరించడం హోదాకు, హుందాతనానికి ప్రతీకగా నిలుస్తోంది. అమ్మాయిలకు కుందన్ సెట్లను బహుమతిగా ఇవ్వడం అనాదిగా కొనసాగుతోంది కూడా! టాలీవుడ్, బాలీవుడ్ సెలబ్రిటీలు సైతం తరచూ కుందన్ సెట్లు ధరించి తళుక్కుమంటూ ఉంటారు. నెమళ్లు, హంసలు, పువ్వులు, కొమ్మలులాంటి ప్రకృతి పరమైన డిజైన్లతో తయారుచేసిన అందమైన కుందనాల ఆభరణాలు నేడు ఫ్యాషన్ ఐకాన్‌గా నిలుస్తున్నాయి. ఎంబ్రాయిడరీ, జర్దోసి వర్క్‌లతో నిండిన భారీ లెహంగాల మీద ఇవి చక్కగా నప్పుతాయి. పట్టు చీరలు, లంగా ఓణీ, అనార్కలీ డ్రెస్‌ల మీద సాంప్రదాయ పరమైన గ్రాండ్ లుక్‌నిస్తాయి. ఫ్రాక్, లాంగ్ స్కర్ట్, షార్ట్ స్కర్ట్ లాంటి ఇండో వెస్ట్రన్ డ్రెస్‌లపైన కూడా సొగసుగా సూటవుతాయి. ఒకే రకమైన కుందన్ డిజైన్‌తో రూపొందించిన చోకర్ లేదా హారం, జుంకాలు, పాపిడి బిళ్ల, గాజులు, ఉంగరాలను ధరించడం ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న ఫ్యాషన్.



కలల రాణి

**కవ్వించే నయనం...
గమ్మత్తయిన గాత్రం...
మైమరిపించే దరహాసం...
రాణి ముఖర్జీ ట్రేడ్‌మార్క్.
అత్యధిక పారితోషికం తీసుకున్న తారగా... టాప్‌లో ట్రెండైన బ్యూటీగా... అభిమానుల హృదయ స్పందనగా... ఒకప్పుడు బాలీవుడ్‌ను ఏలిన కలల 'రాణి'... పరిశ్రమలోకి అడుగుపెట్టి మూడు దశాబ్దాలు.
ఆమె సుదీర్ఘ ప్రయాణంలో... మరిచిపోలేని మజిలీలు, మాటలకందని భావాలు, భావోద్వేగాలు ఎన్నో.**

ఈ ఏడాది రాణి ముఖర్జీకి చాలా ప్రత్యేకం. ఆమె పరిశ్రమలోకి వచ్చి ముప్ఫై ఏళ్లు. 'రాజా కీ ఆయేగీ బారాత్'తో 1996లో బాలీవుడ్‌లోకి అడుగు పెట్టిన రాణి... ఆ తరువాత అద్భుతమైన చిత్రాలతో... ఎన్నో గుర్తుండిపోయే పాత్రలతో పరిశ్రమలో ధ్రువతారగా ఎదిగారు. విశేషం ఏమిటంటే... 47 ఏళ్ల ఆమె జీవితంలో మూడు దశాబ్దాలు సినీ ప్రయాణంలోనే గడిచిపోయాయి. ముంబయిలో పుట్టిన రాణి తల్లి కృష్ణ ముఖర్జీ గాయని. తండ్రి రామ్ ముఖర్జీ దర్శకుడు, 'ఫిల్మాలయా స్టూడియో' సహవ్యవస్థాపకుడు. అన్నయ్య రాజా ముఖర్జీ దర్శకనిర్మాత. ఒకప్పటి స్టార్



హీరోయిన్ కాజోల్, నటి దేబశ్రీ రాయ్, దర్శకుడు, రచయిత అయాన్ ముఖర్జీ రాణికి బంధువులు. పరిశ్రమతో అనుబంధంగలవారు కుటుంబంలో ఇంతమంది ఉన్నా... తను మాత్రం సినిమాల్లోకి రావాలని కోరుకోలేదు. ఎందుకని అడిగితే... 'ఇప్పటికీ చాలామంది నటులు మా ఇంట్లో ఉన్నారు. నేను వేరే ఏదైనా రంగంలోకి వెళతా' అనేవారు చిన్నప్పుడు.

ఒకే రోజు రెండు చిత్రాలు...

ముంబయిలోని 'మనేక్‌జీ కూపర్ హైస్కూల్'లో చదివిన రాణి... 'ఎస్ఎన్‌డీటీ మహిళ విశ్వవిద్యాలయం' నుంచి హోమ్‌సైన్స్‌లో డిగ్రీ పట్టా పొందారు. పదో తరగతి నుంచే ఒడిస్సీ నాట్యం అభ్యసించారు. తల్లి ప్రోద్బలంతో యాక్టింగ్ కోర్సులో చేరిన ఆమె... ఒకేసారి హిందీ, బెంగాలీ చిత్రాల్లో కథానాయికగా అవకాశాలు దక్కించుకున్నారు. ఈ రెండూ ఒకే రోజు విడుదల అయ్యాయి. పరిశ్రమలోకి వచ్చిన రెండేళ్లకు కానీ రాణికి హిట్ దక్కలేదు. ఆమిర్‌ఖాన్‌తో చేసిన 'గులామ్' ఆమెకు తొలి విజయం. అందులో చిన్న పాత్రే అయినా 'ఆతీ క్యా ఖండాలా' పాట రాణిని ప్రేక్షకులకు పరిచయం చేసింది. 1998లో విడుదలైన 'కుచ్ కుచ్ హోతా హై' ఆమె సినీ జీవితాన్ని పెద్ద మలుపు తిప్పింది. వాస్తవానికి ట్వింకిల్ ఖన్నాతో పాటు మరికొంత మంది నాటి టాప్ హీరోయిన్లు ఆ పాత్రకు నో చెప్పారు. హీరో షారూక్‌తో పాటు దర్శకుడు కరణ్ జోహార్, నిర్మాత ఆదిత్య చోప్రా అడగడంతో చివరకు రాణి ఓకే అన్నారు. ఆ చిత్రం భారీ హిట్ అవ్వడమే కాదు, ఆమెకు మంచి నటిగా గుర్తింపు తెచ్చింది.

'చాలా బాధపడ్డా'...

ప్రస్తుతం 'మర్దానీ 3' షూటింగ్‌లో బిజీగా ఉన్న రాణి ఇటీవల కరణ్ జోహార్ షోలో తన అనుభవాలను పంచుకున్నారు. 'బ్లాక్'లో నటనకు జాతీయ అవార్డు దక్కకపోవడం తనను కుంగదీసిందన్నారు. "ముఖ్యంగా ఆ సినిమాలో నటించిన అమితాబ్‌బచ్చన్‌కు, దర్శకుడు సంజయ్ లీలా బన్సాలీకి అవార్డులు వచ్చాయి. నాకు రాకపోవడం నన్ను తీవ్రంగా బాధించింది. నన్ను ఉత్తమ నటిగా చూడాలన్న మా అమ్మానాన్నల హృదయాలు గాయపడ్డాయి. వాళ్ల ప్రోత్సాహం, కోరికతోనే నేను నటిని అయ్యాను. వాళ్ల కలను నిజం చేసి, వారికి ఉన్నతమైన జీవితాన్ని ఇచ్చి, సంతోషంగా ఉంచాలనుకున్నాను. అందుకే సినిమాలు చేస్తూవచ్చాను" అంటూ చెప్పుకొచ్చారు. "మిసెస్ చటర్జీ వర్సెస్ నార్వే' నా కలను నిజం చేసింది. మూడు దశాబ్దాల నా సినీ ప్రస్థానంలో ఉత్తమ నటిగా తొలి జాతీయ అవార్డు అందుకున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ అవార్డు నాకు ప్రపంచాన్ని జయించిన అనుభూతినిచ్చింది. దీన్ని మా దివంగతులైన మా నాన్నకు అంకితమిస్తున్నాను. ఆయన స్ఫూర్తి, ఆశీస్సులతోనే ఇది సాధ్యమైంది" అని నాడు అవార్డు అందుకున్న సందర్భంగా రాణి వ్యాఖ్యానించారు.

రొటీన్‌కు దూరంగా...

'కుచ్ కుచ్ హోతా హై' తరువాత వరుస అపజయాలు చవిచూసిన రాణి ముఖర్జీ... ఇకపై సగటు హిందీ కథానాయికలా రొటీన్ పాత్రలు చేయకూడదని నిర్ణయించుకున్నారు. సవాళ్లు విసిరే, నటనకు అవకాశం ఉండే రోల్స్‌ను ఎంచుకున్నారు. అలా వచ్చినవే 'బాదల్, బిచూ, హేరామ్, కభీ ఖుషీ కభీ గమ్' తదితర చిత్రాలు. జయాపజయాలతో సంబంధం లేకుండా సాగిన రాణి కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు. విజయానికి పొంగిపోలేదు. అపజయానికి కుంగిపోలేదు. వచ్చినవాటిలో నచ్చినవి చేసుకొంటూ ఇన్నేళ్లుగా పరిశ్రమలో ప్రయాణిస్తున్న ఆమె ఎనిమిది ఫిలిమ్‌ఫేర్ అవార్డులు గెలుచుకున్నారు. 2023లో విడుదలైన 'మిసెస్ చటర్జీ వర్సెస్ నార్వే'కు 'ఉత్తమ నటి'గా జాతీయ పురస్కారం అందుకున్నారు. 'యష్ రాజ్ ఫిల్మ్స్' ఛైర్మన్, దర్శకనిర్మాత ఆదిత్య చోప్రాతో కొంతకాలం ప్రేమాయణం నడిపిన రాణి... 2014లో ఆయన్ను పెళ్లి చేసుకున్నారు. మరుసటి ఏడాది కుమార్తె అదిరాకు జన్మనిచ్చారు. 'నా జీవితంలోనే అత్యంత సంతోషకర సమయం మాతృత్వం' అంటూ నాడు చెప్పారు.

ఆమిర్ నో... కరణ్ యస్...

కరణ్ జోహార్ షోలో రాణి... నాడు ఆమిర్‌ఖాన్ నిర్ణయంవల్ల తన మనసు ఎంత గాయపడిందో చెప్పుకొచ్చారు. "గులామ్' షూటింగ్ సమయంలో నా గొంతు ఆ సినిమాకు సరిపోదని, వేరేవారు డబ్బింగ్ చెబుతారని ఆమిర్‌ఖాన్ అన్నారు. ఆ నిర్ణయం నన్ను తీవ్రంగా బాధపెట్టింది. కానీ సెట్‌లో అది కనిపించనీయలేదు. ఎందుకంటే... సినిమాలో భాగమైనప్పుడు ఒక జట్టు సభ్యురాలిగా వ్యవహరించాలి. వ్యక్తిగత నిరాశలు ఉన్నప్పటికీ జట్టు ప్రయోజనాల కోసం వాటిని పక్కనపెట్టి పని చేయాలి" అంటూ రాణి భావోద్వేగానికి లోనయ్యారు. అయితే 'కుచ్ కుచ్ హోతా హై'లో కరణ్ ఆమెతోనే డబ్బింగ్ చెప్పించారు. 'నీ గొంతు నాకు చాలా ఇష్టం' అంటూ నాడు కరణ్ అన్న మాటలను రాణి గుర్తు చేసుకున్నారు. తరువాత ఆ గొంతే ఎన్నో గమ్మత్తులు చేసింది. కోట్లమంది అభిమానులను మైమరిపించింది.



భగవంతుడి ప్రసాదం

'బలగం', 'డీజే టిల్లూ'.. ఈ చిత్రాలు తెలంగాణ పల్లె ప్రాంతం నుంచి వచ్చిన మురళీధర్ గౌడ్ అనే వ్యక్తి జీవితాన్ని మార్చేసి నటుడిగా బిజీ చేశాయి. తెరపై ఆయన్ని చూస్తుంటే మన ఇంట్లో వ్యక్తో, పక్కింటి బాబాయో గుర్తుకు వస్తారు. తనదైన అభినయంతో అలరిస్తున్న మురళీధర్‌ను 'నవ్య' పలుకరించింది.

రిటైర్ అవ్వగానే జీవితం అయిపోయిందని చాలామంది భావిస్తుంటారు. కానీ మీకు కొత్త జీవితం మొదలైంది!

భగవంతుడు నాకు రిటైర్‌మెంట్ ఇవ్వలేదు. సర్వీస్ నుంచి రిటైర్ అయిన తర్వాత నువ్వు చేయాల్సింది ఇదీ అంటూ ఇంకో బాధ్యత అప్పగించాడు. ఎలక్ట్రిసిటీ బోర్డ్ నుంచి రిటైర్ అయిన నేను ఇప్పుడు నటన అనే కొత్త జాబ్‌లో ఉన్నా. చాలా బాగుంది. ఇది నేను ఊహించిన జీవితమే. సినిమా ఆర్టిస్ట్ నవుతాననీ, మంచి క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా పేరు తెచ్చుకుంటానని చిన్నతనం నుంచీ నమ్మాను. అది నిజమైనందుకు హ్యాపీగా ఉంది.

మీరు ఉద్యోగంలో ఉండగా ఈ ప్రయత్నాలు చేయకపోవడానికి కారణం?

వృత్తిలో ఉంటూ సినిమాల మీద దృష్టి పెడితే, రెంటికీ చెడి దెబ్బ తింటాననే భయం ఉండేది. దానికి కారణం నా ఆర్థిక పరిస్థితులే. చిత్ర పరిశ్రమలో అవకాశాలు దొరుకుతాయనే గ్యారంటీ లేదు. ఒకవేళ వచ్చినా వాటి మీద ఆధారపడి బతకగలనా అని భయం వేసింది. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన వాడిని కదా.. చిన్నదో పెద్దదో జీతం ఉంది.. ఓ జీవితం ఉంది. అందుకే ధైర్యం చేయలేకపోయా.

నటించాలనే కోరిక ఎప్పుడు కలిగింది?

నిజం చెబితే నమ్మరు కానీ నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ ఉంది. అప్పట్లో మాస్టర్ రాము, ప్రభాకర్, బేబి రాణి.. ఇలా బాల నటులు ఉండేవారు కదా. వాళ్లు పోషించే పాత్రల్లో నన్ను ఊహించుకునేవాణ్ణి. అయితే నటనలో ఎక్కడా శిక్షణ తీసుకోలేదు. నాకు గురువులంటూ కూడా ఎవరూ లేరు. నటన నాలో ఉంది. ఊహ తెలిసినప్పటి నుంచి నేను నటుడిని అనే భావం ఉంది. దానిని సాకారం చేసుకోలేకపోవడానికి నా ఆర్థిక పరిస్థితులే కారణం. చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టాలనే కోరిక బలంగా ఉన్నప్పటికీ వెళ్లలేకపోయాను.

> "టీవీ సీరియల్స్‌లో నటిస్తేనే చాలు అనుకున్నవాడిని. సినిమాల్లో నటించడం సాధ్యం కాదేమో అనుకున్నాను. అవకాశాలు వచ్చాయి. నన్ను నటుడిగా బిజీ చేశాయి. చాలు ఇంత కంటే ఇంకేం కావాలి! నేను ఈ స్థాయికి చేరుకోవడానికి కారకులైన తరుణ్‌భాస్కర్, 'బలగం' వేణు, అనిల్ రావిపూడిలకు జీవితాంతం రుణపడి ఉంటాను. అలాగే నా చిన్ననాటి స్నేహితులకన్నా, బంధువుల కన్నా నన్ను ఈ పొజిషన్‌లో చూసి నూటికి వెయ్యి శాతం సంతోషపడుతున్న వారు నా ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ వాళ్లు. మనసునిండా వాళ్లు నన్ను ఆశీర్వదిస్తున్నారు.అభినందిస్తున్నారు, ఆనందిస్తున్నారు."

సినిమావాళ్ల దృష్టిలో ఎలా పడ్డారు?

దర్శకుడు తరుణ్‌భాస్కర్ నన్ను ఎక్కడ చూశారో, నా నటనని ఎప్పుడు గమనించారో తెలీదు కానీ 'పిట్టకథలు' అనే వెబ్ సీరిస్‌లో అవకాశం ఇచ్చారు. రామచంద్ర అనే మాజీ ఎమ్మెల్యే పాత్ర నాది. వెబ్ సిరీస్ అప్పటికి అంత పాపులర్ కాలేదు కానీ సినిమావాళ్లు చాలా మంది దాన్ని చూశారు. జనం కూడా ఆ పాత్రతో నన్ను బాగా గుర్తుపట్టారు. ఆ తర్వాత తరుణ్‌భాస్కర్ పేటీయం యాడ్ చేస్తూ అందులో కూడా అవకాశం ఇచ్చారు.

అవకాశాల కోసం తిరిగిన సందర్భాలు ఉన్నాయా?

చాలా తిరిగాను. 2012లో సర్వీసు నుంచి రిటైర్ అయ్యాను. అప్పటినుంచి నటన మీదే దృష్టి పెట్టాలని ఆఫీసుల చుట్టూ తిరిగాను. పెద్ద హీరోల చిత్రాల్లో నటించాలనీ, కనీసం కనిపించాలని 2017 నుంచి ఓ రెండేళ్ల పాటు తిరిగాను. ఒక్క ఛాన్స్ కూడా రాలేదు. ఇక అవకాశాలు రావు, ఎవరూ ఇవ్వరని నాకు నేనే నిర్ణయించుకుని టీవీ సీరియల్స్ మీద దృష్టి పెట్టాను. భగవంతుడి దయవల్ల నెలలో వారం రోజుల పని ఉండేది. అదే చాలు అని సరిపెట్టుకున్నా. అటువంటి సమయంలో తరుణ్‌భాస్కర్ నాకు 'పిట్టకథలు'లో అవకాశం ఇచ్చారు. ఆయన వల్లే నాకు 'డీజే టిల్లు' చిత్రంలో హీరో సిద్ధు జొన్నలగడ్డకు తండ్రిగా నటించే అవకాశం వచ్చింది. ఆ సినిమాలో చేస్తుండగానే 'బలగం'లో నారాయణ పాత్ర లభించింది. ఈ రెండు చిత్రాలూ నా కెరీర్‌ను ఒక మలుపు తిప్పాయి. 'డీజె టిల్లు' చిత్రం ఒక తరం ప్రేక్షకులను అలరించగా, 'బలగం' చిత్రం తరాల అంతరం లేకుండా అందరినీ ఆకట్టుకుంది.

ఇప్పటివరకూ ఎన్ని సినిమాల్లో నటించారు?

దాదాపు ఎనభై చిత్రాలు చేశానండీ.

'భగవంత్ కేసరి' చిత్రంలో అవకాశం ఎలా వచ్చింది?

అదంతా దర్శకుడు అనిల్ రావిపూడి కల్పించిన అదృష్టం. అంతవరకూ నేను చేసిన పాత్రలకు పూర్తి భిన్నమైన పాత్ర. అందులో నాకు అవకాశం వస్తుందని నేను ఊహించలేదు. బాలకృష్ణ వంటి టాప్ హీరో సినిమాలో నటించే తొలి అవకాశం. సరిగ్గా ఆ షూటింగ్ కమిట్ అయిన రోజునే మా తమ్ముడి కొడుకు పెళ్లి. అయినా మా తమ్ముడికి నచ్చజెప్పి షూటింగ్‌కు హాజరయ్యా. నాకు మంచి గుర్తింపు తెచ్చిన సినిమా అది. ఆ తర్వాత నేను నటించిన మరో పెద్ద హీరో సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం'. ఈ సారి వెంకటేశ్‌తో కలసి నటించే అవకాశం కల్పించారు అనిల్ రావిపూడి. ఆయన సహృదయత వల్లే ఈ రెండు పెద్ద సినిమాల్లో నటించగలిగాను.

పరిశ్రమలో మీకు స్నేహితులు ఎవరు?

నేను మితభాషిని. నా కుటుంబ నేపథ్యం కావచ్చు. చేసిన ఉద్యోగం వల్ల కావచ్చు... చాలా రిజర్వ్‌గా ఉంటాను. దూసుకుపోయే మనస్తత్వం కాదు నాది. ఇల్లు, షూటింగ్ లొకేషన్, డబ్బింగ్ స్టూడియో తప్ప మరో ప్రపంచం నాకు లేదు.సక్సెస్‌మీట్లు, ప్రీవ్యూ షోలు.. వంటి వాటికి కూడా ఎక్కువ అటెండ్ కాను. మీరు తప్పకుండా రావాలి అంటేనే వెళతాను.

కొత్తతరహా పాత్రలు చేయాలనే కోరిక ఉందా?

ఇప్పుడు వస్తున్న పాత్రలను భగవత్ ప్రసాదంలా భావించి చేస్తున్నాను. కానీ ఆర్టిస్టుగా చిరస్థాయిగా నిలిచిపోయే కొన్ని పాత్రలు పోషించాలని ఉంది. అటువంటి పాత్ర దొరికితే నన్ను నేను ప్రూవ్ చేసుకుంటాననే నమ్మకమూ ఉంది. ఎందుకంటే నేను ఒక మట్టి ముద్దను. దర్శకుడు ఎలా మలిస్తే అలా తయారవుతా. సమాజానికి ఉపయోగపడే పాత్రలు కూడా చేయాలని ఉంది. విడుదల కాబోయే నా చిత్రాల్లో 'వెంకట్రామయ్యగారి తాలుకా' లో చాలా మంచి పాత్ర పోషించా. అందులో టైటిల్ రోల్ నాదే. మధ్యతరగతి రైతు పాత్ర అది. నా మనసుకి బాగా నచ్చిన క్యారెక్టర్ అది.

- వినాయకరావు, ఫొటో: హరి ప్రేమ్




ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
బ్రిడ్జర్టన్ 4	వెబ్‌సిరీస్	జనవరి 29
ధురంధర్	హిందీ చిత్రం	జనవరి 30
అమెజాన్ ప్రైమ్		
ది రెక్కింగ్ క్రూ	ఒరిజినల్ మూవీ	జనవరి 28
దల్‌దల్	హిందీ సిరీస్	జనవరి 30
జియో హాట్‌స్టార్		
వండర్‌మాన్	వెబ్‌సిరీస్	జనవరి 28
సర్వం మాయ	మలయాళ చిత్రం	జనవరి 30
ఈటీవి విన్		
గొల్ల రామవ్వ	తెలుగు చిత్రం	జనవరి 25





'సిన్నర్స్' రికార్డుల హోరు

ఆస్కార్ వేదికపై ఇప్పుడు మార్మోగుతున్న పేరు... 'సిన్నర్స్'. హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు రియాన్ కూగ్లర్, నటుడు మైఖేల్ బి.జోర్డాన్ కలయికలో వచ్చిన ఈ చిత్రం ఏకంగా 16 విభాగాల్లో పోటీపడుతోంది. ఒకే సినిమాకు ఇన్ని నామినేషన్లు రావడం ఆస్కార్ 98 ఏళ్ల చరిత్రలో ఇదే తొలిసారి.

గతంలో 14 నామినేషన్లు సాధించిన చిత్రాలు మూడున్నాయి. ఆల్ అబౌట్ ఈవ్ (1950), టైటానిక్ (1997), లాలా ల్యాండ్ (2016). వాటన్నింటినీ వెనక్కినెట్టి 16 నామినేషన్లతో సిన్నర్స్ అగ్రస్థానానికి చేరింది.

సినిమా కథేంటంటే?

1930 కాలంనాటి అమెరికా నేపథ్యంలో సాగే ఈ చిత్రం ఒక 'గోతిక్ హారర్ థ్రిల్లర్'. జిమ్ క్రో కాలంలో కవల సోదరులు (మైఖేల్ బి.జోర్డాన్ ద్విపాత్రాభినయం) తమ గతంలోని చేదు జ్ఞాపకాల నుంచి తప్పించుకోవడానికి తిరిగి సొంత ఊరికి వస్తారు. అక్కడ వారు ఊహించని ఒక భయంకరమైన దుష్టశక్తిని ఎదుర్కోవాల్సి వస్తుంది. మనుషుల మధ్య ఉండే విద్వేషం కంటే భయంకరమైన శక్తులు ఉంటాయా? అనే కోణంలో ఈ సినిమా ఉత్కంఠభరితంగా సాగుతుంది. సాంకేతిక హంగులతోపాటు బలమైన భావోద్వేగాలు ఉన్న కథ కావడంవల్లే ఈ చిత్రానికి ఇన్ని నామినేషన్లు దక్కాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

కలెక్షన్ల సునామీ

'సిన్నర్స్'ను దాదాపు రూ.830 కోట్లతో నిర్మించారు. ఒక హారర్ చిత్రానికి ఇది భారీ బడ్జెట్. సినిమా విడుదలయ్యాక బాక్సాఫీసు వద్ద ఇది ప్రభంజనం సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా రూ. 3 వేల కోట్లకుపైగా వసూళ్లు సాధించింది. తొలి వారాంతం అమెరికాలో దాదాపు 48 మిలియన్ డాలర్లతో గ్రాండ్ ఓపెనింగ్ సాధించింది. 2022లో వచ్చిన 'నోప్' తర్వాత ఒక ఒరిజినల్ కథతో వచ్చిన సినిమాకు దక్కిన అత్యుత్తమ ఓపెనింగ్ ఇదే.



నామినేషన్లు ఇలా...

ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు (రియాన్ కూగ్లర్), ఉత్తమ నటుడు (మైఖేల్ బి.జోర్డాన్), ఉత్తమ సహాయనటుడు (డెల్రాయ్ లిండో), ఉత్తమ సహాయనటి (ఉన్మి మోసాకు), ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే (రియాన్ కూగ్లర్), ఉత్తమ సినిమాటోగ్రఫీ (ఆటం డ్యూరాల్డ్ అర్కాపావ్), ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ (హన్నా బీచ్లర్), ఉత్తమ కాస్ట్యూమ్ డిజన్ (రూత్ ఇ.కార్టర్), ఉత్తమ ఫిలిం ఎడిటింగ్ (మైఖేల్ పి.షావర్), ఉత్తమ ఒరిజినల్ స్కోర్ (లుడ్విగ్ గోరాన్సన్), ఉత్తమ ఒరిజినల్ సాంగ్ (ఐ లైడ్ టు యు), ఉత్తమ మేకప్, హెయిర్ స్టైలింగ్, ఉత్తమ సౌండ్, ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్, ఉత్తమ క్యాస్టింగ్ (ఈ ఏడాదే ప్రవేశపెట్టారు)

బలమైన ఎముకల కోసం...

ఎముకల బలోపేతానికి ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలుసుకుందాం...



- రోజూ పాలు, పెరుగు, మజ్జిగ, చీజ్ తీసుకోవడం వల్ల ఎముకలకు కావాల్సిన కాల్షియం అందుతుంది. దీంతో శరీరానికి డి విటమిన్‌ను శోషించుకునే శక్తి పెరిగి ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి.
- తరచూ పాలకూర, గోంగూర, మెంతికూరలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల ఎముకల సమస్యలు దరిచేరవు.
- పెరిగే పిల్లలకు వేరుశనగ గుండ్లు, నువ్వులను ఆహారంలో చేర్చడం వల్ల వాటిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు, కాల్షియం, మెగ్నీషియం, పాస్ఫరస్, ఇతర పోషకాలు అంది ఎముకలు దృఢంగా మారతాయి.
- కోడిగుడ్లు, పెసలు, శనగలు, మినప్పప్పు, చిక్కుళ్లు, సోయా చంక్స్‌లో ప్రొటీన్లు, కాల్షియం సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యానికి దోహదం చేస్తాయి.
- సాల్మోన్, ట్యూనా చేపలను తినడం వల్ల వాటిలోని డి విటమిన్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఎముకలను బలోపేతం చేస్తాయి.
- బాదం, ఖర్జూరాలు, ఎండు ద్రాక్ష, డ్రై అంజూర్‌లను తినడం వల్ల ఎముకల సాంద్రత పెరుగుతుంది.



సిరీస్ పట్టాలని..

- జోష్‌లో టీమిండియా
- ఒత్తిడిలో న్యూజిలాండ్

మూడో టీ20 నేడు

గువాహటి: న్యూజిలాండ్‌తో భారత్ ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా ఇరుజట్ల మధ్య మూడో మ్యాచ్ ఆదివారం జరగనుంది. ఇప్పటికే 2-0తో స్పష్టమైన ఆధిక్యంలో ఉన్న భారత్.. గువాహటిలోనూ తమ ఫామ్‌ను కొనసాగించి సిరీస్ పట్టేయాలనుకుంటోంది.

సంజూ రాణించాలి: రెండో టీ20లో ఇషాన్ కిషన్‌తో పాటు కెప్టెన్ సూర్య అదరగొట్టడంతో జట్టు బ్యాటింగ్ దుర్భేద్యంగా మారింది. అయితే ఓపెనర్ సంజూ శాంసన్ మాత్రం సిరీస్‌లో 16 పరుగులే చేసి విఫలమయ్యాడు. దీంతో అతడి స్థానానికి ఎసరు వచ్చే చాన్సుంది. ఒకవేళ తిలక్ వర్మ కోలుకుని ప్రపంచకప్‌లో ఆడితే సంజూ తన బెర్త్‌ను ఇషాన్‌కు కోల్పోవాల్సి ఉంటుంది. అదే జరిగితే అభిషేక్, ఇషాన్‌ల విధ్వంసకర ఓపెనింగ్‌తో జట్టుకు భారీస్కోర్లు ఖాయమవుతుంటాయి. అందుకే తుది జట్టులో చోటు ఉండాలంటే కివీస్‌తో టీ20 సిరీస్‌లో మిగిలిన మ్యాచ్‌లు శాంసన్‌కు ఆఖరి చాన్స్ లాంటివి. బౌలింగ్‌లో స్పిన్నర్ కుల్దీప్, పేసర్ హర్షిత్ మధ్య ఓవర్లను కట్టడి చేస్తున్నారు. అయితే బుమ్రా ఈ మ్యాచ్ ఆడనుండడంతో హర్షిత్ బెంచీకే పరిమితమవొచ్చు. మరోవైపు ఈ టూర్‌లో భారత్‌పై వన్డే సిరీస్ నెగ్గిన న్యూజిలాండ్.. పొట్టి ఫార్మాట్‌లో ఆ జోరు చూపలేకపోతోంది. టీ20 సిరీస్‌లో నిలవాలంటే ఈ మూడో మ్యాచ్‌లో కివీస్ శక్తిమేరా రాణించాల్సిందే. రెండో టీ20లో ఆరంభం బాగున్నా చివరి వరకు ఆ జోరు కొనసాగించలేకపోయింది. ఇక బౌలర్లు ఇషాన్, సూర్యల విజృంభణతో తేలిపోయారు.

సూపర్ సిక్స్‌కు యువ భారత్

బులవాయో: అండర్-19 వన్డే వరల్డ్ కప్‌లో భారత జట్టు హ్యాట్రిక్ విజయం అందుకుంది. శనివారం జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో 7 వికెట్లతో (డక్‌వర్త్ లూయిస్ పద్ధతి) న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. వర్షం వల్ల మ్యాచ్‌ను 37 ఓవర్లకు కుదించారు. మొదట న్యూజిలాండ్ 36.2 ఓవర్లలో 135 రన్స్‌కు ఆలౌటైంది. ఆ పై డక్‌వర్త్ నిబంధన ప్రకారం భారత్ లక్ష్యాన్ని 130 రన్స్‌కు కుదించారు. దానిని యువ భారత్ 13.3 ఓవర్లలో 130/3 స్కోరుతో ఛేదించింది. గ్రూపులో ఆడిన మూడు మ్యాచ్‌లూ నెగ్గిన భారత్ (6 పాయింట్లు) టాపర్‌గా సూపర్ సిక్స్ దశకు చేరింది.

అవును.. బంగ్లా అవుట్

- టీ20 వరల్డ్ కప్‌లో స్కాట్లాండ్‌కు చాన్స్
- అధికారికంగా ప్రకటించిన ఐసీసీ





న్యూఢిల్లీ: భారత్ నుంచి తమ టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌లు శ్రీలంకకు తరలించాలన్న మంకుపట్టు వీడని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) గట్టి షాకిచ్చింది. ఆ జట్టును మెగా టోర్నమెంట్ నుంచి తప్పిస్తున్నట్టు శనివారం అధికారికంగా ప్రకటించింది. బంగ్లాదేశ్ స్థానంలో..ర్యాంకింగ్స్ ప్రకారం స్కాట్లాండ్‌ను బరిలో దించుతున్నట్టు వెల్లడించింది. 'ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్ పోటీపడడం లేదు. బీసీబీ లేవనెత్తిన అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. బంగ్లా జట్టుకు, ఆ దేశ అధికారులతోపాటు పౌరులకు భారత్‌లో ఎలాంటి ముప్పు లేదని ఐసీసీ అంచనాకు వచ్చింది. ఇంకా ఇతర అంశాలను కూడా జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత ఇప్పటికే నిర్ణయించిన టోర్నీ షెడ్యూల్‌ను సవరించడం సరికాదని భావించింది' అని వివరించింది. భారత్‌లో పాల్గొంటుందో లేదో తెలియజేసేందుకు బంగ్లాదేశ్‌కు 24 గంటల సమయం ఇచ్చినట్టు ఈ సందర్భంగా ఐసీసీ గుర్తు చేసింది. 'గడువులోగా ఏ విషయామూ బంగ్లాదేశ్ నిర్ధారించకపోవడంతో నిబంధనల ప్రకారం మరో జట్టుకు చోటు కల్పించాం. ర్యాంకులలో స్కాట్లాండ్ 14వ స్థానంలో ఉంది. బంగ్లా స్థానంలో గ్రూప్ 'సి'లో ఇంగ్లండ్, ఇటలీ, నేపాల్‌తో కలిసి స్కాట్లాండ్ ఆడుతుంది' అని ఐసీసీ స్పష్టం చేసింది. భారత్-శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ప్రపంచ కప్ వచ్చే నెల 7 నుంచి మార్చి 8 వరకు జరగనుంది.

నెల రోజులుగా..

ఐసీసీ నిర్ణయంతో వరల్డ్ కప్‌లో బంగ్లాదేశ్ కొనసాగే విషయమై నెల రోజులుగా ఏర్పడిన ప్రతిష్ఠంభనకు తెరపడింది. బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను ఐపీఎల్ జట్టు కోల్‌కతా నైట్ రైడర్స్ నుంచి తొలగించడంతో మొదలైన వివాదాన్ని బీసీబీ ప్రపంచ కప్‌నకు ముడిపెట్టింది. భద్రతా కారణాలసాకు చూపుతూ భారత్‌లో తాము ఆడాల్సిన మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని పదేపదే కోరుతూ వచ్చింది. అలా కాదంటే..గ్రూప్ 'సి'లో తమకు బదులు ఐర్లాండ్‌ను చేర్చాలని, గ్రూప్ 'బి'లో తమను ఆడించాలని ఐసీసీకి ప్రతిపాదించింది. గ్రూప్ 'బి' మ్యాచ్‌లన్నీ శ్రీలంకలో జరుగుతాయి. అయితే ఈ ప్రతిపాదనను ఐసీసీతోపాటు ఐర్లాండ్ క్రికెట్ బోర్డు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చాయి. మెగా టోర్నీలో భాగంగా వెస్టిండీస్ (ఫిబ్రవరి 7), ఇటలీ (ఫిబ్రవరి 9), ఇంగ్లండ్ (ఫిబ్రవరి 14)లతో కోల్‌కతాలో బంగ్లాదేశ్ తలపడాలి. అనంతరం ముంబై (ఫిబ్రవరి 17)లో నేపాల్‌ను బంగ్లా ఢీకొనాలి. ఇప్పుడు ఈ మ్యాచ్‌లలో బంగ్లాకు బదులు స్కాట్లాండ్ ఆడుతుంది.

ముప్పులేదని చెప్పినా..

అంతర్జాతీయ భద్రతా నిపుణులతో సర్వే చేయించామని, బంగ్లాదేశ్ జట్టు భద్రతకు భారత్‌లో ఎలాంటి ముప్పు లేదని ఐసీసీ చెప్పింది. కానీ బీసీబీ భారత్‌కు వెళ్లే ప్రసక్తే లేదని భీష్మించింది. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ క్రీడా సలహాదారు అసిఫ్ నజ్రుల్ అయితే తమ జట్టు భారత్ వెళ్లే విషయంలో మొండిగా వ్యవహరించారు. ఫలితంగా మెగా టోర్నీలో ఆడాలన్న బంగ్లా క్రికెటర్ల కలలు కల్లలయ్యాయి.

ఆర్థిక నష్టం అంతింత కాదయా..

ప్రపంచ కప్‌లో ఆడకపోవడం బంగ్లాదేశ్‌కు భారీ నష్టాన్ని మిగల్చనుంది. ఇది వందల కోట్ల రూపాయలలో ఉండనుంది. టోర్నీలో పాల్గొనడం ద్వారా లభించే ఫీజు రూ. 4.57 కోట్లు (బంగ్లా కరెన్సీలో 6.06 కోట్ల టాకాలు)ను బీసీబీ కోల్పోనుంది. ఇక..టోర్నీ టాప్-12లో నిలిస్తే మరో 5.5 కోట్ల బంగ్లాదేశ్ టాకాలు లభిస్తాయి. ఇక.. బంగ్లాకు అతి పెద్ద నష్టం ఐసీసీ వార్షికంగా చెల్లించే మొత్తం రూపేణా జరగనుంది. తమ వాటా కింద బంగ్లా బోర్డు ప్రతి ఏటా రూ. 247.30 కోట్లు (బంగ్లా కరెన్సీలో 327.73 కోట్ల టాకాలు)ను ఐసీసీ నుంచి అందుకుంటుంది. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు బడ్జెట్‌లో ఇది 60 శాతం కావడం గమనార్హం. ఇప్పుడు ఐసీసీ ఈవెంట్ నుంచి ఆ జట్టు తప్పుకోవడంతో నిబంధనల ప్రకారం ఈ మొత్తాన్ని బంగ్లా కోల్పోనుంది. ఇంకా..టోర్నీలో పాల్గొనకపోవడం వల్ల పెద్ద మొత్తంలోనే స్పాన్సర్‌షిప్ ఆదాయానికి కూడా గండి పడనుంది. ఇవన్నీగాక..ద్వైపాక్షిక సిరీస్‌లకోసం భారత జట్టు బంగ్లాదేశ్ వెళ్లకపోవడంవల్ల బీసీబీకి కలిగే నష్టం అంతా ఇంతా కాదు. పది జట్లతో ఆడే ద్వైపాక్షిక సిరీస్‌ల ద్వారా లభించే ఆదాయం..ఒక్క భారత్‌తో తలపడే సిరీస్ ద్వారా వస్తుండడం విశేషం. ఇది బీసీబీకి కోలుకోని ఆర్థిక నష్టం. చివరగా..బంగ్లాదేశ్‌కు మిగిలిన ఏకైక మార్గం స్విట్జర్లాండ్‌లోని క్రీడా వివాదాల పరిష్కార కోర్టుకు వెళ్లడమే. కానీ అప్పటికే టోర్నమెంట్ మొదలై ఉంటుంది కాబట్టి.. బంగ్లా సమస్యకు పరిష్కారం లభించడం కష్టం.

బోర్డులో చర్చించి..

గత బుధవారం ఐసీసీ ప్రత్యేక సమావేశం నిర్వహించి బీసీబీ డిమాండ్‌పై చర్చించింది. బంగ్లా డిమాండ్‌ను ఐసీసీ బోర్డు సభ్యులు 14-2 ఓటింగ్‌తో తిరస్కరించారు. అంతేకాదు తమ డిమాండ్‌ను పునఃపరిశీలించుకొనేందుకు బీసీబీకి ఐసీసీ కొంత సమయం కూడా ఇచ్చింది. అయినా తమ డిమాండ్‌కే బీసీబీ కట్టుబడి ఉండడంతో..ఐసీసీ కఠినమైన నిర్ణయం తీసుకోక తప్పలేదు. అంతకుముందు తమ డిమాండ్‌ను పరిశీలించాలని ఐసీసీ వివాద పరిష్కార కమిటీ (డీఆర్‌సీ)ని కూడా బీసీబీ ఆశ్రయించింది. ఆ అంశం తమ పరిధిలోకి రాదని పేర్కొంటూ బీసీబీ విన్నపాన్ని డీఆర్‌సీ తోసిపుచ్చింది.

జొకో @ 400

- నొవాక్ 'గ్రాండ్‌స్లామ్' రికార్డు
- ప్రీక్వార్టర్స్‌కు సినర్, స్వియటెక్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ విజయాల్లో ఇప్పటికే సెంచరీ దాటేసిన నొవాక్ జొకోవిచ్ మరో రికార్డును ఖాతాలో వేసుకున్నాడు. తాజాగా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ప్రీక్వార్టర్స్ చేరడం ద్వారా గ్రాండ్‌స్లామ్స్ పరంగా మరో మైలురాయిని అందుకున్నాడు. శనివారం జరిగిన సింగిల్స్ మూడో రౌండ్లో 4వ సీడ్ జొకోవిచ్ 6-3, 6-4, 7-6(4)తో బొటిక్ వాన్ డె జాండ్‌షల్ప్ (నెదర్లాండ్స్)ను ఓడించాడు. 38 ఏళ్ల జొకోవిచ్‌కు ఇది గ్రాండ్‌స్లామ్స్‌లో 400వ గెలుపు. దీంతో గ్రాండ్‌స్లామ్స్‌లో అత్యధిక విజయాలు సాధించిన తొలి ఆటగాడిగా నొవాక్ చరిత్ర సృష్టించాడు. అంతేకాదు.. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో తన గెలుపోటముల రికార్డును 102-10కు పెంచుకొని రోజర్ ఫెడరర్‌తో సమంగా నిలిచాడు. డిఫెండింగ్ చాంపియన్ జానిక్ సినర్ 4-6, 6-3, 6-4, 6-4తో ఎలియట్ స్పిజిరిపై, ముసెట్టి 5-7, 6-4, 6-2, 5-7, 6-2తో టొమాస్‌పై నెగ్గి ప్రీక్వార్టర్స్ చేరారు. 9వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 7-6 (5), 2-6, 6-4, 6-4తో స్టాని స్లాస్ వారింకాను ఓడించాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ స్వియటెక్ 6-1, 1-6, 6-1తో అన్నా కలిన్‌స్కయాపై, డిఫెండింగ్ చాంప్ మాడిసన్ కీస్ 6-3, 6-3తో ప్లిస్కోవాపై, 4వ సీడ్ అనిసిమోవా 6-1, 6-4తో స్టెర్న్స్‌పై, 5వ సీడ్ రిబకినా 6-2, 6-3తో తరెజాపై, 6వ సీడ్ పెగులా 6-3, 6-2తో ఒక్సానాపై గెలిచి ప్రీక్వార్టర్స్‌లో అడుగుపెట్టారు. రెండుసార్లు విజేత నవోమి ఒసాక గాయం కారణంగా మూడో రౌండ్ ఆడకుండానే టోర్నీ నుంచి వైదొలగింది.

యుకీ ముందుకు.. బాలాజీ ఇంటికి: పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు యుకీ భాంబ్రీ/గొరాన్సన్ (స్వీడన్) జోడీ మూడో రౌండ్ చేరగా.. మరో భారత స్టార్ శ్రీరామ్ బాలాజీ/నీల్ (ఆస్ట్రియా) ద్వయం రెండోరౌండ్లోనే వెనుదిరిగింది.

ఆంధ్ర రెండో ఇన్నింగ్స్ 93/1

విదర్భ 191 ఆలౌట్

సాయితేజకు 4 వికెట్లు


సాయితేజ

అనంతపురం (ఆంధ్రజ్యోతి-క్లాక్‌టవర్): ఆంధ్ర-డిఫెండింగ్ చాంపియన్ విదర్భ జట్ల మధ్య గ్రూప్ 'ఎ' రంజీ పోరు ఆసక్తికరంగా సాగుతోంది. 259 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ చేపట్టిన ఆంధ్ర జట్టు శనివారం ఆఖరికి 93/1 స్కోరుతో నిలిచింది. అర్ధ సెంచరీ హీరో షేక్ రషీద్ (50 నాటౌట్), శ్రీకర్ భరత్ (27 నాటౌట్) క్రీజులో ఉన్నారు. గెలిచేందుకు ఆంధ్ర జట్టుకు 166 పరుగులు కావాల్సి ఉండగా, చేతిలో 9 వికెట్లున్నాయి. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 4/0తో మూడోరోజైన శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 191 పరుగులకు ఆలౌటైంది. యశ్ రాథోడ్ (56), అమన్ మోఖడే (51), రవికుమార్ సమ్రాట్ (47) రాణించారు. ఆంధ్ర బౌలర్లలో కావూరి సాయితేజ (4/28) నాలుగు వికెట్లతో చెలరేగగా, నితీశ్, సౌరబ్ చెరో 2 వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ 295, ఆంధ్ర 228 పరుగులు చేశాయి.

ఆర్‌సీబీకి ఢిల్లీ ఝలక్


నందని (3/26)

వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జైత్రయాత్రకు బ్రేక్ పడింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 7 వికెట్లతో ఆర్‌సీబీకి షాకిచ్చింది. వరుసగా ఐదు విజయాలతో ఇప్పటికే ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టిన ఆర్‌సీబీకిది తొలి ఓటమి. అటు ఢిల్లీ 6 పాయింట్లు, మెరుగైన రన్‌రేట్‌తో రెండో స్థానానికి చేరింది. ముందుగా బెంగళూరు 20 ఓవర్లలో 109 పరుగులకే కుప్పకూలింది. 15 రన్స్ వ్యవధిలోనే చివరి 5 వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ స్మృతీ మంధాన (38), రాధా యాదవ్ (18) మాత్రమే రాణించారు. నందని శర్మకు మూడు.. మరిజానె కాప్, మిన్ను, హెన్రీలకు రెండేసి వికెట్లు దక్కాయి. స్వల్ప ఛేదనలో ఢిల్లీ 15.4 ఓవర్లలో 111/3 స్కోరు చేసి నెగ్గింది. వోల్వార్ట్ (42 నాటౌట్), సారథి జెమీమా (24), కాప్ (19 నాటౌట్), షఫాలీ (16) ఆకట్టుకున్నారు. సయాలికి 2 వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా కాప్ నిలిచింది.

సంక్షిప్త స్కోర్లు: బెంగళూరు: 20 ఓవర్లలో 109 ఆలౌట్ (మంధాన 38, రాధా 18; నందని 3/26, కాప్ 2/17, మిన్ను 2/18, హెన్రీ 2/22).

ఢిల్లీ: 15.4 ఓవర్లలో 111/3 (వోల్వార్ట్ 42 నాటౌట్, జెమీమా 24, కాప్ 19 నాటౌట్; సయాలి 2/18).

ప్యూర్ ఏజెంట్..

ఇదీ GST


రాంబాబు గొండాల

కొన్ని రకాల వృత్తి నిపుణులు.. తమ క్లయింట్లకు అందించే సర్వీస్‌లో భాగంగా చాలా ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. అంటే, తాము వసూలు చేసే రుసుములో ఎక్కువ మొత్తం ఖర్చులకే పోతుంది. దీంతో పోలిస్తే తాము సేవలను అందించినందుకు పొందే నికర రుసుము చాలా తక్కువ. అయినప్పటికీ జీఎస్‌టీ నిబంధనల ప్రకారం వసూలు చేసిన మొత్తం మీద జీఎస్‌టీ చెల్లించాల్సి ఉంటుంది. ఇలా కాకుండా కేవలం సర్వీస్ రుసుము మీద మాత్రమే (అంటే అయిన ఖర్చులకు కాకుండా) జీఎస్‌టీ చెల్లించే వెసులుబాటు ఉన్నట్లయితే చాలా సౌలభ్యంగా ఉంటుంది కదా. అయితే ఇది 'ప్యూర్ ఏజెంట్' విధానంలోనే సాధ్యపడుతుంది. అసలు ప్యూర్ ఏజెంట్ అంటే ఏమిటనేది ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం.

హైదరాబాద్‌లో వ్యాపార రంగంలో ఉన్న ఒక సంస్థ తమ ఉత్పత్తులను ఇతర రాష్ట్రాల్లో ప్రవేశ పెట్టాలని భావించింది. దీనికి గాను తమ ఉత్పత్తులకు ఆయా రాష్ట్రాల్లో డిమాండ్ ఎలా ఉంటుందో తెలుసుకోవటానికి మార్కెట్ స్టడీ చేసే బాధ్యతను ఒక కన్సల్టెన్సీకి ఇచ్చింది. దీనికి సంబంధించి రూ.20 లక్షలు ఫీజు చెల్లించే విధంగా ఒప్పందం కుదిరింది. ఆ కన్సల్టెన్సీ తమ ఉద్యోగులను వివిధ టీమ్‌లుగా విభజించి దేశంలోని కొన్ని ప్రాంతాలకు పంపించింది. వారి సర్వే ఫలితాల ఆధారంగా ఒక నివేదికను సదరు కంపెనీకి అందించింది. కంపెనీ కూడా అనుకున్న విధంగా రూ.20 లక్షలు చెల్లించింది. అయితే రూ.20 లక్షల్లో రూ.15 లక్షల వరకు తమ ఉద్యోగుల రానుపోను ప్రయాణ ఖర్చులు, వసతి, భోజనం, లోకల్ ప్రయాణ ఖర్చులు అయినట్లు తేలింది. అంటే ఆ కన్సల్టెన్సీకి ఖర్చులు పోనూ సర్వీస్ చార్జీ కింద మిగిలింది రూ.5 లక్షలు మాత్రమే. అయినప్పటికీ జీఎస్‌టీ మాత్రం రూ.20 లక్షల మీద చెల్లించాల్సి ఉంటుంది.

అలాగే, అదే కంపెనీ తమ ఉత్పత్తులకు సంబంధించి గిడ్డంగి నిర్వహణ బాధ్యతను ఒక వ్యక్తికి అప్పగించింది. ఒప్పందం ప్రకారం ఆ గిడ్డంగి నిర్వహణ కోసం అయిన ఖర్చు అంటే.. అద్దె, లోడింగ్, అన్ లోడింగ్, విద్యుత్ మొదలగు ఖర్చులను మొదట ఆ వ్యక్తి పెట్టుకుని నెల చివరిలో కంపెనీ నుంచి వసూలు (రీయింబర్స్‌మెంట్) చేసుకోవాలి. ఈ నిర్వహణకు గాను అతనికి సర్వీస్ చార్జీ కింద నెలకు రూ.20,000 ఇవ్వటం జరుగుతుంది. అనుకున్న విధంగా నెల చివరన ఖర్చులు రూ.80,000, సర్వీస్ చార్జీ రూ.20,000 కలుపుకుని మొత్తం రూ.లక్షకు ఆ వ్యక్తి కంపెనీకి బిల్లు ఇవ్వటం జరిగింది. అలాగే, ఆ కంపెనీ అతనికి రూ.లక్ష చెల్లించటం జరిగింది. మరి ఇక్కడ జీఎస్‌టీ ఎంత మీద కట్టాలి అంటే.. రూ.20,000 పైన చెల్లిస్తే సరిపోతుంది.

పైన తెలిపిన రెండు ఉదాహరణల్లో కూడా సర్వీస్ చార్జీ కంటే ఖర్చులు ఎక్కువ ఉన్నాయి. అయినా మొదటి ఉదాహరణలో మొత్తం ఇన్వాయిస్ విలువ మీద జీఎస్‌టీ చెల్లించాల్సి ఉండగా రెండో ఉదాహరణలో కేవలం సర్వీస్ చార్జీ మీద మాత్రమే జీఎస్‌టీ చెల్లిస్తే సరిపోతుంది. రెండో ఉదాహరణలో వ్యక్తి మొత్తం బిల్లు మీద ఎందుకు జీఎస్‌టీ చెల్లించాల్సిన అవసరం ఎందుకు లేదంటే.. ఆ వ్యక్తి సదరు కంపెనీకి ప్యూర్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నాడు. అంటే తను ఖర్చుల కింద చెల్లించే మొత్తం కంపెనీ తరపున, కంపెనీ అనుమతితో చెల్లిస్తున్నాడు. ఇంకొక విధంగా చెప్పాలంటే కంపెనీ తాను చెల్లించాల్సిన ఖర్చును ఆ వ్యక్తి ద్వారా చెల్లిస్తున్నట్లు.


ప్యూర్ ఏజెంట్ అంటే తాను అందించే సేవల్లో భాగంగా పెట్టే ఖర్చుకు ముందుగా ఆ కంపెనీ నుంచి అనుమతి తీసుకుని ఉండాలి. అలాగే దీనికి సంబంధించిన బిల్లులు కంపెనీ పేరు మీదే తీసుకోవాలి. వాటి వివరాలను విధిగా ఇన్వాయిస్‌లో చూపాలి. ఎంత ఖర్చు అయ్యిందో అంతే చూపాలి తప్ప అంతకు మించి చూపకూడదు. ఇంకా ఆయా సర్వీసులను సొంత అవసరాలకు వాడకూడదు. ఉదాహరణకు ఆ గిడ్డంగిని కంపెనీ కోసమే వాడాలి తప్ప తాను నివసించటానికి గానీ ఇతర సొంత అవసరాలకు గానీ వాడకూడదు. ఈ నిబంధనలు అన్ని పాటిస్తూ నెలాఖరులో కంపెనీకి ఇచ్చే బిల్లులో కంపెనీ తరపును ఈ విధంగా పెట్టిన ఖర్చుల వివరాలను, తన సర్వీస్ చార్జీలను విడివిడిగా చూపాలి. అలాగే ఖర్చులకు సంబంధించిన బిల్లులను విధిగా జతపరచాలి. ఈ నిబంధనలన్నీ పాటించినప్పుడు ఖర్చులు మినహాయించి సర్వీస్ చార్జీ మీద మాత్రమే జీఎస్‌టీ కడితే సరిపోతుంది. సర్వీస్ పొందే వ్యక్తి తరపున ఖర్చు పెడుతూ, ఆ ఖర్చుల నుంచి జీఎస్‌టీ మినహాయింపు పొందాలనుకునే వారికి ప్యూర్ ఏజెంట్ పద్ధతి బాగా ఉపయోగపడుతుంది. కాకపోతే దీనికి సంబంధించిన నియమ నిబంధనలను జాగ్రత్తగా పాటించాల్సి ఉంటుంది.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

బిజినెస్ ప్లస్

పన్నుల తగ్గింపుపైనే ఆశలు..!

బడ్జెట్‌పై మదుపరుల అంచనాలు



కేంద్ర బడ్జెట్ దగ్గర పడుతోంది. ఇందుకు మరికొద్ది రోజులే సమయం ఉంది. ఆదివారమైనా సరే.. ఫిబ్రవరి 1నే బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సిద్ధమయ్యారు. దీంతో ఎప్పటిలానే వచ్చే కేంద్ర బడ్జెట్‌పైనా మదుపరులు చాలా ఆశలు పెట్టుకున్నారు. ఆ ఆశలు ఏంటో తెలుసుకుందాం.

కేంద్ర బడ్జెట్ అంటే అందరికీ కోటి ఆశలు. అందులోనూ క్యాపిటల్ మార్కెట్ మదుపరుల ఆశల గురించైతే ఇక చెప్పాల్సిన పనే లేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు, పెరుగుతున్న అంతర్జాతీయ ఉద్రిక్తలతో సెన్సెక్స్, నిఫ్టీ ఇప్పటికే 'బేర్' పట్టులోకి జారుకున్నాయి. డిఫెన్సివ్ షేర్లుగా ముద్ర పడిన కంపెనీల షేర్లూ ఇప్పుడు నేలచూపులు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో వచ్చే కేంద్ర బడ్జెట్ (2026-27)పై మదుపరుల అంచనాలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

ద్రవ్య స్థిరీకరణ

ద్రవ్య స్థిరీకరణ ఎంత బలంగా ఉంటే దేశ ఆర్థిక వ్యవస్థ, క్యాపిటల్ మార్కెట్లకు అంత మంచిది. దాంతో దేశ, విదేశీ మదుపరులకు మన ఆర్థిక వ్యవస్థపై నమ్మకం పెరిగి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించవచ్చు. అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థలూ మన దేశ పరపతి రేటింగ్‌నూ పెంచే అవకాశం ఏర్పడుతుంది. డాలర్‌తో సహా ప్రధాన కరెన్సీలతో రూపాయి మారకం రేటు పుంజుకుంటుంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25) జీడీపీలో ద్రవ్య లోటు 4.8 శాతంగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) దాన్ని 4.4 శాతం వద్ద కట్టడి చేస్తామని నిర్మలా సీతారామన్ గత ఏడాది ఫిబ్రవరిలో బడ్జెట్ ప్రవేశపెడుతూ చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) దీన్ని 4.2 లేదా 4.3 శాతానికి తగ్గించే అవకాశం ఉందని భావిస్తున్నారు. అలాగే ప్రస్తుతం జీడీపీలో 58 శాతం వరకు ఉన్న కేంద్ర ప్రభుత్వ రుణ భారాన్నీ 2031 మార్చి నాటికి 50 శాతానికి కుదిస్తామని ప్రకటించారు. ఈ రెండింటికి సంబంధించి వచ్చే కేంద్ర బడ్జెట్‌లో సానుకూల ప్రకటనలు ఉంటే క్యాపిటల్ మార్కెట్‌కు పెద్ద బూస్ట్ లభించినట్టే.

పెట్టుబడుల ఉపసంహరణ

ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) పెట్టుబడుల ఉపసంహరణపై వచ్చే కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి చేసే ప్రకటన కోసం రిటైల్ మదుపరులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.47,000 కోట్లు లక్ష్యంగా నిర్ణయించినా ఇప్పటి వరకు రూ.10,000 కోట్లు కూడా వసూలు కాలేదు. ఈ పెట్టుబడుల ఉపసంహరణ ఎంత భారీగా ఉంటే ప్రభుత్వ రుణ సేకరణ అంతగా తగ్గి.. ఆర్థిక వ్యవస్థలో నిధుల లభ్యత అంతగా పెరుగుతుంది. ఆ ప్రభావం క్యాపిటల్ మార్కెట్‌పైనా కనిపిస్తుంది. వచ్చే ఆర్థిక సంవత్సరం కనీసం రూ.50,000 కోట్ల నుంచి రూ.60,000 కోట్లయినా ఈ పద్దు ద్వారా సేకరించేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవాలని మదుపరులు కోరుతున్నారు.

పెట్టుబడులు

ద్రవ్య లోటు, రుణ భారాన్ని కట్టడి చేయడం ఎంత ముఖ్యమో, ఆర్థిక వ్యవస్థకు పెట్టుబడులూ అంతే ముఖ్యం. ఎన్ని రాయితీలు ఇచ్చినా కొవిడ్ తర్వాత ప్రైవేట్ పెట్టుబడులు పెరగడం లేదు. ఐటీ, డేటా సెంటర్లు, జీసీసీలు, స్టార్టప్స్‌లో తప్ప.. ఇతర రంగాల్లో పెద్దగా ప్రైవేట్ పెట్టుబడులు లేవు. నిజం చెప్పాలంటే ప్రభుత్వ పెట్టుబడులే గత కొద్ది సంవత్సరాలుగా మన ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తున్నాయి. వచ్చే కేంద్ర బడ్జెట్‌లోనూ మౌలిక, రక్షణ, విద్యుత్, తయారీ రంగాలకు ప్రభుత్వం పెద్దఎత్తున కేటాయింపులు చేసే అవకాశం ఉందని మదుపరుల అంచనా.

ఇన్‌ఫ్రా, ఉద్యోగాల కల్పన

సరైన మౌలిక సదుపాయాలు లేకుండా ఏ దేశ ఆర్థిక వ్యవస్థా అభివృద్ధి చెందలేదు. చైనా, కొరియా దేశాల అభివృద్ధికి అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలే కారణం. దాంతో దేశ, విదేశీ పెట్టుబడులు వెల్లువెత్తి, ఉద్యోగ అవకాశాలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగి ఆ దేశాలు ప్రధాన ఆర్థిక శక్తులుగా ఎదిగాయి. మన దేశం ఈ విషయంలో ఇటీవల కొద్దిగా ముందంజ వేసినా ఇంకా కుంటి నడక నడుస్తోంది. ఈ సమస్యను అధిగమించేందుకు వచ్చే కేంద్ర బడ్జెట్‌లో మౌలిక సదుపాయాల రంగానికి ఆర్థిక మంత్రి మరిన్ని నిధులు కేటాయించాలని మదుపరుల ఆశ. ఇందు కోసం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్స్)కు ప్రత్యేక పన్ను రాయితీలు ఇవ్వాలని కోరుతున్నారు. బడ్జెట్‌లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తే అది పరోక్షంగా సిమెంట్, స్టీల్, భవన నిర్మాణ సామాగ్రి తయారీ కంపెనీలకూ మేలు చేస్తుంది.

పన్నుల హేతుబద్ధీకరణ

మదుపరులు మూలధన లాభాల పన్ను, ఆదాయ పన్నుల విధింపులో స్థిరత్వం కోరుకుంటున్నారు. 2024-25 బడ్జెట్‌లో క్యాపిటల్ మార్కెట్లో వచ్చే దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టీసీజీ)పై 12.5 శాతం పన్ను విధించారు. అప్పటి వరకు ఏడాదికి మించి ఉంచుకుని అమ్మే లిస్టెడ్ కంపెనీల షేర్లు, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పథకాల యూనిట్లు అమ్మగా వచ్చిన లాభాలకు పూర్తి పన్ను మినహాయింపు ఉండేది. ఏడాది లోపు అమ్ముకుంటే వచ్చే స్వల్ప కాలిక మూలధన లాభాల (ఎస్‌టీసీజీ)పై మాత్రమే 12.5 శాతం ఉండేది. ఇప్పుడు దీర్ఘకాలిక మూలధన లాభాలపై 12.5 శాతం, స్వల్పకాలిక మూలధన లాభాలపై 20 శాతం చొప్పున పన్ను విధిస్తున్నారు. దీర్ఘకాలిక లాభాల పన్ను మినయింపు పరిమితిని గత బడ్జెట్ (2025-26)లో రూ.లక్ష నుంచి రూ.1.25 లక్షలకు మాత్రమే పెంచారు. ఈ కొద్దిపాటి మినహాయింపు పెంపు మదుపరులకు పెద్దగా రుచించలేదు. కనీసం వచ్చే కేంద్ర బడ్జెట్‌లోనైనా ఎల్‌టీసీజీని హేతుబద్ధం చేసి రిటైల్ మదుపరులకు ఇచ్చే మినహాయింపు పరిమితిని రూ.2 లక్షలకు పెంచాలని కోరుతున్నారు.

పెట్టుబడుల వ్యూహం

బడ్జెట్ తేదీ దగ్గర పడే కొద్దీ స్టాక్ మార్కెట్ తీవ్ర ఆటుపోట్లకు లోనవుతోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు మదుపరులు దీర్ఘకాలిక డిఫెన్సివ్ వ్యూహాన్ని అనుసరించడం మంచిది. ప్రస్తుత మార్కెట్ ఆటుపోట్లతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ వంటి అనేక లార్జ్ క్యాప్ ప్రైవేట్ బ్యాంకులు, ఎంపిక చేసిన కొన్ని ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తున్నాయి. కొద్దిపాటి నష్ట భయాన్ని (రిస్క్) భరించగలిగే మదుపరులు ఈ షేర్లపై ఒక కన్నేయవచ్చు. ఇందులో అనేక పీఎస్‌యూలు దాదాపు బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ) వడ్డీకి సమానమైన స్థాయిలో డివిడెండ్ చెల్లించే కంపెనీలు. రిటైల్ మదుపరులు ప్రస్తుత మార్కెట్ దిద్దుబాటును ఇలాంటి షేర్ల కొనుగోలుకు ఉపయోగించుకోవడం మంచిది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

25వ తేదీ



హైదరాబాద్	485	విజయవాడ	510
వరంగల్	487	గోదావరి	480
చిత్తూరు	543	విశాఖపట్నం	480
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	140	విజయవాడ	143
వరంగల్	140	గుంటూరు	150
కరీంనగర్	140	ఒంగోలు	150
మహబూబ్‌నగర్	140	చిత్తూరు	146
కర్నూలు	140	నెల్లూరు	151
విశాఖపట్నం	135	అనంతపురం	151
గోదావరి	143		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,60,260 ▲	1,46,900 ▲	3,65,000 ▲
విజయవాడ	1,62,800 ▲	1,52,000 ▲	3,45,000 ▲
విశాఖపట్నం	1,60,260 ▲	1,46,900 ▲	3,65,000 ▲
రాజమండ్రి	1,58,620 ▼	1,45,400 ▼	3,22,000 ▼
ప్రొద్దుటూరు	1,62,100 ▲	1,49,130 ▲	3,43,000 ▲
ముంబై	1,54,310 ▲	1,41,348 ▲	3,17,705 ▲

బడ్జెట్ సమావేశాల్లో జమిలి బిల్లు!

నియోజకవర్గాల పునర్విభజన బిల్లు కూడా.. ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్న కేంద్రం

- 28న సమావేశాలు ప్రారంభం
- ఏపీ రాజధానిగా అమరావతిని నిర్ణయిస్తూ బిల్లుకు రూపకల్పన!

న్యూఢిల్లీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రారంభమయ్యే పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో.. జమిలి ఎన్నికలపై బిల్లును అధికారపక్షం ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. ఈ బిల్లుపై ఏర్పాటైన పార్లమెంటు సంయుక్త కమిటీ నివేదికను కూడా ఈ సమావేశాల్లోనే సమర్పించనున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్ సమావేశాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. జమిలి ఎన్నికలతోపాటు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మరో అంశం.. నియోజకవర్గాల పునర్విభజన. దీనికి సంబంధించి బిల్లును కూడా ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా చట్టబద్ధంగా నిర్ణయించే బిల్లు రూపకల్పన జరుగుతోందని, బడ్జెట్ సమావేశాల్లోనే దీనిని ప్రవేశపెడతారని ఆ వర్గాలు తెలిపాయి. సమావేశాల మొదటి రోజే జరగనున్న కేంద్ర క్యాబినెట్ భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. పూర్వోదయ పథకం కింద ఏపీకి భారీగా నిధులు కేటాయించే



అవకాశం కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

ఆదాయ పన్ను చట్టాల సరళీకరణ

ఫైనాన్స్ బిల్లులో భాగంగా ఆదాయ పన్ను చట్టాలను మరింత సరళీకరిస్తూ ప్రత్యక్ష పన్నుల కోడ్‌ను, బ్యాంకింగ్ చట్టాల సవరణలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటు సమావేశాల్లో ప్రతిపాదించే అవకాశాలున్నాయి. ముస్లిం చారిటబుల్ ఆస్తులను నిర్వహించే అంశంలో గతంలో రూపొందించిన వక్ఫ్ చట్టానికి కూడా ఈ సమావేశాల్లో సవరణలు ప్రతిపాదించనున్నారు. డిజిటల్ పర్సనల్ డేటా పరిరక్షణ నిబంధనల అంశం కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఉన్నత విద్యకు సంబంధించిన అన్ని రంగాలను నియంత్రించేందుకు వీలుగా ఒక సంస్థను నెలకొల్పే బిల్లు కూడా ఈ సమావేశంలో చర్చకు రానుంది. దీనికి సంబంధించిన 'వికసిత్ భారత్ శిక్షా అధీక్షణ్ బిల్లు'ను గత డిసెంబరులోనే కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. సెబీ, ఎస్సీఆర్ఏ డిపాజిటరీల చట్టాలను విలీనం చేస్తూ భారత స్టాక్ మార్కెట్ చట్టాలను ఆధునీకరించే ఉద్దేశంతో రూపొందించిన సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్ బిల్లును సైతం బడ్జెట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టనున్నారు.

27న అఖిలపక్ష సమావేశం

కంపెనీల దివాళా అప్పీళ్లను నిర్ణయించేందుకు సంబంధించిన దివాళా ఖాయిలా కోడ్ (సవరణ) బిల్లుపైనా బడ్జెట్ సమావేశాల్లో చర్చ జరగనుంది. ఈ బిల్లు ఆమోదం పొందితే కంపెనీల దివాళా అప్పీళ్లపై 'జాతీయ కంపెనీల లా అప్పిలేట్ ట్రిబ్యునల్' 3నెలల్లోనే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 27న నిర్వహించే అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వం తన ప్రతిపాదనలను ప్రతిపక్షాలకు వివరించనుంది. 28న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. తొలి విడత సమావేశాలు ఫిబ్రవరి 13న ముగుస్తాయి. మలి విడత బడ్జెట్ సమావేశాలు మార్చి 9న మొదలై ఏప్రిల్ 2న ముగుస్తాయి.

డిస్కంలు గాడిన పడుతున్నాయి

- మెరుగైన పనితీరుతో సీ నుంచి బీ గ్రేడ్

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో కుదేలైన విద్యుత్తు పంపిణీ సంస్థలు కూటమి ప్రభుత్వ హయాంలో గాడిన పడుతూ మెరుగైన పనితీరును కనబరుస్తున్నాయి. దేశవ్యాప్తంగా విద్యుత్తు పంపిణీ సంస్థల పని తీరును మదింపు చేసిన కేంద్ర విద్యుత్తు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎ్‌ఫసీ) 14వ వార్షిక నివేదిక విడుదల చేసింది. దాని ప్రకారం ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్ సంస్థలు సీ గ్రేడ్ నుంచి బీ గ్రేడ్‌కు అప్ గ్రేడ్ అయ్యాయి. గత ఏడాది ఏ గ్రేడ్ సాధించిన ఈపీడీసీఎల్ మాత్రం బీకి జారింది. డిస్కంల ఆర్థిక స్థిరత్వం, ఆపరేషనల్ సామర్థ్యం, పాలనవంటి అంశాల ఆధారంగా గ్రేడింగ్‌లను ఇస్తారు. ఏపీ డిస్కంలు నష్టాలు, వసూళ్లలో జాప్యం, ఆర్థిక ఒత్తిళ్ల కారణంగా తక్కువ పనితీరును కనబర్చి బీ గ్రేడ్‌లో నిలిచాయి. వైసీపీ హయాంలో డిస్కంల పనితీరు ఘోరంగా పడిపోయింది. ఐదేళ్లలో ఎక్కువసార్లు సీ గ్రేడ్‌కే పరిమితమయ్యాయి. పీఎఫ్‌సీ నివేదిక ప్రకారం గతేడాది డిస్కంలు మెరుగైన పనితీరు కనబర్చాయి. బిల్లుల వసూళ్ల సామర్థ్యం 94.91 శాతం నుంచి 99.26 శాతానికి పెరిగింది. విద్యుత్తు పంపిణీ నష్టాలను 12నుంచి 7.9 శాతానికి తగ్గించుకోగలిగాయి. దీంతో మెరుగైన పనితీరు కనబరుస్తున్న రాష్ట్రాల సరసకు ఏపీ చేరుకోగలిగింది.

అకీరా నందన్‌పై డీప్ ఫేక్ వీడియో

- నిందితుడిని అరెస్టు చేసిన సర్పవరం పోలీసులు

సర్పవరం జంక్షన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం, జనసేనాని పవన్ కల్యాణ్ కుమారుడు అకీరా నందన్‌పై ఏఐతో తప్పుడు(డీప్ ఫేక్) వీడియో సృష్టించి, యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు కేసు వివరాలు తెలిపారు. 'అకీరా నందన్ డీప్ ఫేక్ వీడియోపై కాకినాడ రూరల్ రమణయ్యపేటకు చెందిన రాష్ట్ర జనసేన సహాయ కార్యదర్శి తాటికాయల వీరబాబు ఫిర్యాదు చేశారు. నిందితుడు హైదరాబాద్‌కు చెందిన ముద్దినేని వెంకటరమణ(36)గా గుర్తించాం. ఏఐ పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేసి ఇటువంటి నేరాలకు పాల్పడినట్లు నిర్ధారించాం. నిందితుడిని కాకినాడలో అరెస్టు చేసి కోర్టు ఆదేశాలతో జ్యుడీషియల్ రిమాండ్‌కి తరలించాం. డిజిటల్ కంటెంట్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఇటువంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు' అని సీఐ హెచ్చరించారు.



మిన్నియాపొలిస్‌లో మరో పౌరుడి కాల్చివేత

- మైనస్ 30 డిగ్రీల చలిలో ప్రజల నిరసన

మిన్నెసోటా, జనవరి 24: ట్రంప్ ఇమిగ్రేషన్ విధానాలకు వ్యతిరేకంగా అమెరికాలోని మిన్నియాపొలిస్‌లో కొన్ని రోజులుగా నిరసన తెలుపుతున్న ప్రజలపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ(డీహెచ్‌ఎస్) ఏజెంట్లు మళ్లీ కాల్పులు జరిపారు. శనివారం జరిపిన ఈ కాల్పుల్లో ఓ వ్యక్తి మరణించాడు. ఈ నెల 7న ఇక్కడే డీహెచ్‌ఎస్ ఏజెంట్లు జరిపిన కాల్పుల్లో రెనీ గుడ్ అనే 37 ఏళ్ల మహిళ మరణించారు. దీంతో తీవ్ర ఆగ్రహంతో ఉన్న ప్రజలు వేలాదిమంది మైనస్ 30 డిగ్రీల కఠిన వాతావరణంలో కూడా రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్నారు. కాల్పుల ఘటనపై మిన్నెసోటా గవర్నర్ టిమ్ వాల్జ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

పోక్సో కేసులు ఏడేళ్లలో రెట్టింపు

- ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 24: పసిమొగ్గలపై అత్యాచారాలు, బలవంతపు పెళ్లిళ్ల కోసం మైనర్ బాలికల కిడ్నాప్‌లతో ఆడుతూ.. పాడుతూ.. కేరింతలతో గడపాల్సిన బాల్యం బలిపీఠం ఎక్కుతోంది. దేశవ్యాప్తంగా పిల్లలపై జరుగుతున్న నేరాలు ఏటికేడు పెరిగిపోతున్నాయి. జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాల ప్రకారం... 2016 నుంచి 2023 మధ్య కాలంలో పోక్సో చట్టం కింద నమోదైన కేసులు దాదాపు రెట్టింపయ్యాయి. ఇదే సమయానికి పిల్లలపై జరిగిన మొత్తం నేరాలు 40శాతం పెరిగాయి. 2016లో 36,022గా ఉన్న పోక్సో కేసులు 2023 నాటికి 67,694కు పెరిగాయి. ఈ కాలంలో పోక్సో బాధితుల సంఖ్య కూడా 36,321 నుంచి 68,636కు పెరిగింది. 2016-23 మధ్య దేశంలో నమోదైన పిల్లలపై నేరాలకు సంబంధించి మొత్తం కేసుల్లో పోక్సో కేసులు, బాధితులు 30 శాతానికి పైమాటే. ఈ లెక్కలు మైనర్లపై పెరుగుతున్న లైంగిక హింస తీవ్రతకు అద్దపడుతున్నాయి. పిల్లలపై జరిగిన మొత్తం నేరాలు 2016లో లక్ష మార్కును దాటగా, 2023 నాటికి 1.77 లక్షలకు చేరాయి. ఈ సమయానికి బాధితుల సంఖ్య కూడా 1.11 లక్ష నుంచి 1.86 లక్షలకు పెరిగింది. బాలికపై అత్యాచార కేసుల్లో 2023లో మహారాష్ట్ర(4,672) మొదటిస్థానంలో ఉంది.

10 టన్నుల స్టీల్ బ్రిడ్జిని తెల్లవారేసరికి

మాయం చేశారు!

- తుక్కుగా అమ్ముకొనేందుకు దొంగల లాఘవం

కోర్బా, జనవరి 24 : అక్కడ 40 ఏళ్లుగా ఓ స్టీల్ బ్రిడ్జి ఉంది... దాని పొడవు 70 అడుగులు.. బరువు 10 టన్నులకు పైనే...! దానిపై చోరుల కన్ను పడింది. అంతే... తెల్లవారేసరికి దాన్ని మాయం చేశారు...! తెల్లవారాక బ్రిడ్జి కనిపించక స్థానికులు బిత్తరపోయారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కోర్బా నగరంలో ఈ ఘటన చోటు చేసుకుంది. కోర్బా నగరంలో ఓ కాలువపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జి అక్కడి ధోధిపర ఏరియా 17వ వార్డు వాసులకు నడక దారిగా ఉంది. ఈ నెల 18న తెల్లవారాక చూడగా స్థానికులకు ఆ బ్రిడ్జి కనిపించలేదు. దీంతో స్థానిక కార్పొరేటర్ లక్ష్మణ్ శ్రీవాస్ స్థానిక సీఎస్‌ఈబీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని కోర్బా అదనపు ఎస్పీ లఖన్ పాట్లే విలేకరులకు చెప్పారు. కేసు విచారణకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విచారణలో గ్యాస్ కట్టర్లు ఉపయోగించి బ్రిడ్జిని కట్ చేసినట్లు తేలిందన్నారు. తుక్కుగా అమ్ముకొనేందుకు దాన్ని ముక్కలు చేసి చోరీ చేశారని వివరించారు. మొత్తం 15 మంది ఈ పని చేయగా... వారిలో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన 10 మంది కోసం గాలిస్తున్నారు. నిందితులు కాలువలో దాచిన 7టన్నుల బ్రిడ్జి ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన స్టీల్‌ను తరలించిన వాహనాన్ని కూడా సీజ్ చేశారు. మిగిలిన స్టీల్‌ను ఎక్కడ అమ్మారనే విషయంపై విచారిస్తున్నారు.

అంకెలు సరిగా రాయలేదని.. కూతుర్ని నేలకేసి కొట్టి చంపాడు!

- యూపీలోని ఫరీదాబాద్‌లో తండ్రి దుర్మార్గం



కృష్ణా జైశ్వాల్

లఖ్‌నవూ, జనవరి 24: నాలుగున్నరేళ్ల పాప.. ఒకటి నుంచి 50 వరకు అంకెలు సరిగా రాయలేదన్న కోపంతో ఆమెను కన్నతండ్రి అప్పడాల కర్రతో ఇష్టం వచ్చినట్లు కొట్టాడు. అప్పటికీ ఆగ్రహం చల్లారక ఆ చిన్నారిని విసురుగా నేలకేసి కొట్టాడు. ఈ ఘటనలో పాప తలకు తీవ్రగాయాలయ్యాయి. తర్వాతే తానే ఆ బిడ్డను ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే చిన్నారి ప్రాణాలు విడిచింది. యూపీలోని ఫరీదాబాద్‌లో ఆలస్యంగా వెలుగుచూసిందీ ఘోరం. చిన్నారికి గాయాలెందుకయ్యాయి? అని వైద్యులు అడిగితే మెట్ల మీద నుంచి జారి పడిందని కట్టుకథ అల్లాడు ఆ తండ్రి. తన భార్య రంజితకు కూడా అలాగే చెప్పాడు. హతురాలు వంశిక. నిందితుడు కృష్ణా జైస్వాల్(31). అయితే ఈ దంపతులకు వంశికతో పాటు మరో ఇద్దరు పిల్లలున్నారు. ఘటన జరిగినప్పుడు ఆ ఇద్దరూ ఇంట్లోనే ఉన్నారు. వారిలో ఏడేళ్ల బాలుడు.. చెల్లి వంశిక పట్ల తండ్రి ప్రదర్శించిన దాష్టీకాన్ని తల్లి రంజితకు కళ్లకు కట్టినట్టు వివరించాడు. దీంతో ఆమె భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కృష్ణను పోలీసులు అరెస్టు చేశారు.



న్యూయార్క్‌లో రోడ్లపై మంచు

మంచు తుఫానుతో అమెరికా గజగజ

- 9 వేలకు పైగా విమాన సర్వీసులు రద్దు..15రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ

వాషింగ్టన్, జవనరి 24: భీకర మంచు తుఫానుతో అమెరికా తూర్పు తీరం గడ్డకట్టుకుపోయింది. తుఫాను మరింత తీవ్రంగా మారొచ్చన్న అమెరికా జాతీయ వాతావరణ సేవల విభాగం(ఎన్‌డబ్ల్యూఎస్) అంచనాలతో దాదాపు 15 రాష్ట్రాల గవర్నర్లు వాతావరణ ఎమర్జెన్సీ ప్రకటించారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని, ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. మంచు తుఫాను ప్రభావం విమాన సర్వీసులపై భారీగా పడింది. అమెరికాలో శని, ఆదివారాలకు సంబంధించి 9వేలకు పైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఈ సంఖ్య మరింత పెరగొచ్చని భావిస్తున్నారు. ఈ నెల 25, 26వ తేదీల్లో ఢిల్లీ, ముంబైల నుంచి న్యూయార్క్‌కు వెళ్లే విమాన సర్వీసులను రద్దు చేసినట్లు ఎయిర్ ఇండియా ప్రకటించింది. దట్టమైన మంచుతో అమెరికాలోని పలు రాష్ట్రాల్లో విద్యుత్తు సరఫరా వ్యవస్థ దెబ్బతిన్నది. రోడ్లన్నీ మంచుతో నిండిపోయాయి. తఫాను ప్రభావం 14కోట్ల మందిపై పడింది. ఒక్లహామా, నార్త్ డకోటా రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు -40డిగ్రీలకు పడిపోయాయి. మంచు తుఫాను వేళ ప్రజలకు సాయం అందించడం కోసం ఫెడరల్ గవర్నమెంట్ కూడా అనేక ఏర్పాట్లు చేసింది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

27న తుది తీర్పు



దళపతి విజయ్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'జననాయగన్' చిత్రం విడుదలకు సంబంధించిన ఉత్కంఠ ఇంకా కొనసాగుతూనే ఉంది. సెన్సార్ సర్టిఫికెట్ వివాదంతో వాయిదా పడిన ఈ సినిమా భవితవ్యంపై మద్రాస్ హైకోర్టు ఈనెల 27న తుది తీర్పు వెలువరించనుంది. ఈ తీర్పు తర్వాతే సినిమా కొత్త విడుదల తేదీపై స్పష్టత రానుంది. ఈ చిత్రం ప్రదర్శన అనుమతులపై దాఖలైన పిటిషన్లను విచారించిన మద్రాస్ హైకోర్టు డివిజన్ బెంచ్, తన తీర్పును 27కు వాయిదా వేసింది. జనవరి 9న విడుదల కావాల్సిన ఈ చిత్రానికి సెన్సార్‌బోర్డు క్లియరెన్స్ ఇవ్వడానికి నిరాకరించడంతో నిర్మాతలు హైకోర్టును ఆశ్రయించారు. సింగిల్ జడ్జి బెంచ్ విడుదలకు అనుకూలంగా తీర్పునిచ్చినప్పటికీ, సెన్సార్‌బోర్డు దీనిని డివిజన్ బెంచ్ వద్ద సవాల్ చేసింది. దీంతో సుప్రీంకోర్టును ఆశ్రయించిన నిర్మాతలకు అక్కడ కూడా ఊరట లభించలేదు. హైకోర్టులోనే తేల్చుకోవాలని ఆదేశించింది.

కింగ్ వచ్చేస్తున్నాడు



షారుక్ ఖాన్ కథానాయకుగా సిద్ధార్థ్ ఆనంద్ తెరకెక్కిస్తున్న చిత్రం 'కింగ్'. ఇటీవలే విడుదలైన గ్లింప్స్ సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతోందో హింట్ ఇచ్చింది. రెడ్ చిల్లీస్ ఎంటర్టైన్‌మెంట్స్, మర్ఫిక్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తూ ఓ వీడియోను విడుదల చేశారు మేకర్స్. డిసెంబరు 24న ప్రేక్షకుల ముందుకు తెస్తున్నట్లు తెలిపారు. 'గర్జించేందుకు సమయం ఆసన్నమైంది..' వంటి సంభాషణలు, షారుక్ లుక్స్, పోరాట ఘట్టాలు, విజువల్స్ ఆకట్టుకున్నాయి. ఈ చిత్రంలో షారుక్ కుమార్తె సుహానా కీలక పాత్రలో నటిస్తున్నారు. బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించిన 'పఠాన్' తర్వాత షారుక్ ఖాన్, సిద్ధార్థ్ ఆనంద్ కలయికలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి.



వేసవిలో 'స్వయంభు'

కార్తికేయ-2తో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న హీరో నిఖిల్ నటిస్తున్న తాజా చిత్రం 'స్వయంభు'. భారీ స్థాయిలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. సంయుక్త, నభా నటేష్ కథానాయికలు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

మాతృభూమి గొప్పదనం చాటేలా...



సల్మాన్ ఖాన్ కథానాయకుడిగా అపూర్వ లాఖియా తెరకెక్కిస్తున్న చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం నుంచి 'మాతృభూమి' అనే పాటను విడుదల చేశారు మేకర్స్. మాతృభూమి గొప్పదనాన్ని చాటేలా సాగే గీతమిది. సైనికుల యుద్ధ సన్నాహాలను చూపించే విజువల్స్ ఆకట్టుకున్నాయి. ఈ పాట మన మాతృభూమికి, దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమర జవాన్లకు నివాళి అని పేర్కొన్నారు మేకర్స్. సమీర్ అంజాన్ రచించగా, అర్జిత్ సింగ్, శ్రేయా ఘోషల్ ఆలపించారు. హిమేశ్ రెష్మియా సంగీతం అందించారు. 2020లో గాల్వాన్‌లో జరిగిన ఇండియా - చైనా యుద్ధం నేపథ్యంలో ప్రచురితమైన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్' పుస్తకం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. చిత్రంగద సింగ్ హీరోయిన్. త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్.

ఒకేసారి ఐదు భాషల్లో...



యోగేష్ కల్లె హీరోగా, సన్ని లియోన్ ప్రధాన పాత్రలో నటించిన సినిమా త్రిముఖ. రాజేశ్ నాయుడు దర్శకత్వం వహించారు. అఖిరా డ్రీమ్ క్రియేషన్స్ బ్యానర్‌పై శ్రీదేవి మద్దాలి, రమేశ్ మద్దాలి ఒకేసారి ఐదు భాషల్లో నిర్మించారు. సినిమాను ఈనెల 30న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా కథానాయకుడు యోగేశ్ కల్లే మాట్లాడుతూ 'హాస్యంతోపాటు ఉత్కంఠకు గురిచేసే సన్నివేశాలు ఉన్న కథతో ఒక ప్రయోగం చేశాం' అని తెలిపారు. దర్శకుడు రాజేశ్ నాయుడు మాట్లాడుతూ 'సినిమాలోని ప్రతి క్యారెక్టర్‌కూ ప్రాధాన్యముంటుంది. ప్రతి పాత్ర ఒక మంచి సందేశాన్ని ఇస్తుంది, యోగేశ్‌కు మంచి పేరు తెచ్చిపెట్టే చిత్రం అవుతుంది' అని చెప్పారు. 'ఇదొక సరికొత్త తరహాలో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్. యాక్షన్‌తో పాటు ప్రేక్షకులను అలరించే అన్ని హంగులు ఉన్నాయి. సన్నీలియోన్ నటన ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ' అని నిర్మాతలు తెలిపారు.

ధర్మం ఎప్పుడూ దారి తప్పదు



అభినవ శౌర్య, నరసింహ, అనుశ్రీ, రఘు కుంచె ప్రధాన పాత్రధారులుగా పుష్యమి ఫిల్మ్ మేకర్స్ బ్యానర్‌పై స్వీయ నిర్మాణంలో బెల్లం రామకృష్ణారెడ్డి రూపొందించిన చిత్రం 'దేవగుడి'. ఈనెల 30న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని చిత్రబృందం విడుదల చేసింది. 'ధర్మం ఎప్పుడూ దారి తప్పదు.. నా ధర్మ కూడా ఎప్పుడూ దారి తప్పదు'.. 'కొడుకా? కులమా? అంటే కులమే ముఖ్యం..' వంటి సంభాషణలు ఆకట్టుకున్నాయి. బెల్లం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంలో స్నేహం, ప్రేమ, కుటుంబ భావోద్వేగాలు వంటి అన్ని అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. నిజ జీవిత ఘటనల ఆధారంగా మంచి కథా కథనాలతో ఈ చిత్రం రూపొందించాను. ఈనెల 30న విడుదలవుతోంది. అందరూ చూడాలని కోరుతున్నా' అని అన్నారు. హీరో అభినవ్ శౌర్య మాట్లాడుతూ 'డైరెక్టర్ గారు ప్రతి సన్నివేశాన్ని ఎంతో జాగ్రత్తగా మలిచారు. చిన్న చిత్రాలను ఆదరిస్తేనే మాలాంటి కొత్త వారికి అవకాశాలొస్తాయి' అని అన్నారు.



'చాయ్ వాలా' విజయం ఖాయం

సీపీ సజ్జనార్

శివ కందుకూరి కథానాయకుడిగా ప్రమోద్ హర్ష తెరకెక్కించిన చిత్రం 'చాయ్ వాలా'. రాధా వి పాపుడిప్పు నిర్మించారు. రాజీవ్ కనకాల, తేజు అశ్విని, రాజ్‌కుమార్ కసిరెడ్డి, చైతన్య కృష్ణ, వడ్లమాని శ్రీనివాస్ కీలక పాత్రల్లో నటించారు. ఫిబ్రవరి 6న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం టైటిల్ సాంగ్‌ని ఆవిష్కరించింది. హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్, నీలోఫర్ కేఫ్ వ్యవస్థాపకులు బాబురావు, కిమ్స్ ఎండీ రవికిరణ్ వర్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సజ్జనార్ మాట్లాడుతూ 'మన జీవితంలో చాయ్ అనేది ఎంతో ముఖ్యమైనది. నీలోఫర్ బాబుగారు ఎందరికో స్ఫూర్తి. ఆయన ఈ మూవీని ఎక్కువగా ప్రమోట్ చేయాలి. అందరూ ఈ సినిమాని చూడాలి. ఈ చిత్రం విజయం సాధిస్తుందనే నమ్మకం నాకు ఉంది' అని అన్నారు. 'ఈ చిత్రంలో తండ్రీ కొడుకుల భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. టైటిల్ సాంగ్ బాగుంది. శివ కందుకూరి లాంటి యువ కథానాయకుడు, రాజీవ్ కనకాల వంటి సీనియర్ నటులు ఇందులో నటించారు' అని రాజ్ కందుకూరి తెలిపారు.



విడుదలకు సిద్ధం

సూర్య శ్రీనివాస్, సంజీవ్ కుమార్ ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'జమాన'. భాస్కర్ జక్కుల దర్శకత్వం వహించారు. తేజస్వి అడప నిర్మించారు. ఈ నెల 30న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా భాస్కర్ జక్కుల మాట్లాడుతూ 'జమాన' సినిమా విభిన్నంగా ఉంటుంది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఉంటూ ప్రేక్షకులకు వినోదాన్ని పంచుతుంది. నేటి యువతం ఆలోచనలకు అద్దం పడుతుంది. కచ్చితంగా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. ఓ ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తుంది' అని చెప్పారు. 'ఈ చిత్రం నా కెరీర్‌లోనే ప్రత్యేకం. ప్రేక్షకులను ఒక్క క్షణం కూడా చూపుతిప్పుకోనివ్వకుండా ఉంటుంది. ప్రతి సన్నివేశం అలరిస్తుంది' అని సూర్య శ్రీనివాస్ అన్నారు. 'జమాన' చిత్రం మంచి థ్రిల్లర్. అందరికీ నచ్చే కంటెంట్‌తో రూపొందించాం' అని తేజస్వి అడప తెలిపారు.



వైద్య విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతికి మణిహారంగా ఎయిమ్స్

అనతి కాలంలోనే రోగులకు మెరుగైన సేవలు

ఆస్పత్రి వార్షికోత్సవంలో మంత్రి సత్యకుమార్

మంగళగిరి సిటీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చెందుతున్న అమరావతికి మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రి మణిహారంగా నిలవనుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శనివారం మంగళగిరి ఎయిమ్స్ 8వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన ప్రసంగించారు. మంగళగిరి ఎయిమ్స్ అనతి కాలంలోనే రోగులకు మెరుగైన సేవలు అందిస్తూ విశ్వాసం పొందిందన్నారు. ఎయిమ్స్ అభివృద్ధికి పూర్తి సహకారాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. 190 ఎకరాల్లో కేటాయించాల్సిన మరో 10 ఎకరాలను ప్రభుత్వం త్వరగా కేటాయించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీనివల్ల ట్రామాకేర్ కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. పీపీపీ విధానంలో వైద్యకళాశాలలను నడపాలని కూటమి ప్రభుత్వం నిర్ణయిస్తే, విషప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పీపీపీ విధానంలో నడిచే వైద్య కళాశాలలపై యాజమాన్య హక్కులు ప్రభుత్వం వద్దనే ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ నళిని పార్థసారథి కంబైన్డ్ కంబాట్ మెడికల్ సర్వీసెస్ ఆఫ్ సీపీఎంఎఫ్ఎస్ డాక్టర్ ఆర్ ఎస్ రాథోడ్, మంగళగిరి ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఏఎస్ సింగ్, ఎన్టీఆర్ వర్సిటీ ఉపకులపతి చంద్రశేఖర్, ఎయిమ్స్ అధ్యక్షుడు మేజర్ జనరల్ తపన్‌కుమార్ సింగ్ పాల్గొన్నారు.

కోర్టుకు 'లిక్కర్' కార్లు

ఎన్నికల కోసం డబ్బు తరలించేందుకు ప్రత్యేక అరలు

విజయవాడ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో మద్యం కుంభకోణం డబ్బులను తరలించిన కారులను సిట్ అధికారులు శనివారం విజయవాడ కోర్టుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని అరెస్టు చేసిన తర్వాత నిందితులు ఇచ్చిన సమాచారంతో ఒక హోండా సిటీ, 2 బీఎండబ్ల్యూ కారులను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు ఇవి పోలీసు కమిషనర్ కార్యాలయం ఆవరణలో ఉన్నాయి. ఈ వాహనాలను తీసుకురావాలని ఏసీబీ కోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీంతో సిట్ సిబ్బంది ఈ మూడు కారులను కోర్టుకు తీసుకెళ్లారు. కోర్టు కార్యాలయ సిబ్బంది ఈ వాహనాలను పరిశీలించారు. నోట్ల కట్టలను అమర్చడానికి బీఎండబ్ల్యూ కారుల్లో ప్రత్యేకంగా అరలు ఏర్పాటు చేయించారు. ఈ కారులను సిట్ సిబ్బంది కోర్టుకు అప్పగించారు.

బట్టమేక.. నువ్వెక్కడ?

కనుమరుగవుతున్న అరుదైన పక్షిజాతి



- 1989నాటికి రాష్ట్రంలో 150 గుర్తింపు
- నంద్యాల జిల్లా రోళ్లపాడు స్థావరం
- సంరక్షణకు అభయారణ్యం ఎంపిక..
- చివరగా 2020లో కనిపించిన బట్టమేక
- ప్రస్తుతం వాటి జాడే లేని వైనం
- దేశవ్యాప్తంగా తగ్గిపోయిన సంఖ్య
- సంరక్షణకు శ్రీకారం చుట్టిన అటవీశాఖ

కృత్రిమ గర్భధారణ ద్వారా పక్షుల సంతతి వృద్ధికి ప్రయత్నాలు

రైతన్నలకు తోడుగా..

జనసంచారం లేని గడ్డి మైదానాల్లో, వ్యవసాయ యోగ్యమైన పొలాల్లో ఇవి సంచరిస్తుంటాయి. పంటలను నాశనం చేసే క్రిమికీటకాలను తిని రైతన్నలకు తోడుగా నిలుస్తాయి. ఈ పక్షులు ఎక్కువగా ఒంటరిగానే సంచరిస్తాయి. అరుదుగా గుంపుగా మేస్తూ కనిపిస్తాయి. వివిధ పంటల కోత తర్వాత మిగిలిన మోములు, వేళ్లు, పొలాల్లోని మిడతలు, పురుగులు, జెర్రులు, బల్లులు, తొండలు తదితర వాటిని ఇవి ఆహారంగా తీసుకుంటాయి.

(ఆత్మకూరు-ఆంధ్రజ్యోతి)

పొడవాటి తెల్లటి మెడ.. దాని చుట్టూ తెలుపు, నలుపు ఈకల హారం.. గోధుమ వర్ణపు వీపు.. తలపై నల్లని టోపీ ఆకారంతో ఇట్టే ఆకర్షించే రూపం బట్టమేక (గ్రేట్ ఇండియన్ బస్టర్డ్) పక్షుల సొంతం. విమానం తరహాలో నేలపై పరుగులు తీసి.. గాల్లోకి లేచి స్థిమితంగా, లయబద్ధంగా విశాలమైన రెక్కలను కదిలిస్తూ గగన విహారం చేయడం వీటి ప్రత్యేకత. ప్రపంచంలోనే అరుదైన పక్షిజాతుల్లో బట్టమేక పక్షి ఒకటి. దీని శాస్త్రీయ నామం ఆర్డియోటిస్ నైగ్రిసెప్స్. మనదేశంలోనూ ఈ పక్షులు అంతరించిపోయే స్థితికి చేరాయి. కొన్ని ప్రాంతాల్లో కొన్నేళ్లుగా వీటి జాడ కనిపించడం లేదు. 2008 నాటికి ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో 300లోపు ఉండేవి. ప్రస్తుతం ఆ సంఖ్య 150కి పడిపోయినట్లు తెలుస్తోంది. అందులోనూ.. ఎక్కువ పక్షులు రాజస్థాన్‌లోనే ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 20కి పైగా బట్టమేక పక్షిజాతులు ఉండగా.. మనదేశంలోనే 4 జాతులు ఉన్నాయి. ఒకప్పుడు మన రాష్ట్రంలో ఉన్నవి అరుదైన జాతికి చెందినవి.

నాడు 150 పక్షులు.. నేడు జాడే కరువు

రాష్ట్రంలో బట్టమేక పక్షి ప్రధాన స్థావరంగా నంద్యాల జిల్లాలోని నందికొట్కూరు సమీపంలోని రోళ్లపాడు వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని గుర్తించారు. 1979లో బాంబే రీసెర్చ్ వారు బట్టమేక ప్రాధాన్యాన్ని గుర్తించారు. ప్రముఖ పక్షిజాతి శాస్త్రవేత్త సలీం అలీ 1980లో రోళ్లపాడు వద్ద బట్టమేక పక్షిని సంరక్షించేందుకు చర్యలు చేపట్టారు. 1988లో సుమారు 927 హెక్టార్లలో అభయారణ్యాన్ని ఎంపిక చేశారు. 1989లో అక్కడ 150 బట్టమేక పక్షులు ఉన్నట్లు గుర్తించారు. చివరగా 2020లో ఒక పక్షి కనిపించింది. ప్రస్తుతం వాటి జాడే లేదు.





ఏడాదికి ఒక గుడ్డే..

బట్టమేక పక్షుల సంతతి చాలా అరుదుగా వృద్ధి చెందుతుంది. ఈ జాతి పక్షులు ఆడ, మగవి జతకట్టి సంచరించవు. మగ పక్షి, ఆడపక్షి ఎదురైన సందర్భంలోనే ఇవి కలుస్తాయి. సాధారణంగా మార్చి, సెప్టెంబరు మధ్య కాలంలో గుడ్లు పెడతాయి. ఒక్కో ఆడపక్షి ఏడాదికి కేవలం ఒక గుడ్డు మాత్రమే పెట్టి, దట్టమైన పొదల్లో 25 నుంచి 30 రోజుల వ్యవధిలో పొదుగుతుంది. ఒక్కోసారి అరుదుగా రెండు గుడ్లు కూడా పెడతాయి. ఒక్కో ఆడపక్షి తన జీవితకాలంలో కేవలం ఐదారు గుడ్లు పెడతాయి. వీటి సగటు జీవిత కాలం సుమారు 15-16 ఏళ్లు. ఈ పక్షులు అత్యంత బలిష్టమైనవి. మీటరు పొడవు, 15-18 కిలోల బరువు, రెక్కల పొడవు 210 నుంచి 250 సెంటీమీటర్లు, అలాగే పొడవాటి మెడను కలిగి ఉంటాయి. నిర్దిష్టమైన ఎత్తులో మాత్రమే ఇవి విహరిస్తాయి.

కృత్రిమ గర్భధారణపైనే ఆశలు

వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ద్వారా బస్టర్డ్ రికవరీ ప్రోగ్రామ్‌లో భాగంగా 2018లో తొలిసారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో బట్టమేక పక్షి కృత్రిమ గర్భధారణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 2024లో కృత్రిమ గర్భధారణ వల్ల మొదటిసారిగా ఒక ఆడపక్షి పుట్టింది. ఈ విధానంతో రోళ్లపాడు అభయారణ్యంలో బట్టమేక పిల్లలను పుట్టించి, గడ్డి మైదానాల్లో వదలాలని అటవీ శాఖ భావిస్తోంది.

మారిన పరిస్థితులు

రోళ్లపాడు అభయారణ్యం పరిసరాల్లో ఒకప్పుడు గడ్డి భూములు అధికంగా బట్టమేక పక్షుల సుస్థిరమైన ఆవాసానికి కీలకంగా ఉండేవి. అదేక్రమంలో అక్కడి వ్యవసాయ భూముల్లో కూడా రైతులు వేరుశనగ పంటను విస్తారంగా సాగుచేసేవారు. అయితే ప్రస్తుతం పరిస్థితులు మారాయి. రోళ్లపాడు పరిసర మైదాన ప్రాంతాల్లో విండ్ ఎనర్జీ కోసం గాలిమరలు, వందలాది ఎకరాల్లో సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. అందుకు అనుగుణంగా విద్యుత్ లైన్లను అమర్చారు. అలాగే కొంతకాలంగా వేరుశనగ పంటకు బదులు మొక్కజొన్న పంటను అధికంగా సాగుచేస్తున్నారు. ఇందుకు రసాయన, క్రిమిసంహారక మందులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఇక వేటగాళ్ల ఉచ్చులతో పాటు గడ్డి భూముల్లో పాడిపశువులు, మనుషుల సంచారం అధికమైంది. దీనివల్ల గడ్డిమైదానాలు క్షీణిస్తున్నాయి. ఇవి బట్టమేక పక్షి ఆవాసానికి ఆటంకాలుగా మారాయి. దీంతో వాటి ఆచూకీ లేకుండా పోయాయని, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాయని అటవీ అధికారులు భావిస్తున్నారు.

సంరక్షణకు చర్యలు

రోళ్లపాడు అభయారణ్యంలో బట్టమేక పక్షుల ఉనికిని తిరిగి సుస్థిర పరిచేందుకు అటవీ శాఖ తరఫున అన్ని విధాలుగా కసరత్తు చేస్తున్నాం. ఇక్కడ బట్టమేక పక్షి ఉనికి లేకపోవడంతో గుడ్లను సేకరించి కృత్రిమ గర్భధారణ ద్వారా వృద్ధి చేయాలని భావిస్తున్నాం. అదేక్రమంలో రోళ్లపాడు అభయారణ్యంలో గడ్డి నెమలి (లెసర్ ఫ్లోరికన్)ని గుర్తించాం. బట్టమేక పక్షులను సంరక్షిస్తే గడ్డి నెమళ్ల సంతతి కూడా వృద్ధి చెందే అవకాశం ఉంది.

- విఘ్నేష్ అప్పావ్, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్



సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి టేకు రథం

మొక్కు చెల్లించుకున్న నిర్మాత అట్లూరి

మోపిదేవిలో దేవస్థానానికి అప్పగించిన అట్లూరి, నారా రోహిత్

మోపిదేవి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ముఖ్యమంత్రి కావాలని, మంగళగిరిలో లోకేశ్ భారీ మెజార్టీతో విజయం సాధించాలని మొక్కుకున్న సినీ నిర్మాత అట్లూరి నారాయణరావు.. అవి నెరవేరడంతో మొక్కు చెల్లించుకున్నారు. కృష్ణా జిల్లా మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కోటి రూపాయల వ్యయంతో తయారు చేసిన టేకు రథాన్ని హీరో నారా రోహిత్‌తో కలిసి శనివారం దేవస్థానానికి అప్పగించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైలులో ఉంచిన సమయంలో తాను స్వామివారికి మొక్కుకున్నానని అట్లూరి చెప్పారు. స్వామి వారికి శాశ్వత రథం లేదని అర్చకులు చెప్పడంతో, రథాన్ని సమకూర్చినట్టు తెలిపారు. కోనసీమ జిల్లా ముమ్మిడివరానికి చెందిన రామేశ్వరరావు, శ్రీనివాసరావుల బృందం 23రోజుల్లో ఈ రథాన్ని తయారు చేసింది. శనివారం వేదమంత్రాల నడుమ విశేష అభిషేకాలు నిర్వహించి, రథంపై కలశాన్ని అమర్చి ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు అప్పగించారు.



అనంత ఆణిముత్యాలు పురస్కారం అందుకుంటున్న తెలంగాణ సీఎస్ రామకృష్ణారావు. వేదికపై సినీనటుడు బ్రహ్మానందం తదితరులు

ఎంత ఎదిగినా మూలాలు మరవొద్దు

- తెలంగాణ సీఎస్ రామకృష్ణారావు సూచన
- ఆయన సహా 21 మందికి 'అనంత ఆణిముత్యాలు' పురస్కారాల ప్రదానం

హిందూపురం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఎంత ఎత్తు ఎదిగినా, ఎంత ఉన్నత స్థాయికి చేరినా మన మూలాలను మరువకూడదని తెలంగాణ సీఎస్ కె.రామకృష్ణారావు సూచించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో సాహితీ గగన్ మహల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం 21 మంది ప్రముఖులను 'అనంత ఆణిముత్యాలు' పురస్కారాలతో సత్కరించారు. పురస్కారాలు అందుకున్నవారిలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేశ్‌రెడ్డి, మాజీ డీజీపీ కె.అరవిందరావు, తెలంగాణ సీఎస్ రామకృష్ణారావు తదితరులున్నారు. సినీ నటుడు బ్రహ్మానందం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రామకృష్ణారావు మాట్లాడుతూ మనం ఎంత ఎత్తుకు ఎదిగినా, జన్మభూమిని మరువకూడదన్నారు. తాను కుగ్రామంలో జన్మించానని, 16ఏళ్ల వయసు వచ్చేవరకు కరెంటు చూడలేదని మాజీ డీజీపీ అరవిందరావు పేర్కొన్నారు. గోడకు ఉన్న ల్యాంపునకు ఒకవైపు చెల్లెలు, మరోవైపు తాను నిలబడి చదువుకున్నామని తెలిపారు. గ్రంథాలయంలో రూపాయి కట్టి, పుస్తకాలు చదివి ఐపీఎస్ అయ్యానన్నారు. పిల్లలకు ఏ రంగంలో ఉత్సాహం ఉంటే దానివైపు ప్రోత్సహించాలని సూచించారు. బెంగళూరు ఐఐఎస్‌సీ శాస్త్రవేత్త యాదాటి నరహరి, టెక్ కంపెనీ సంస్థాపకుడు విశ్వనాథ్ ఏల్లూరి, హైదరాబాద్‌కు చెందిన జేజే ఆస్పత్రి వ్యవస్థాపకుడు జయంత్‌రెడ్డి తదితరులు పురస్కారాలు అందుకుని ప్రసంగించారు.

సీసీ కెమెరా పెడితే దొరికిపోతామని..!



పథకం ప్రకారమే భర్తను చంపేసింది

గుంటూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా దుగ్గిరాల పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలువూరులో ఈ నెల 18వ తేదీ రాత్రి ఉల్లిపాయల వ్యాపారి లోకం శివనాగరాజు హత్య పక్కా పథకం ప్రకారమే జరిగినట్లు తేలింది. శివనాగరాజు హత్యకు ఆయన భార్య లక్ష్మీ మాధురి కొద్ది కాలం క్రితమే పథకం రూపొందించినట్లు వెల్లడైంది. పోలీసుల కథనం మేరకు.. లక్ష్మీ మాధురికి పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం లక్కరాజు గార్లపాడు చెందిన గోపీతో వివాహేతర సంబంధం కొనసాగుతున్న విషయం భర్తకు తెలియడంతో కొంతకాలం నుంచి భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. భార్యను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవాలనే ఉద్దేశంతో ఇంటికి సీసీ కెమెరాలు పెట్టాలని తన స్నేహితుడిని శివనాగరాజు సంప్రదించాడు. ఇంటికి సీసీ కెమెరా పెడితే రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోతామని, అప్పుడు భర్త నుంచి తనకు ప్రమాదమని భావించిన భార్య, సాధ్యమైనంత త్వరగా భర్తను అడ్డుతొలగించుకోవాలనుకుంది. ప్రియుడు గోపీతో కలిసి పథక రచన చేసింది. ముందుగా, తన స్వగ్రామం కృష్ణాజిల్లాలోని అత్తమూరు కావడంతో, అక్కడ స్థానిక బంటుమిల్లి పోలీస్ స్టేషన్లో భర్తపై ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇరువురికి సర్ది చెప్పిన క్రమంలో.. పుట్టింటివారు కట్నంగా ఇచ్చిన ఆస్తిని తన పేరుతో రాయాలని ఆమె షరతు విధించి భర్తను అందుకు ఒప్పించింది. ఈమేరకు పొలాన్ని తన పేరుతో రాయించుకున్న లక్ష్మీమాధురి, తర్వాత భర్త హత్యకు స్కెచ్ వేసింది. బలిష్టంగా ఉండే శివరాజును చంపడానికి మత్తుమాత్రలు ఇవ్వడమే మార్గమని భావించి, హైదరాబాదులో కారు ట్రావెల్స్ నిర్వహిస్తున్న ప్రియుడు గోపీని సంప్రదించింది. దీంతో అతడు సత్తెనపల్లిలో తనకు పరిచయం ఉన్న ఆర్ఎంపీతో కలిసి హత్యకు ప్రణాళిక రచించాడు. అతడి సూచన మేరకు ఆర్ఎంపీ వైద్యుడు సత్తెనపల్లిలో మత్తు బిళ్లలు కొనుగోలు చేశాడు. అనంతరం గోపీ, ఆర్ఎంపీ కలసి చిలువూరు వెళ్లి వాటిని లక్ష్మీ మాధురికి అందించారు. ఆమె బిర్యానీ వండి అందులో 20కి పైగా మత్తు బిళ్లలు కలపడంతో బిర్యానీ తిన్న భర్త మత్తులోకి జారుకున్నాడు. ఈ విషయయాన్ని లక్ష్మీ మాధురి వెంటనే గోపీకి తెలపడంతో అతడు ఆర్ఎంపీతో కలిసి ఆమె ఇంటికి వెళ్లాడు. ముగ్గురూ కలిసి శివనాగరాజును హత్య చేశారు. అయితే సహజ మరణంగా చిత్రీకరించాలనుకున్న వారి పథకం బెడిసి కొట్టడంతో మొత్తం వ్యవహారం బయటపడింది. పోలీసులు లక్ష్మీమాధురితోపాటు, మిగిలిన ఇద్దరినీ అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

'నాగవైష్ణవి' హత్య కేసులో సుప్రీంకోర్టుకు..!

- బెజవాడ పోలీసుల యోచన

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

చిన్నారి నాగవైష్ణవి కిడ్నాప్, హత్య కేసులో పోలీసులు సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నారు. ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న పంది వెంకటరావును హైకోర్టు ఇటీవల నిర్దోషిగా పేర్కొంటూ తీర్పు చెప్పింది. దీనిపై హోంశాఖలో చర్చ జరిగినట్టు తెలిసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లాలనే యోచనలో ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ అధికారులు ఉన్నట్లు సమాచారం. 2010లో విజయవాడ అయోధ్యనగర్‌కు చెందిన పలగాని నాగవైష్ణవి (10) తన సోదరుడితో కలిసి బడికి వెళ్తుండగా కొంతమంది కిడ్నాప్ చేశారు. ఆ బాలికను చంపేసి, గుంటూరులోని కార్ఖానా బాయిలర్‌లో వేసి కాల్చేశారు. ఈ ఘటనను తట్టుకోలేక ఆమె తండ్రి ప్రభాకర్‌గౌడ్ గుండెపోటుతో మరణించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి, ప్రభాకర్ బావమరిది(మొదటి భార్య సోదరుడు) పంది వెంకటరావుతో పాటు ఎం.శ్రీనివాసరావు, వై.సాగర్ అలియాస్ జగదీష్‌లను నిందితులుగా నిర్ధారించారు. విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు 2018లో ఈ ముగ్గురికి జీవిత ఖైదు విధించింది. దీనిపై నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన హైకోర్టు.. వెంకటరావును నిర్దోషిగా ప్రకటించింది.

మళ్లీ పంజా విసిరిన పులి


తాజాగా మరో రెండు గేదెదూడలు హతం

- ఇప్పటి వరకు ఏడు పశువులు మృత్యువాత

బుట్టాయగూడెం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా బుట్టాయగూడెం ఏజెన్సీ ప్రాంతంలో పెద్దపులి నాలుగు రోజులుగా పశువులను చంపుతూనే ఉంది. తాజాగా శనివారం తెల్లవారుజామున గుర్రప్పగూడెంలో కుంజా ప్రసన్న అనే గిరిజనుడికి చెందిన పశువుల మందపై దాడిచేసింది. రెండేళ్ల వయస్సు గేదెదూడను చంపి, దూరంగా లాక్కుపోయి వెనుక భాగం మొత్తాన్ని తినేసింది. మెట్టగూడెంలో యంత్రప్రగడ నరేంద్రకు చెందిన పశువులపై దాడి చేసి ఏడాది వయసున్న గేదె దూడను చంపేసింది. 21న ఏజెన్సీలో ప్రవేశించిన పులి శనివారం వరకు ఏడు పశువులను చంపినట్టు అటవీశాఖ అధికారులు తెలిపారు. పులి జాడ కోసం వారు గాలిస్తున్న సమయంలోనే పడమట రేగులకుంట-అంతర్వేదిగూడెం గ్రామాల మధ్య బైనేరు వాగుపై నిర్మించిన వంతెన కింద పులి సేదదీరుతూ ఉండడాన్ని పలువురు ప్రయాణికులు చూశారు. భయంతో కేకలు వేయడంతో పులి చెంచుగూడెం వైపుగా వెళ్లినట్లు సమాచారం. శుక్రవారం రాత్రి అంతర్వేదిగూడెం- పందిరిమామిడిగూడెం మధ్య పులి రోడ్డు దాటుతుండగా వాహనంలో వెళుతున్నవారు ఫోన్‌లో ఫొటో తీశారు. పులి సంచారంతో వ్యవసాయ పనులకు వెళ్లడానికి కూలీలు భయపడుతున్నారు. పులిని పట్టుకోడానికి అన్ని ప్రయాత్నాలూ చేస్తున్నామని, అంతర్వేదిగూడెం, పందిరిమామిడి గూడెం, నాగులగూడెం, గుర్రప్పగూడెం, మెట్టగూడెం, తాడితోట,బుట్టాయగూడెం, ముప్పినవారిగూడెం, పడమట రేగులకుంట ప్రాంతాల్లో పులి సంచరిస్తోందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారి దుర్గాకుమార్ బాబు తెలిపారు.



అంతర్వేదిగూడెం-పందిరిమామిడిగూడెం గ్రామాల మధ్య రోడ్డు దాటుతున్న పులి (వాహన ప్రయాణికులు తీసిన ఫొటో)



రాజధానిలోని రాయపూడి ప్రాంతంలో రిపబ్లిక్ డే వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన వేదిక



25 వేల అడుగుల జాతీయ జెండా

రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో శనివారం వందేమాతరం 150 ఏళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పర్యాటక మంత్రి దుర్గేశ్ హాజరయ్యారు. వందేమాతరం స్ఫూర్తిని కొనసాగించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా స్టూడెంట్ యునైటెడ్ నెట్‌వర్క్ సంస్థ అధ్యక్షుడు బసవ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న 25 వేల చదరపు అడుగుల త్రివర్ణ పతాకాన్ని వర్సిటీ ప్రాంగణంలో ప్రదర్శించారు. ఈ ర్యాలీ విశేషంగా ఆకట్టుకుంది. - దివాన్‌చెరువు, ఆంధ్రజ్యోతి



భోజనం బాగుందా?

▸▸ **హాస్టల్ విద్యార్థులతో చంద్రబాబు**

నగరిలోని రెండు బాలికలు, ఒక బాలుర ఎస్సీ హాస్టల్ ఉన్న ప్రాంగణాన్ని సీఎం చంద్రబాబు తనిఖీ చేశారు. హాస్టల్ ఆవరణలో మొక్కలు నాటారు. హాస్టల్లో వసతి, భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన విద్య అందిస్తున్నారా లేదా అని తెలుసుకున్నారు. విద్యార్థుల గదులను పరిశీలించి దుప్పట్లు ఉన్నాయా.. ఇంకా ఏమేమి సమస్యలు ఉన్నాయని అడిగారు. దుప్పట్లు పంపిణీ చేశారని, తమకు అనుకూలంగా హాస్టల్ ఉందని విద్యార్థులు చెప్పారు. బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సీఎం ఆకాంక్షించారు.

నగరిలోని బాలికల వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అమరావతిని అడ్డుకోలేరు

(మొదటి పేజీ తరువాయి)

పెంచిందని విమర్శించారు. వైసీపీ వేసిన రూ.4,600 కోట్ల డ్యూటీ ఫీజును ప్రజలపై భారం పడకుండా తమ ప్రభుత్వం రద్దు చేసినట్లు చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని తెలిపారు. దేశంలోని వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం మనకే వచ్చాయన్నారు. ఐదు దశాబ్దాలుగా తాను రాజకీయాల్లో ఉన్నానని, 94 శాతం అభ్యర్థులు గెలవడం ఎప్పుడూ చూడలేదని అన్నారు. తాను ఈ సారి చేయగలుగుతున్న అభివృద్ధి గత మూడు దఫాల్లో చేయలేకపోయానన్నారు.

నాడు అన్నింటా నిర్లక్ష్యం

'రాజకీయ పార్టీ నడిపే వ్యక్తులు బాధ్యతగా మాట్లాడాలి. జల్ జీవన్ మిషన్‌లో రూ.లక్ష కోట్ల మేర వాడుకునే అవకాశం ఉన్నా గతంలో నిర్లక్ష్యంతో వదిలేశారు. కేంద్ర పథకాలన్నీ నిర్వీర్యం చేశారు. రాష్ట్రాన్ని గంజాయికి కేంద్రంగా మార్చారు' అంటూ గత వైసీపీ ప్రభుత్వ తీరుపై చంద్రబాబు మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చాక ఈగల్ వ్యవస్థను పెట్టి గంజాయిని కట్టడి చేశామన్నారు. 'పోలవరం డయాఫ్రం వాల్‌ను వరదల్లో కొట్టుకుపోయేలా చేశారు. ఇప్పుడు మళ్లీ నిర్మించి 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. రాయలసీమ వరకు నీళ్లను తెస్తాం' అని స్పష్టం చేశారు.

దేవుడి నెయ్యినీ కల్తీ చేశారు

ప్రభుత్వ ఉద్యోగులకు కూడా గత జగన్ ప్రభుత్వం రూ.వేల కోట్ల బకాయిలు పెట్టిందని చంద్రబాబు విమర్శించారు. తాము విడతల వారీగా నిధులు ఇస్తున్నామని తెలిపారు. పేదలకు అన్నం పెట్టే అన్నా క్యాంటీన్లను కూడా మూసేశారని, ఆఖరికి దేవుడి నెయ్యినీ కల్తీ చేశారని మండిపడ్డారు. 'సూపర్ సిక్స్ పథకాల అమలు అసాధ్యమని విమర్శించారు. కూటమి ప్రభుత్వం సూపర్ హిట్ చేసి చూపించింది. ఏడాదికి రూ.33 వేల కోట్లను పేదల కోసం పంపిణీ చేస్తున్నాం. ప్రతి నెలా ఒకటో తేదీన పెన్షన్లను పంపిణీ చేస్తున్నాం. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిత్యం పనిచేయాలనే ఉద్దేశంతోనే పేదల సేవలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం' అని చంద్రబాబు అన్నారు.

కార్యకర్తలను మరచిపోను

టీడీపీకి ఉన్నంతమంది కార్యకర్తలు ప్రపంచంలో ఏ పార్టీకీ లేరని సీఎం చంద్రబాబు అన్నారు. నగరిలో ఎస్సీ హాస్టల్‌కు వెళ్లి సోలార్ ప్లాంటును పరిశీలించారు. కార్యకర్తల సమావేశంలో సుదీర్ఘంగా మాట్లాడారు. 'టీడీపీకి ఉన్న కార్యకర్తలు ఏ పార్టీకి లేరు. మిమ్మల్ని మరచిపోను. ఏ కష్టం వచ్చినా ఆదుకుంటాను. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసి విజయం సాధించాలి.' అన్నారు.

స్వచ్ఛాంధ్ర.. మన జీవన విధానం కావాలి

▸▸ **సహకరిస్తే రాష్ట్రాన్ని నంబర్ వన్ చేస్తా: చంద్రబాబు**

స్వచ్ఛాంధ్ర అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, మన జీవన విధానం కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. 'పీల్చే గాలి, తినే తిండి, తాగే నీళ్లు.. ఇలా అన్నీ పరిశుభ్రంగా, కాలుష్యరహితంగా ఉండాలి. ఇవన్నీ కావాలంటే మన ఆలోచనలు స్వచ్ఛంగా ఉండాలి. స్వచ్ఛమైన ఆలోచనల్లేని నేరస్థులు పాలిస్తే ఎలా ఉంటుందో గత ఐదేళ్లు చూశాం. స్వచ్ఛాంధ్ర విషయంలో మీరంతా సహకరిస్తే వచ్చే ఐదేళ్లలో రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా తయారు చేస్తాను. దేశాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు మోదీ స్వచ్ఛ భారత్ తెచ్చారు. గతంలో మనం కూడా జన్మభూమి, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలతో స్వచ్ఛత కో సం పనిచేశాం. పరిశుభ్రత విషయంలో మనందరి ఆలోచనలు మారాలి.



నగరిలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

పాఠశాలల్లో విద్యార్థులు పరిశుభ్రంగా ఉండేందుకు ముస్తాబు అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టాం. దీంతో విద్యార్థులకు ఆరోగ్యంతో పాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. నగరాల్లో భారీ స్వీపింగ్ యంత్రాలను వినియోగిస్తున్నాం. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో 97.26 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 62 శాతం ఇంటింటి నుంచి చెత్త సేకరణ జరుగుతోంది. మార్చి నాటికి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ వంద శాతం సేకరణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. వ్యర్థాల నుంచి విద్యుత్తు తయారీ యూనిట్లు ఇప్పటికే నాలుగు ఉన్నాయి. రాజమండ్రి, విజయవాడలో మరో రెండు ప్రారంభించనున్నాం. ప్లాస్టిక్, ఈ-వేస్ట్‌ను సేకరించేందుకు 130 స్వచ్ఛ రథాలను ఏర్పాటు చేశాం. ఆయా ప్రాంతాల్లో ఈ వాహనాలు పర్యటించి చెత్త తీసుకుని నిత్యావసరాలు అందిస్తాయి. మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా 660 స్వచ్ఛ రథాలను తీసుకొస్తాం' అని అన్నారు.

గత ప్రభుత్వ చెత్తను తొలగిస్తున్నాం

రూ.573 కోట్లతో స్వచ్ఛాంధ్ర కోసం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేశామని చంద్రబాబు చెప్పారు. 110 ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ల ఏర్పాటుకు రూ.510 కోట్లు ఖర్చు చేశామన్నారు. కంపోస్ట్ తయారీ కోసం డస్ట్‌బిన్లను ఇస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ కోసం ఈ-ఆటోలు, ట్రై సైకిళ్లు, తోపుడు బండ్లను ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను పట్టణ ప్రాంతాల్లో వదిలేసి వెళ్లిపోవడంతో భూమి, భూగర్భ జలాలతో పాటు వాయు కాలుష్యం పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పుడు ఆ వ్యర్థాలన్నీ తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పిస్తున్నట్లు చెప్పారు.

రాబోయే రోజుల్లో ఏఐ డాక్టర్..

'గతంలో నేను టెక్నాలజీ అంటే అవహేళన చేశారు. ఇప్పుడు అదే టెక్నాలజీ మన సంపదను పెంచింది. రాబోయే రోజుల్లో ఏఐ డాక్టర్ ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై దృష్టి పెట్టే పరిస్థితి వస్తుంది. సంజీవని ప్రాజెక్టు ద్వారా అందరి ఆరోగ్యం కాపాడే ప్రయత్నం చేస్తున్నాం. గతంలో నిరంతర విద్యుత్తు సరఫరా కోసం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉండగా, ఇప్పుడు పీఎం సూర్యఘర్, కుసుమ్ పథకాల ద్వారా ఇళ్లపైన, పొలాల్లో సోలార్ విద్యుత్తు ఏర్పాటు చేసుకునే పరిస్థితి వచ్చింది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకారం అందిస్తోంది. గ్రీన్ అమ్మోనియా, హైడ్రోజన్‌లాంటివి కూడా ఉత్పత్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నాం. 20 లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జనాభా మన సంపద. గతంలో కుటుంబ నియంత్రణను నేనే ప్రోత్సహించా. ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఎక్కువ మంది పిల్లలుంటేనే ఎన్నిక ల్లో అర్హత అంటున్నాను. దక్షిణాది న అన్ని రాష్ట్రాల్లోనూ జనాభా తగ్గుతోంది. మన వద్ద మాత్రమే జనాభా పెరుగుతోంది' అని సీఎం తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, విప్ థామస్ వేదిక పంచుకున్నారు. జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హెలిప్యాడ్‌లో సీఎంను కలిశారు.



విజయవాడలో నిర్వహించిన భారతీయ జనసంఘ్ జాతీయ సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్

స్వదేశీ విధానంతోనే దేశ ప్రగతి

▸▸ **దీన్ దయాళ్ ఆలోచనలు మోదీ పాలనలో అమలు**

▸▸ **ఏకాత్మ మానవదర్శన పునఃస్మరణ సదస్సులో వక్తలు**

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): స్వదేశీ విధానం, వికేంద్రీకరణ, అంత్యోదయ భావనలే దేశ ప్రగతికి మార్గదర్శకాలని ఏకాత్మ మానవ దర్శన సభలో మేధావులు, వక్తలు అభిప్రాయపడ్డారు. దేశానికి సంబంధించిన అన్ని రంగాల్లోనూ భారతీయత ప్రతిబింబించాలని, మన సంస్కృతి, సామాజిక, ఆర్థిక, ఆధ్యాత్మిక అభివృద్ధి ఏకాత్మ మానవతా వాదంతో సమతుల్యం అవుతుందని పేర్కొన్నారు. విదేశీ ఉత్పత్తులపై ఆధారపడకుండా స్వదేశీ తయారీ పెంచడంతో పాటు వినియోగం పెరగాలని ఆకాంక్షించారు. విజయవాడలో 1965 జనవరి చివరి వారంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ నేతృత్వంలో జరిగిన ఏకాత్మ మానవతా సదస్సులో భావి భారతావనిలో ఆర్థిక, రక్షణ, అందరికీ ఆరోగ్యం, ఆర్టికల్ 370 రద్దు, మహిళా సాధికారత, అంత్యోదయ ఇతర పాలనాపరమైన విధానాలు ఎలా ఉండాలో తీర్మానాలు చేశారు. ఆ సదస్సు జరిగి 60ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏపీ బీజేపీ పునఃస్మరణ సదస్సు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మాట్లాడుతూ.. భారతీయ జనసంఘ్ బలోపేతానికి 1965లో విజయవాడలో పునాది పడిందని, బెజవాడను బీజేపీ ఎన్నటికీ మరిచిపోదని అన్నారు. ఆత్మ, బుద్ధి, మనసు, శరీరాల సమతుల్యతే ఏకాత్మ సిద్ధాంతమని వివరించారు. వికేంద్రీకరణ లేకుండా దేశాభివృద్ధి సాధ్యం కాదని దీన్ దయాళ్ స్పష్టం చేశారని, అవే సిద్ధాంతాలు ప్రస్తుతం ప్రధాని మోదీ పాలనలో అమలు అవుతున్నాయని తెలిపారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ స్వదేశీ విధానంతో దేశం అభివృద్ధి చెందాలన్నదే దీన్ దయాళ్ లక్ష్యమన్నారు. దీన్ దయాళ్ ఇన్‌స్టిట్యూట్ జాతీయ ప్రధాన కార్యదర్శి అతుల్ జైన్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, ఆకలి లేని సమాజం, అందరికీ ఆరోగ్యం వంటి లక్ష్యాలతో సాగిన నాటి ఆలోచనలకు ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం రూపం ఇచ్చిందని వివరించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో బీజేపీ జాతీయ సహ సంఘటనా కార్యదర్శి శివప్రకాశ్, రాజకీయ విశ్లేషకుడు రాకా సుధాకర్, బీజేపీ జాతీయ స్థాయి నేతలు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌తో సీఎం భేటీ

అమరావతి, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. శనివారం సాయంత్రం నగరి పర్యటన ముగించుకుని గన్నవరం విమానాశ్రయం చేరుకున్న చంద్రబాబు అదే సమయంలో ఢిల్లీ వెళ్లేందుకు విమానాశ్రయానికి వచ్చిన మేఘ్వాల్‌తో వీఐపీ లాంజ్‌లో కొద్దిసేపు సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు.

'ఉక్కు' కష్టాలకు త్వరలో ముగింపు: శ్రీనివాసవర్మ

విశాఖపట్నం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటు కష్టాలను అధిగమించి త్వరలో గాడిన పడుతుందని, కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. విశాఖపట్నంలో శనివారం జరిగిన సీఐఎస్ఎఫ్ రోజ్‌గార్ మేళాలో పాల్గొన్నారు. పలు శాఖల్లో ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ ప్రాంత ప్రజల సెంటిమెంట్, కూటమి ప్రభుత్వ అభ్యర్థన మేరకు కేంద్రం తన పాలసీని పక్కనపెట్టి విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు ఆర్థిక సాయం చేసిందన్నారు. దానివల్ల పరిస్థితులు కొంతవరకు మెరుగుపడ్డాయన్నారు. భద్రత విషయంలో ఎక్కడా రాజీపడడం లేదని స్పష్టం చేశారు. వచ్చే నెల 4వ తేదీన కేంద్ర ఉక్కు కార్యదర్శి స్టీల్‌ప్లాంటు సందర్శనకు వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ ఐజీ శరవణన్ తదితరులు పాల్గొన్నారు.

జగన్... మళ్లీ ల్యాండ్ టైట్లింగ్

పేరెత్తే ధైర్యం ఉందా..!

ఆ చట్టం వల్లే వైసీపీకి ఘోర ఓటమి: కేంద్ర మంత్రి పెమ్మసాని



▸▸ **మళ్లీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నేతలు భూములు లాక్కుంటారని జనం భయపడ్డారు**

గుంటూరు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'మళ్లీ అధికారంలోకి వస్తే ల్యాండ్ టైట్లింగ్ యాక్టుని పునరుద్ధరిస్తా. సర్వే రాళ్లపై, పాసు పుస్తకాల్లో నా బొమ్మ వేసుకుంటా... అని చెప్పగలరా జగన్?' అని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశ్నించారు. గుంటూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ప్రజలకు ఒరిజినల్ డాక్యుమెంట్స్ కాకుండా జిరాక్స్ కాపీలు ఇస్తామని చెప్పే ధైర్యం ఉందో, లేదో జగన్ చెప్పాలి. 2029లో జరిగే ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లి తాను అధికారంలోకి వస్తే ల్యాండ్ టైట్లింగ్ యాక్టు తీసుకొచ్చి గతంలో ఏవైతే నిబంధనలు అందులో పొందుపరిచారో, అవన్నీ అమలు చేస్తానని చెబితే అప్పుడు ప్రజలు ఆయన్ని నమ్ముతారో, కూటమి ప్రభుత్వాన్ని నమ్ముతారో తేలుతుంది. అహంకారం, అహంభావం, అసమర్థత వల్ల గత ఎన్నికల్లో ప్రజలు మట్టికరిపించారన్న విషయాన్ని జగన్ జీర్ణించుకోవాలి. ల్యాండ్ సర్వే, రీసర్వే కార్యక్రమం కేంద్ర ప్రభుత్వానిది. ఇది గత ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమైంది. అయితే సర్వే, రీసర్వేని పూర్తి చేయకపోవడం వల్ల ప్రోత్సాహకాల కోసం గత వైసీపీ ప్రభుత్వం దరఖాస్తు చేయలేదు. ఇందులో రైతులకు సంబంధించిన ఫిర్యాదులు లక్షలున్నాయి. వాటిని పరిష్కరించకపోవడం వల్ల ప్రోత్సాహకాల కోసం దరఖాస్తు చేసుకోలేకపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ విషయాన్ని నేను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాను. 2 లక్షల 79 వేల 712 ప్రజా ఫిర్యాదులను గ్రామసభల ద్వారా పరిష్కరించాలని చెప్పాను. ఇందులో భూమి కొలతల్లో వ్యత్యాసాలు 99 వేలు, జాయింట్ ల్యాండ్ పార్సిల్స్ వివాదాలు 64 వేలు, రెవెన్యూ సమస్యలు 1.14 లక్షల కేసులున్నాయి. వీటిని కేంద్రంతో సమన్వయం చేసుకుని క్లియర్ చేసి ప్రోత్సాహకాల కోసం అప్లై చేసి రూ.500 కోట్లు తెచ్చిన ఘనత మాకే దక్కుతుంది. జగన్‌పై వ్యతిరేకతకు కారణం సర్వే, రీసర్వే కాదు. సర్వే చేసిన తర్వాత కొత్త పాసు పుస్తకాలు ఇవ్వాలి. అయితే వాటిపై జగన్ తన బొమ్మ వేసుకున్నారు. తాతలు, తండ్రులు ఇచ్చిన ఆస్తులపై దేశంలో మరే ఇతర ముఖ్యమంత్రి వారి బొమ్మ వేసుకోలేదు. దీనికి రూ.20 కోట్లు ఖర్చు పెట్టారు. రూ.680 కోట్లు ఖర్చు పెట్టి జగన్ బొమ్మతో సర్వే రాళ్లు వేశారు. భయానకమైన ల్యాండ్ టైట్లింగ్ చట్టం వలన ఏదైనా వివాదం ఉంటే సివిల్ కోర్టులను బైపాస్ చేసి, తహసీల్దారు కార్యాలయాలను మాత్రమే ఆశ్రయించాలన్న నిబంధన పొందుపరిచారు. అక్కడ న్యాయం దక్కలేదంటే హైకోర్టుకు వెళ్లాలి తప్ప సివిల్ కోర్టులకు వెళ్లలేరు. హైకోర్టుకు వెళ్లాలంటే ఫీజుల రూపంలో రూ.లక్షలు ఖర్చు చేయాలి. అంత మొత్తాన్ని పేదలు భరించలేరు. ఈ నేపథ్యంలో వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నేతలు అధికారులపై ఒత్తిడి చేసి భూములు లాక్కొంటారన్న భయాందోళనలు జనంలో వచ్చాయి. అందుకే ప్రజలు వైసీపీని ఘోరంగా ఓడించారు. అంతే తప్ప సర్వే, రీసర్వే వల్ల కాదు' అని పెమ్మసాని స్పష్టం చేశారు.

జూలై చివరికల్లా ఎల్‌నినో?

ఆసియా, పసిఫిక్ క్లైమెట్ సెంటర్ అంచనా.. నైరుతి రుతుపవనాలపై ప్రతికూల ప్రభావం

▸▸ **వర్షాలు తక్కువగా కురుస్తాయని ఆందోళన**

▸▸ **మార్చి నాటికి మరింత స్పష్టత: స్కైమెట్**

విశాఖపట్నం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గత రెండేళ్లు నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశంలో పుష్కలంగా వర్షాలు కురిశాయి. లానినా, ఆ తరువాత తటస్థ పరిస్థితులతో మంచి వర్షాలకు అవకాశం కలిగింది. అయితే ఈ ఏడాది వర్షాల జోరు తగ్గనున్నట్టు ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా వేసింది. జూలై నెలాఖరుకల్లా ఎల్‌నినో ఏర్పడుతుందని పేర్కొంది. దక్షిణ కొరియా కేంద్రంగా పనిచేస్తున్న ఆసియా, పసిఫిక్ క్లైమెట్ సెంటర్ (ఏపీసీసీ) తాజాగా విడుదల చేసిన వాతావరణ అంచనా నివేదిక వివరాలను స్కైమెట్ శనివారం తన వెబ్‌సైట్‌లో పోస్టు చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో ప్రస్తుతం బలహీనమైన లానినా పరిస్థితులు కొనసాగుతున్నాయి. అంటే ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతున్నాయి. ఏపీసీసీ అంచనా ప్రకారం గత నెల నుంచి లానినా బలహీనపడుతూ వస్తోంది. వచ్చే నెలకు పూర్తిగా బలహీనపడి తటస్థ పరిస్థితులు ఏర్పడనున్నాయి. ఏప్రిల్ నెలలో తటస్థ పరిస్థితుల ప్రభావం బలహీనపడి ఎల్‌నినో వైపు మారనుంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జూలై నెలాఖరుకు ఎల్‌నినో ఏర్పడుతుందని ఏపీసీసీ అంచనా వేసినట్లు స్కైమెట్ పేర్కొంది. దీనివల్ల నైరుతి రుతుపవనాల కాలంలో వర్షాలపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై ఈ ఏడాది మార్చిలో పూర్తి స్పష్టత వస్తుందని స్కైమెట్ వివరించింది. కాగా, పసిఫిక్ మహాసముద్రంలోని భూమధ్య రేఖ సమీపంలో ఉన్న ఉపరితల జలాలు సాధారణం కంటే ఎక్కువ వేడెక్కడాన్ని ఎల్‌నినో అంటారు. దీని ప్రభావం భారత్‌లోని నైరుతి రుతుపవనాలపై పడి వర్షాలు తగ్గుతాయి. ఎల్‌నినోకు పూర్తి విరుద్ధంగా ఉండే లానినా పరిస్థితుల్లో పుష్కలంగా వర్షాలు పడతాయి.

నేడు పలుచోట్ల వర్షాలు

సముద్రం నుంచి వీస్తున్న తూర్పుగాలుల ప్రభావంతో శ్రీలంక, తమిళనాడుకు ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ప్రస్తుతం ఉపరితల ద్రోణి విస్తరించింది. దీంతో బంగాళాఖాతం నుంచి తేమగాలులు తమిళనాడు మీదుగా రాయలసీమ, దక్షిణ కోస్తావైపు వీస్తున్నాయి. ఈ ప్రభావంతో తమిళనాడులో వర్షాలు కురుస్తున్నాయి. రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో అక్కడక్కడా శనివారం తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. ఆదివారం పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. కోస్తా, రాయలసీమల్లో చలి ప్రభావం స్వల్పంగా తగ్గుతుందని, ఉత్తరకోస్తాలో పొగమంచు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

టీడీపీ కార్యాలయంలో 105 అడుగుల ఎత్తులో జాతీయ జెండా



అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జనవరి 26న టీడీపీ కేంద్ర కార్యాలయంలో 105 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను ఎగురవేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 20 అడుగుల ఎత్తు, 30 అడుగుల వెడల్పుతో జాతీయ జెండాను ప్రత్యేకంగా ముంబై నుంచి తెప్పించారు. దాని పక్కనే 102 అడుగుల ఎత్తులో పార్టీ జెండాను కూడా ఏర్పాటు చేశారు. ఈ జెండాలను ఎగురవేసే సమయంలో ఎలాంటి అవాంతరాలు రాకుండా ఉండేందుకు ఆటోమేటిక్ మూవింగ్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. దీనిని శనివారం ప్రయోగాత్మకంగా పరిశీలించారు.

జగన్ చేసింది రీసర్వే కాదు.. భూ కబ్జాకు స్కెచ్: మంత్రి కొండపల్లి

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ ఐదేళ్ల కాలంలో చేపట్టిన భూముల రీసర్వే అనేది భూ సంస్కరణ కాదు. భూ కబ్జాల కోసం వేసిన పక్కా స్కెచ్. జగన్‌రెడ్డి సృష్టించిన భూ వివాదాల పుట్ట' అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'విజయనగరం జిల్లాలో 70 శాతం సమస్యలు రీసర్వే వల్లే పుట్టుకొచ్చాయి. అర్హత లేని 5.74 లక్షల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేసి భూ దోపిడీకి తెరలేపారు. పట్టాదారు పాసు పుస్తకాలపై ఫొటోల కోసం రూ.కోట్లు ఖర్చు చేయడం దుర్మార్గం. వైసీపీ హయాంలో జరిగిన తప్పిదాలను సరిచేసేందుకు కూటమి ప్రభుత్వం చేపట్టిన భూముల రీసర్వే అంశంపై జగన్ క్రెడిట్ తీసుకోవాలని చూడటం హాస్యాస్పదం. రాబోయే రెండేళ్లలో రెవెన్యూ సమస్యలన్నింటినీ క్లియర్ చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం' అని మంత్రి కొండపల్లి అన్నారు.

జగన్ కుట్రలకు చెక్ పెట్టేందుకే అమరావతికి చట్టబద్ధత: బాలకోటయ్య

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిపై జగన్ చేస్తున్న కుట్రలకు చెక్ పెట్టేందుకే అమరావతికి చట్టబద్ధ హోదా తీసుకొస్తున్నామని సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'అమరావతిపై జగన్ తొలి నుంచీ విషం చిమ్ముతున్నారు. జగన్‌లాంటి దుర్మార్గులు చేస్తున్న కుట్రల నుంచి రక్షించేందుకే అమరావతికి చట్టబద్ధ హోదా తీసుకొస్తున్నాం. అమరావతి నిర్మాణాల ఖర్చులపైనా జగన్ అసత్య ప్రచారాలు చేస్తున్నారు. చదరపు గజానికి రూ.5 నుంచి రూ.6 వేలు ఖర్చు చేస్తుంటే జగన్ మాత్రం రూ.13 వేలు ఖర్చు చేస్తున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారు' అని బాలకోటయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

జోగి ఓ మానసిక రోగి: నాదెండ్ల బ్రహ్మం

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు సవాళ్లు విసిరే స్థాయి జోగి రమేశ్‌కు లేదని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. 'నకిలీ మద్యం కేసులో బెయిలుపై బయటకు వచ్చిన జోగి మానసిక రోగిలా మాట్లాడుతున్నాడు. తప్పుడు పనులు చేసి అడ్డంగా దొరికిపోయి ఇప్పుడు ప్రమాణాలు చేస్తానంటూ సవాళ్లు విసరడం హాస్యాస్పదం. రమేశ్ వైసీపీ హయాంలో చేసిన అక్రమాలన్నీ త్వరలో బయటకు వస్తాయి' అని బ్రహ్మం అన్నారు.

నేడు టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరగనుంది. ఈనెల 28 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో సమావేశాల్లో ప్రస్తావించాల్సిన అంశాలపై పార్టీ ఎంపీలకు పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు.

పరిటాల రవికి సీఎం నివాళి

మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత పరిటాల రవీంద్ర 21వ వర్ధంతి సందర్భంగా సీఎం చంద్రబాబు ఆయనకు నివాళులర్పించారు. పేదల కోసం కృషి చేసిన రవి భౌతికంగా మనకు దూరమైనా ఆయన పోరాటాలు ఎప్పటికీ గుర్తుంటాయని అన్నారు. మంత్రి లోకేశ్ కూడా పరిటాల రవికి నివాళులర్పించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో రవి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయవాడ పార్లమెంటు పార్టీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి 5 లక్షల ఇళ్లు పూర్తి చేయాలి

▸▸ **సాకులు చెప్పి బాధ్యతల నుంచి తప్పించుకోవద్దు: మంత్రి కొలుసు**

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'పేదల ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్లగలరా? లేదా? మీరు చేయలేకపోతే చెప్పండి.. డిపార్ట్‌మెంట్‌ను మూసేసి ఏ ఇంజనీరింగ్ శాఖలోనో విలీనం చేసేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మీరు ఇలాగే పనిచేస్తామంటే మాత్రం ఇక మీ భవిష్యత్తును ముఖ్యమంత్రే డిసైడ్ చేస్తారు' అంటూ గృహనిర్మాణ శాఖ ఉన్నతాధికారులపై మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని ఉగాది నాటికి 5 లక్షల ఇళ్లు పూర్తి చేయాల్సిందేనని పునరుద్ఘాటించారు. శుక్రవారం విజయవాడలోని గృహనిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల హౌసింగ్ హెడ్‌లు, డివిజనల్ హెడ్‌లతో మంత్రి కొలుసు ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో పలు జిల్లాల పీడీలు క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కొలుసు స్పందిస్తూ.. 'రాష్ట్రంలో రూ.వేల కోట్లు ఖర్చు పెట్టి ఇప్పటికి 15 వేల ఇళ్లు నిర్మించారు. ఇంకా దాదాపు 13వేల ఇళ్లు నిర్మించాల్సి ఉంది. వీటిని ఈ ఏడాది సెప్టెంబరులోగా పూర్తిచేయకపోతే రూ. వేల కోట్ల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. ఇప్పటివరకు కట్టిన ఇళ్లు నివాసయోగ్యంగా లేకపోతే మరి వాటిని ఏం చేయాలి? స్థలం, ఇళ్లు, సదుపాయాలతో కలిపి దాదాపు రూ.30వేల కోట్ల వరకు ఖర్చు చేశారు. సమస్యలున్నాయని సాకులు చెప్పి బాధ్యతల నుంచి తప్పించుకోవడం సరికాదు. కాలనీలకు లబ్ధిదారులను తీసుకువచ్చే బాధ్యత మీదే. వారిని కట్టిన ఇళ్లలో నివాసం ఉండేలా ఒప్పించండి. అంగీకరించని వారిని ఆ ఇళ్లు వద్దని రాసి ఇవ్వమనండి. వాటిని మిగతా పేదలకు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది' అని మంత్రి దిశానిర్దేశం చేశారు. ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే వదిలేసిపోయిన కాంట్రాక్టర్లపై కేసులు పెట్టాలని మంత్రి ఆదేశించారు. ఇళ్లు కట్టడానికి ముందుకొచ్చే కాంట్రాక్టర్లకు అవకాశం కల్పించాలన్నారు.

పండ్ల ఉత్పత్తులపై రైతు సదస్సులు

▸▸ **నెలాఖరున ఏలూరులో కోకో కాంక్లేవ్.. ఉద్యాన శాఖ నిర్ణయం**

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 22 రకాల పండ్ల ఉత్పత్తులపై జిల్లాల్లో రైతు సదస్సులు నిర్వహించాలని ఉద్యాన శాఖ నిర్ణయించింది. పండ్ల ఉత్పత్తులకు నాణ్యత, మార్కెటింగ్, మంచి ధర వచ్చే లక్ష్యంతో పంటల వారీగా జిల్లాల్లో సదస్సులు ఏర్పాటు చేయనున్నది. దీనిలో భాగంగా ఈ నెల 30, 31 తేదీల్లో ఏలూరులో కోకో కాంక్లేవ్-2026 నిర్వహించనున్నది. ఈసారి పండ్ల తోటల్లో యాజమాన్య పద్ధతులతోపాటు నాణ్యతమైన పండ్ల ఉత్పత్తికి పంట కోత అనంతర పరిజ్ఞానం, ఉప ఉత్పత్తుల తయారీ, వాటి మార్కెటింగ్, ఉత్పత్తులకు అదనపు విలువ జోడింపు అంశాలపైనా రైతులకు అవగాహన కల్పించనున్నట్లు ఉద్యాన శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు శనివారం 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కోకో, మామిడి, అరటి, జీడిమామిడి, డ్రాగన్, దానిమ్మ, బత్తాయి, మిర్చి, కాఫీ తదితర పంటలపై సదస్సులు నిర్వహించనున్నారు. ముఖ్యంగా ఆయా జిల్లాల్లోని ప్రధాన పంటపై దృష్టి సారించి, మిగతా పంటల్లోనూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కోల్డ్ చెయిన్ సౌకర్యాలు, ఎగుమతులకు అనుకూలమైన అంశాలపైనా రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఉద్యాన శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, మార్కెటింగ్ ప్రతినిధులు సదస్సుల్లో పాల్గొని, ఏ పంటని ఏవిధంగా పండిస్తే.. మంచి ధర వస్తుందో వివరిస్తారు. సూక్ష్మసేద్యంలో ఆటోమేషన్ విధానంతో పాటు, పండ్ల తోటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న రాయితీలు, ఇతర పథకాలపై రైతులకు అవగాహన కల్పిస్తారు.

పోలవరం నిర్వాసితులకు జూన్‌లోగా పరిహారం

- 21,709 కుటుంబాలకు రూ.2427.98 కోట్లు అవసరమని అంచనా
- డిసెంబరులోగా పునరావాస కాలనీలు పూర్తి

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు తొలి దశ (41.15 మీటర్ల కాంటూరు) నిర్వాసితులకు జూన్‌లోగా పరిహారం అందజేయాలని జల వనరుల శాఖ నిర్ణయించింది. మొత్తం 21,709 నిర్వాసిత కుటుంబాలకు రూ.2,427.98 కోట్లు అవసరమని అంచనా వేస్తోంది. ప్రాజెక్టు తొలిదశ పనులు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న జల వనరుల శాఖ, ఆలోగా నిర్వాసితులకు పునరావాస కాలనీలను కూడా సిద్ధం చేయాలని నిర్ణయించుకుంది. తొలిదశలో 1,00,099.58 ఎకరాలను సేకరించాల్సి ఉండగా, ఇప్పటికే 91,126.96 ఎకరాలను సేకరించింది. తొలి దశలో 38,060 నిర్వాసిత కుటుంబాలను రెవెన్యూ, జల వనరుల శాఖలు గుర్తించాయి. వీరి కోసం 75 పునరావాస కాలనీలను నిర్మించాలని నిర్ణయించారు. వీటిలో 28 కాలనీల నిర్మాణం పూర్తయ్యింది. మరో 49 కాలనీలు నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటికే పునరావాస కాలనీలకు 16,291 కుటుంబాలను తరలించారు. మరో 21,769 కుటుంబాలను తరలించాల్సి ఉంది. భూమికి భూమి ఇవ్వడం కోసం 17,114 కుటుంబాలను గుర్తించారు. వీరి కోసం 7,012 ఎకరాలను సేకరించాల్సి ఉండగా.. 5,911.34 ఎకరాలు సేకరించారు. పునరావాస కాలనీలను డిసెంబరులోగా నిర్మించాలని నిర్ణయించుకుంది.

కేసీ కెనాల్‌కు రబీలోనూ నీరు

- జూలై వరకూ తాగు, సాగు నీరిస్తాం: జలవనరుల శాఖ

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్ ఆయకట్టు పరిధిలో రెండో పంట(రబీ)కూ నీరివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతుల కష్టాలపై మానవతా దృక్పథంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు జూలై దాకా సాగు, తాగు నీరందిస్తామని జల వనరుల శాఖ శనివారం ప్రకటించింది. ఈ నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని రైతాంగానికి విజ్ఞప్తి చేసింది. తుంగభద్ర డ్యామ్‌కు కొత్త గేట్లను అమర్చాలని కేంద్ర జల సంఘం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో కేసీ కెనాల్ ఆయకట్టు పరిధిలో రెండో పంటకు నీరందించలేమని గతంలో చెప్పామని జల వనరుల శాఖ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. తుంగభద్ర డ్యామ్‌లో నీటి నిల్వను 80 టీఎంసీలకు పరిమితం చేసినందువల్ల కేసీ కెనాల్ పరిధిలో రెండో పంటకు నీరందించడం సాధ్యం కాదని గతేడాది డిసెంబరు 2న నంద్యాలలో జరిగిన జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశంలో ప్రకటించింది. అయినప్పటికీ నందికొట్కూరు, పాణ్యం, శ్రీశైలం నియోజకవర్గాల రైతులు సుమారు 40,500 ఎకరాల్లో రబీ పంటను వేశారని తెలిపింది. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యేలు జయసూర్య, గౌరు చరితారెడ్డి, బుడ్డా రాజశేఖరరెడ్డి గత రెండు రోజులుగా మల్యాల, ముచ్చుమర్రి నుంచి నీరు విడుదల చేయాలని సీఎం చంద్రబాబు, మంత్రి నిమ్మల రామానాయుడును కోరారని జల వనరుల శాఖ వివరించింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులలోని నీటి నిల్వలను పరిగణనలోనికి తీసుకుని కేఆర్ఎంబీ ద్వారా కేటాయించిన కోటాకు లోబడి సాగు, తాగు నీటిని జూలై వరకూ అందించనున్నట్టు తెలిపింది.

కొత్త కొత్తగా... సుదీర్ఘంగా

సమూలంగా మారిన ఇంటర్ పరీక్షలు

- 16 నుంచి 23కు పెరిగిన పరీక్ష రోజులు
- ఈ ఏడాది నుంచి ఒకరోజు ఒక్క సబ్జెక్టే
- ఎంబైపీసీ బాటలో చాలా మంది విద్యార్థులు
- ప్రాక్టికల్ పరీక్షలకు హాల్ టికెట్లు విడుదల
- ఏ కారణంతోనూ హాల్ టికెట్లు ఆపొద్దు: సెక్రటరీ



అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షల్లో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. ఇంటర్ విద్యామండలి తీసుకొచ్చిన సంస్కరణల నేపథ్యంలో పరీక్షల స్వరూపం చాలా వరకు మారిపోయింది. ముఖ్యంగా ప్రతి సంవత్సరం 16 రోజుల్లో పరీక్షలు ముగుస్తుండగా.. ఈ ఏడాది నుంచి 23 రోజుల పాటు పరీక్షలు జరగనున్నాయి. పాత విధానంలో ఒక్కో రోజు రెండు లేదా మూడు సబ్జెక్టుల పరీక్షలు జరిగేవి. కానీ, ఇప్పుడు 'ఎలక్టివ్' విధానంతో ఒక రోజు ఒక సబ్జెక్టు పరీక్ష మాత్రమే నిర్వహించనున్నారు. మరోవైపు ఎలక్టివ్ విధానంతో విద్యార్థులు వారి కాంబినేషన్‌కు సంబంధం లేని సబ్జెక్టులు తీసుకుంటున్నారు. అనేక మంది విద్యార్థులు ఎంబైపీసీ చదువుతున్నారు. ఇలాంటి వారికి నూతన విధానం మేలు చేయనుంది.

ఆరు నుంచి ఐదు!

చాలా కాలం నుంచి ఇంటర్మీడియట్‌లో గణితం ఏ, బీ రెండు సబ్జెక్టులుగా ఉంది. దీనిని ఈ విద్యా సంవత్సరంలో ఒకే సబ్జెక్టుగా మార్చారు. అలాగే వృక్ష, జంతు శాస్త్రాలు రెండు సబ్జెక్టులుగా ఉంటే వాటిని కూడా కలిపి బయాలజీ చేశారు. దీంతో ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో సబ్జెక్టులు ఆరు నుంచి ఐదుకు తగ్గాయి. రెండు గ్రూపుల విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు కామన్‌గా ఉంటాయి. ఇంగ్లిష్ సబ్జెక్టును మాత్రం ఆర్ట్స్‌తో సహా అన్ని గ్రూపుల విద్యార్థులు తప్పనిసరిగా తీసుకోవాలి. మరొక సబ్జెక్టును ఎలక్టివ్‌గా తీసుకోవచ్చు. దీంతో ఇంటర్మీడియట్‌లో ఉన్న మొత్తం 24 సబ్జెక్టుల నుంచి ఏ గ్రూపు విద్యార్థి అయినా ఏ సబ్జెక్టునైనా ఎలక్టివ్‌గా ఎంపిక చేసుకోవచ్చు. దీంతో చాలా మంది విద్యార్థులు వారి గ్రూపు కాంబినేషన్‌కు ఏమాత్రం సంబంధం లేని సబ్జెక్టులు తీసుకున్నారు. సీఈసీ విద్యార్థుల్లో అనేక మంది చరిత్ర(హిస్టరీ) తీసుకున్నారు. ఆశ్చర్యకరంగా ఎంపీసీ విద్యార్థుల్లో చాలా మంది జాగ్రఫీ తీసుకుని చదువుతున్నారు. అలాగే కామర్స్, చరిత్ర తీసుకున్న వారు కూడా ఉన్నారు. సుమారు 3 వేల మంది విద్యార్థులు వారి గ్రూపునకు సంబంధం లేని సబ్జెక్టులు ఎంచుకున్నారు.

వారికి మరింత అవకాశం

ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు ఇంటర్ విద్యామండలి మరింత విస్తృత అవకాశం కల్పించింది. మిగిలిన గ్రూపులకు లేనివిధంగా అదనపు సబ్జెక్టు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో సుమారు వెయ్యి మంది ఎంపీసీ విద్యార్థులు బయాలజీని, 3 వేల మంది బైపీసీ విద్యార్థులు గణితాన్ని అదనపు సబ్జెక్టుగా తీసుకుని చదువుతున్నారు. అలాగే, ఎంపీసీ విద్యార్థులు బయాలజీని, బైపీసీ విద్యార్థులు గణితాన్ని ఎలక్టివ్ సబ్జెక్టుగా ఎంపిక చేసుకున్నారు. అయితే, ఎలక్టివ్ సబ్జెక్టులా తీసుకుంటే తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది. అదే అదనపు సబ్జెక్టుగా తీసుకుంటే ఉత్తీర్ణత తప్పనిసరి కాదు. ఉతీర్ణులైతే అదనపు మెమో జారీ చేస్తారు. ఇలా చదవడం వల్ల విద్యార్థులు ఎంబైపీసీ చదివినట్లు అవుతుంది. దానివల్ల భవిష్యత్తులో ఇంజనీరింగ్, మెడిసిన్ వైపు వెళ్లే వెసులుబాటు ఉంటుంది. సబ్జెక్టుల విలీనం వల్ల మార్కులు కూడా మారాయి. అలాగే, థియరీ పరీక్షలు రాసేందుకు ఇప్పటి వరకు 24 పేజీల బుక్‌లెట్ ఇస్తుంటే ఇకపై 32 పేజీల బుక్‌లెట్లు ఇవ్వనున్నారు. ఇప్పటివరకు గణితం ఏ, బీ సబ్జెక్టులు 75 మార్కుల చొప్పున 150 మార్కులకు పరీక్షలు జరిగేవి. కొత్త విధానంలో ఈ ఏడాది 100 మార్కులతోనే పరీక్ష జరుగనుంది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల్లో 85 మార్కులతో పరీక్షలు జరుగుతాయి. ఉత్తీర్ణతకు 35శాతం మార్కులు సాధించాలి.

1 నుంచి ప్రాక్టికల్స్

ప్రాక్టికల్స్ పరీక్షలు ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రాక్టికల్స్‌కు హాజరయ్యే విద్యార్థులకు హాల్ టికెట్లు విడుదల చేసినట్లు ఇంటర్ విద్యా మండలి కార్యదర్శి పి. రంజిత్ బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్, ఆధార్ నంబర్లు, పుట్టిన తేదీలతో http://bie.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. అలాగే వాట్సాప్‌లో మనమిత్ర-9552300009కు మెసేజ్ చేసి కూడా హాల్‌టికెట్లు తీసుకునే సౌకర్యం ఉందన్నారు. కాలేజీల ప్రిన్సిపాళ్లు వారి లాగిన్‌ల ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు పంపిణీ చేయొచ్చని తెలిపారు. ఫీజులు, ఇతర కారణాలతో విద్యార్థుల హాల్ టికెట్లను నిలిపివేయరాదని స్పష్టం చేశారు.

లైనిక్స్ కండక్టర్ల టెండర్లు రద్దు

- 'ఊరికో రేటు'పై సీఎస్ సీరియస్
- ఆంధ్రజ్యోతి కథనంపై స్పందన

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు పంపిణీ నష్టాలను తగ్గించేందుకు ఉద్దేశించిన లైనిక్స్ కండక్టర్ల టెండర్లలో ఊరికో రేటును నిర్ణయించడంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ స్పందించారు. లైనిక్స్ కండక్టర్ల రేటును విశాఖపట్నం జిల్లాలో ఓ రకంగా నెల్లూరులో మరో రకంగా ఆ రేట్లు ఉండటంపై 'ఆంధ్రజ్యోతి' ఈ నెల 21న 'ఊరికో రేటు' శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. ఈ కథనంపై స్పందించిన సీఎస్ మొత్తం లైనిక్స్ కండక్టర్ల టెండర్ల వ్యవహారంపై అధికారులను వివరాలు కోరారు. ఒకే రకమైన కండక్టర్లకు 3 టెండర్లలో 3 వేర్వేరు ధరలను పిలవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే టెండర్లను రద్దు చేసి ఏసీఎస్ఎస్ కండక్టర్లకు రాష్ట్రవ్యాప్తంగా ఒకే ధరను నిర్ణయించి మళ్లీ టెండర్లను పిలవాలని ఆదేశించారు. సీఎస్ ఆదేశాలతో ట్రాన్స్‌కో అధికారులు ఇప్పటికే పిలిచిన టెండర్లను రద్దు చేసి, మరోసారి టెండర్లు పిలిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, నెల్లూరు జిల్లాలోని రాచర్లపాడు-కావలి మధ్య 132 కేవీ లైన్‌లో 76 కిలోమీటర్ల మేర ఏసీఎస్ఎస్ లైనిక్స్ కండక్టర్ ఏర్పాటు చేసేందుకు కిలోమీటరుకు రూ.2,43,430గా ధరను నిర్ణయించగా, విశాఖపట్నం జిల్లాలో పిలిచిన టెండరులో కిలోమీటరుకు రూ.2,58,095లుగా ధరను నిర్ణయించారు. ఆంధ్రజ్యోతి కథనం ప్రచురితమైన రోజే కందుకూరు-కావలి లైనులో 100 కిలోమీటర్లకు ఏసీఎస్ఎస్ లైనిక్స్ కండక్టర్ల ఏర్పాటుకు పిలిచిన టెండర్లలో కిలోమీటరుకు రూ.2,51,486గా పేర్కొన్నారు.

రాజధాని విద్యుత్తు పనుల్లో వేగం పెంచండి: సీఎస్

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అమరావతిలో ప్రస్తుతం కోర్ క్యాపిటల్ మీదుగా వెళుతున్న 400 కేవీ, 200 కేవీ ఎక్స్‌ట్రా హైటెన్షన్(ఈహెచ్‌టీ) విద్యుత్తు లైన్లను రీరూట్ చేసే పనులను వేగవంతం చేయాలని సీఆర్డీయే, ట్రాన్స్‌కో అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. అమరావతిలో సాగుతున్న విద్యుత్తు పనుల పురోగతిపై సీఆర్డీయే కమిషనర్ కన్నబాబు, జేఎండీ ట్రాన్స్‌కో సూర్యసాయి ప్రవీణ్ చంద్ తదితరులతో సీఎస్ క్యాంపు కార్యాలయంలో శనివారం సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ.. పనులకు సంబంధించి దశలవారీ పురోగతితో పాటు నిర్ణీత సమయానికి పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా అడ్డంకులు లేదా ప్రాజెక్టు అమలు సంబంధిత సమస్యలు తలెత్తితే పరిష్కరించాలని, పనుల పురోగతిని పర్యవేక్షించాలని సీఆర్డీయే, ట్రాన్స్‌కోకు సూచించారు.

బీపీసీఎల్, ఇండోసోల్ ప్రాజెక్టుల భూసేకరణ బాధ్యతలు నెల్లూరు కలెక్టర్‌కే!

- రెవెన్యూ శాఖ ఉత్తర్వులు

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలోని గుడ్లూరు, ఉలవపాడు మండలాల్లో రెండు కీలక ప్రాజెక్టులకు భూసేకరణ బాధ్యతలను నెల్లూరు జిల్లా కలెక్టర్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ శనివారం ఉత్తర్వులు (జీవో-54) జారీచేశారు. ఇంతకు ముందు గుడ్లూరు మండలంలోని రావూరు, చేవూరు గ్రామాలు, ఉలవపాడు మండలంలోని కరేడు గ్రామం నెల్లూరు జిల్లాలో ఉన్నాయి. ఇటీవలి జిల్లాల పునర్విభజన తర్వాత ఈ రెండు మండలాలు నెల్లూరు నుంచి తిరిగి ప్రకాశం జిల్లాలోకి వచ్చాయి. అయితే ఆయా మండలాలు నెల్లూరు జిల్లాలో ఉన్నప్పుడే చేవూరులో బీపీసీఎల్ రిఫైనరీకి, కరేడులో ఇండోసోల్ ప్రాజెక్టుకు భూసేకరణ ప్రారంభించారు. ఇప్పుడు ఆ గ్రామాలు ప్రకాశంలోకి రాగా.. సాధారణంగా అయితే ఆ జిల్లా కలెక్టర్‌నే భూసేకరణ బాధ్యతలు చూడాలి. అయితే నెల్లూరు జిల్లాలో ఆ గ్రామాలున్నప్పుడే, ఆ జిల్లా కలెక్టర్ హిమాంశు శుక్లా ఆ రెండు ప్రాజెక్టులకు భూసేకరణ నోటిఫికేషన్లు ఇచ్చారు. రైతులతో మాట్లాడి భూములు ఇచ్చేందుకు ఒప్పించారు. ప్రస్తుతం భూసేకరణ పనులు కీలక దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో నెల్లూరు కలెక్టరే ఆ రెండు ప్రాజెక్టుల భూసేకరణ బాధ్యతలు చూడాలని సర్కారు ఆదేశించింది.

కొత్తగా 13 డయాలసిస్ కేంద్రాలు

- సీతంపేట, ఎస్.కోట ఆస్పత్రుల్లో త్వరలో ప్రారంభం: మంత్రి సత్యకుమార్

అమరావతి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ కిడ్నీ రోగులకు కష్టాలు తొలగించేలా రాష్ట్రంలో కొత్తగా 13 డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు వేగవంతం చేసినట్లు ఆరోగ్య మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఇంతకుముందు ప్రకటించిన వాటితో పాటు కొత్తగా మంజూరైన ఐదింటితో కలిపి మొత్తం 13 సెంటర్లు సెకండరీ హెల్త్ ఆస్పత్రుల్లో రాబోతున్నాయని ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ప్రధాన మంత్రి నేషనల్ డయాలసిస్ ప్రోగ్రామ్ (పీఎంఎన్‌డీఎస్) కింద తిరుపతి జిల్లా రైల్వేకోడూరు, ప్రకాశం జిల్లా కొండపి, తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, కడప జిల్లా మైదుకూరు, ఎన్టీఆర్ జిల్లా నందిగామలోని సీహెచ్‌సీల్లో డయాలసిస్ కేంద్రాలు మంజూరైనట్లు వెల్లడించారు. ఇప్పటికే భీమవరం, పీలేరు, వెంకటగిరి, అద్దంకి, సున్నిపెంట, జమ్మలమడుగులో కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ టెండర్ దశలో ఉన్నాయన్నారు. రెండు కేంద్రాలు గిరిజన ప్రాంతాలైన సీతంపేట, ఎస్.కోట ఆసుపత్రుల్లో సిద్ధమయ్యాయని, వీటిల్లో అతి త్వరలో సేవలు ప్రారంభం అవుతాయని, మిగిలిన కేంద్రాలు ఏప్రిల్ నాటికి సిద్ధం అవుతాయని తెలిపారు. ఒక్కొక్క కేంద్రంలో సుమారు రూ.85 లక్షల విలువ చేసే రక్త శుద్ధి యంత్రాలు, పరికరాలు అందుబాటులోకి వస్తాయన్నారు. 13 కేంద్రాలకు కలిపి రూ.11.05 కోట్ల వరకూ వ్యయం చేస్తున్నామన్నారు. ఒక్కొక్క కేంద్రంలో ఐదు చొప్పున మిషన్లు ఉంటాయని, ప్రతి కేంద్రంలో రోజుకి మూడు సెషన్లలో రక్తశుద్ధి జరుగుతుందన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కింద కిడ్నీ రోగులకు ఉచిత డయాలసిస్ సేవలు అందుతున్నాయన్నారు. 2024-25లో కిడ్నీ బాధితుల కోసం రూ.164 కోట్లు వరకూ కూటమి ప్రభుత్వం ఖర్చు చేసిందని వివరించారు.

ప్రియుడి భార్యకు హెచ్ఐవీ ఇంజెక్షన్

- కర్నూలులో నిర్ఘాంతపోయే ఘటన
- సినిమా సీన్ తలపించేలా నాటకం
- స్కూటీని ఢీకొట్టి సహాయం చేస్తున్నట్లు డ్రామా
- ఇంజెక్షన్ చేసి అక్కడి నుంచి పరారీ
- బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు
- నలుగురు నిందితుల గుర్తింపు
- వివరాలు వెల్లడించిన కర్నూలు డీఎస్పీ

కర్నూలు క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ఇల్లెందులో జరిగిన యధార్థ సంఘటన ఆధారంగా ఇటీవల 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా వచ్చింది. తనకు నచ్చని వ్యక్తిని ప్రేమించిందన్న కోపంతో హెచ్ఐవీ పాజిటివ్ రక్తాన్ని కన్న కుమార్తెకు తండ్రి ఇంజెక్షన్ చేయడం ఆ సినిమా ప్రధాన ఇతివృత్తం. సరిగ్గా అలాంటి సంఘటనే ఒకటి కర్నూలు జిల్లాలో ఇటీవల జరిగింది. అయితే ఇక్కడ ఇంజక్షన్ చేసిన వ్యక్తి తండ్రి కాదు. అసూయతో రగిలిపోయిన ఓ మహిళ ఈ ఘోరానికి పాల్పడింది. తాను ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకుందనే అక్కసుతో సాటి మహిళకు హెచ్ఐవీ రక్తాన్ని ఇంజెక్షన్ చేసింది. సభ్య సమాజం నిర్ఘాంతపోయేలా ఉన్న ఆ ఘటనకు సంబంధించిన వివరాలను శనివారం సాయంత్రం కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 9వ తేదీన మధ్యాహ్న సమయంలో మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళా డాక్టర్ స్కూటీపై ఇంటికి వెళుతున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మోటార్ సైకిల్‌పై వచ్చి ఢీకొట్టారు. ఆ డాక్టర్ కిందపడిపోవడంతో అక్కడే ఉన్న ముగ్గురు మహిళలు, ఓ వ్యక్తి సాయం చేస్తున్నట్లు నటించి ఆటో ఎక్కిస్తామని చెప్పి ఆ సమయంలో ఆ మహిళా డాక్టర్‌కు ఓ ఇంజక్షన్ చేశారు. ఆ మహిళా డాక్టర్ గట్టిగా కేకలు వేయగా, వారు అక్కడి నుంచి పారిపోయారు. వెంటనే ఆ వైద్యురాలు భర్తకు సమాచారం ఇచ్చింది. తనపై విష ప్రయోగం జరిగిందని భావించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలు, సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా ఆ సమయంలో నలుగురు నిందితులు అక్కడ ఉన్నట్లుగా గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. బీచుపల్లి బోయ వసుంధర అలియాస్ వేదవతి (కర్నూలు), కొంగె జ్యోతి (ఆదోని), భూమా జశ్వంత్ (మంత్రాలయం), భూమా శృతి (మంత్రాలయం)లను నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుల్లో వసుంధర అనే మహిళ నర్సుగా పని చేస్తోంది. ఆమె గతంలో ఓ డాక్టర్‌ను ప్రేమించింది. అయితే ఆ డాక్టర్ వసుంధరను కాదని వైద్యురాలిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో వసుంధర తన ప్రియుడిని పెళ్లి చేసుకున్న వైద్యురాలిపై ద్వేషం పెంచుకుంది. ఆ వైద్యురాలికి హెచ్ఐవీ ఇంజెక్షన్ చేయాలని ప్లాన్ వేసింది. ఇందుకు ఆమె ఇతర నిందితుల సహకారం తీసుకుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హెచ్ఐవీ పేషెంట్ల నుంచి ఇతర నర్సుల సహకారంతో హెచ్ఐవీ వైరస్‌తో కూడిన రక్తాన్ని సేకరించింది. ఆ రక్తాన్ని సదరు వైద్యురాలిపై ఇంజెక్షన్ రూపంలో ప్రయోగించింది. నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. హెచ్ఐవీ పేషెంట్ల రక్తాన్ని ఇచ్చిన నర్సులపైనా చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు. విలేకరుల సమావేశంలో కర్నూలు త్రీటౌన్ సీఐ శేషయ్య, ఎస్ఐలు బాలనరసింహులు, ఆశాలత తదితరులు ఉన్నారు.

'ప్రియుడి' భార్య, కుమారుడు, తల్లిపై పెట్రోల్ పోసి నిప్పు

వివాహేతర సంబంధంలో వివాదం

- మొత్తం 10 మందికి గాయాలు.. గుంటూరు జిల్లాలో ఘటన

చేబ్రోలు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం కారణంగా ఏర్పడిన వివాదంతో ఓ యువతి తన ప్రియుడి ఇంటి మీద పెట్రోలుతో దాడి చేసింది. ఈ ఘటనలో 10 మంది వరకు గాయపడ్డారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం సుద్ధపల్లి గ్రామానికి చెందిన ఆలంకుంట మల్లేశ్‌కు, తెనాలి సీఎం కాలనీకి చెందిన దుర్గ అనే యువతికి మధ్య కొంత కాలంగా వివాహేతర సంబంధం కొనసాగుతున్నట్టు తెలిసింది. ఇటీవల ఇరువురి మధ్య మనస్పర్థలు రావడంతో తెనాలిలో రాజీ ప్రయత్నాలు జరిగాయి. అయితే అవి విఫలమయ్యాయి. దీంతో ఆగ్రహానికి గురైన దుర్గ.. పెట్రోలు క్యాన్‌తో సుద్ధపల్లిలోని మల్లేశ్ ఇంటికి శనివారం రాత్రి చేరుకుంది. ఆ సమయంలో మల్లేశ్ ఇంట్లో లేకపోవడంతో అక్కడే ఉన్న మల్లేశ్ భార్య అర్చన, తల్లి పద్మ, కుమారుడు అరుణ్‌పై పెట్రోలు పోసింది. అంతటితో ఆగకుండా ఇంటి మీద కూడా పెట్రోలు చల్లి నిప్పంటించింది. ఈ సమయంలో దుర్గపై కూడా పెట్రోలు పడటంతో ఆమెతో పాటు నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా, వారిలో ఆరుగురికి కూడా గాయాలయ్యాయి. ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పెట్రోలుతో దాడిలో గాయపడిన మల్లేశ్ కుటుంబ సభ్యులు

యువత మత్తుకు దూరంగా ఉండాలి

వివాహాలను సులభతరం చేయాలి.. ఇస్తేమాలో ధార్మిక పండితుల పిలుపు

కడప, జనవరి 24(ఆంధ్రజ్యోతి): యువత బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తోందని, మత్తు ఊబిలో కూరుకుపోకుండా వారిలో చైతన్యం కలిగించి సన్మార్గం వైపు మరలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఢిల్లీ నిజాముద్దీన్‌కు చెందిన ఇస్లాం ధార్మిక పండితుడు హజరత్ మౌలానా సాబ్ కాందలవి పేర్కొన్నారు. కడప జిల్లా సీకేదిన్నె మండలం కొప్పర్తి పారిశ్రామికవాడలో తబ్లిక్ జమాత్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఇస్తేమా రెండో రోజైన శనివారమూ కొనసాగింది. ఉదయం నుంచి రాత్రి వరకు పలువురు ధార్మిక పండితులు ఉపన్యసించారు. సమాజంలో శాంతి నెలకొని, భేదాభిప్రాయాలు తొలగాలంటూ సామూహిక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మౌలానా సాబ్ కాందలవి, మౌలానా యూసుఫ్‌సాబ్ కాందలవి మాట్లాడుతూ మద్యం, జూదం తదితర వ్యసనాలకు నేటి యువత బానిసగా మారుతున్నదని, ఈ పరిణామం రేపటి తరానికి నష్టం చేకూర్చుతుందని హెచ్చరించారు. యువత బాధ్యతను గుర్తుచేసి, వారికి నమాజ్, సత్కార్యాలు, పాపభీతుల తారతమ్యాలను వివరించి దైవభీతితో రుజుమార్గంలో పయనించేలా చేయడమే ఇస్తేమా మూల ఉద్దేశ్యమని వివరించారు. వివాహాలను సులభతరం చేయాలని కోరారు. ఆర్భాటాలు, అట్టహాసాలతో ఆడపిల్లల కుటుంబాలపై అనవసరమైన ఖర్చులు మోపరాదన్నారు. వరకట్నం పేరిట అధిక మొత్తాల్లో నగదు, బంగారం వసూలు చేయడం సమ్మతం కాదన్నారు. పెళ్లి వయసు వచ్చినా వివాహాలు కాక తల్లిదండ్రులకు భారంగా మారుతున్నారని, దీనిని సమతుల్యం చేయాల్సిన బాధ్యత ముస్లిం సమాజంపై ఉందని చెప్పారు. మంచిని వ్యాప్తి చేయడానికి ప్రతి ఒక్కరూ భూమండలంపై విస్తరించాలన్నారు. మానవ జన్మ ఎంతో విలువైందని, ఇహ పరలోక సాఫల్యం కోసం సత్కార్యాలు తప్ప మరో దారి లేదని వివరించారు.



కడప జిల్లా కొప్పర్తిలో ఇస్తేమాకు హాజరైన ముస్లింలు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.